PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 350 | విజయవాడ, గురువారం 20 జులై 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 20 July 2023 | Rs

సిటీ

21 నుంచి ఎస్ఐ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గతేడాది నవంబరు 28న విడుదలైన సివిల్, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ల నోటిఫికేషన్‌లో అర్హులైన 57,923 మంది అభ్యర్థులకు ఈ నెల 21 నుంచి ఆగస్టు 4 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టనున్నట్లు రాష్ట్రస్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ అతుల్ సింగ్ తెలిపారు. సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు ఫిబ్రవరి 19న నిర్వహించిన ఈ పరీక్షల్లో క్వాలిఫై అయిన 57,923 మందికి విశాఖపట్నం, ఏలూరు, గుంటూరు, కర్నూలులో ఈ సర్టిఫికేట్ల వెరిఫికేషన్ వుంటుందని తెలిపారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థులంతా slrb.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

పోలవరం నిర్వాసితుల పునరావాసంపై నేడు రాజమండ్రిలో భేటీ

- సిపియం ప్రతినిధి బృందంతో ప్రభుత్వం చర్చలు

ప్రజాశక్తి- రాజమండ్రి రూరల్

పోలవరం నిర్వాసితుల సమస్యలపై గురువారం ఉదయం 10 గంటలకు ధవళేశ్వరంలోని ఆర్ అండ్ ఆర్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి పోలవరం పోరు కేక పేరుతో ఇటీవల మహా పాదయాత్ర నిర్వహించిన సిపిఐ(ఎం) నాయకులను ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. మొదటి విడత సమావేశం అమరావతిలో జరిగింది. రెండవ విడత సమావేశం ధవళేశ్వరంలో జరుగుతుంది. ఈ సమావేశానికి సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు నేతృత్వంలోని పార్టీ ప్రతినిధి బృందం హాజరుకానుండగా, ప్రభుత్వం నుంచి రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఇతర ఉన్నతాధికారులు హాజరు కానున్నారు.

ప్రత్యేక హోదా, పోలవరం, విశాఖ ఉక్కు విభజన హామీలపై

కేంద్రాన్ని నిలదీయండి

వైసిపి, టిడిపిలకు సిపిఎం సూచన

- ప్రజాతీర్పును వమ్ము చేయొద్దని హెచ్చరిక
- జనసేన ఎన్‌డిఎలో చేరడం ఆత్మహత్యాసదృశం
- యుసిసి బిల్లును పార్లమెంటులో వ్యతిరేకించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, వై వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పార్లమెంటు సమావేశాల్లో ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ, పోలవరం నిర్వాసితుల సమస్యలపై కేంద్రాన్ని నిలదీయాలని వైసిపి, టిడిపిలను సిపిఎం కోరింది. బుధవారం విజయవాడలోని సిపిఎం రాష్ట్ర కార్యాలయం సమీపంలోని ఎంబివికెలో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావుతో కలిసి మాట్లాడారు.

దేశంలో మోడీపై భ్రమలు తొలగిపోయాయని, దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెట్టడం తప్ప మరొకటి చేయలేదని ప్రజలకు అర్థమైందని అన్నారు. ఎన్‌డిఎ సమావేశానికి హాజరైన 38 పార్టీల్లో 24 పార్టీలకు పార్లమెంటులో ప్రాతినిధ్యమే లేదని, మరికొన్ని పార్టీలకు అసలు గుర్తింపే లేదని విమర్శించారు. రాష్ట్రంలో జనసేన పార్టీ ఆ సమావేశానికి వెళ్లిందని, ఏం సాధించిందో ప్రజలకు వివరణ ఇవ్వాలని అన్నారు. మరోవైపు రాష్ట్రం విడిపోయి దాదాపు పదేళ్లు కావస్తున్నా కేంద్రంలో బిజెపి ఒక్క హామీని కూడా అమలు చేయలేదని తెలిపారు. ఇచ్చిన మాట తప్పి ద్రోహం చేయడమే గాకుండా రాష్ట్ర అభివృద్ధికి తీవ్ర ఆటంకంగా మారిందని విమర్శించారు. ప్రతిఘటించే ప్రజల మధ్య, పార్టీల మధ్య చీలికలు తెచ్చి దేశాన్ని బలహీనపరుస్తోందని తెలిపారు. ఈ స్థితిలో రాష్ట్ర హక్కుల కోసం గట్టిగా నిలబడి పోరాడాల్సిన అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని బిజెపికి తాకట్టు పెడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేంద్ర షరతులకు తలవంచి ప్రజలపై భారాలు

రాష్ట్రం ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిందని, ఏ ఒక్క ప్రాజెక్టూ పూర్తికాలేదని, ఉపాధి, ఉద్యోగాలు లేవని అన్నారు. ఆఖరికి జీతభత్యాలకు సైతం అడుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. అప్పులు అసాధారణంగా పెరిగిపోతున్నాయని, ప్రజల సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి కేంద్రంతో పోరాడి నిధులు తెచ్చుకోవాల్సింది పోయి రుణం కోసం వారు పెట్టిన షరతులకు తలవంచి ప్రజలపై మరిన్ని భారాలు మోపుతున్నారని, ధరల పెరుగుదలకు ఈ విధానాలే కారణమని అన్నారు. విద్యుత్ ఛార్జీలు మోయలేనంతగా పెరిగాయని, ఆస్తిపన్ను, చెత్తపన్ను యూజర్ ఛార్జీల పేరుతో ప్రజల మాడు పగలగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజల మనోభావాలను అర్థం చేసుకుని వైసిపి, టిడిపి కేంద్రంతో పోరాడటానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

నిగ్గదీసి అడగాలి

ఈ పార్లమెంటు సెషన్‌లో రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని నిలదీయడమే గాకుండా అవసరమైతే ఏ తరహా పోరాటానికైనా మిగతా 7లో



క్షతగాత్రులను హెలికాప్టర్ ద్వారా ఆసుపత్రికి తరలిస్తున్న సహాయక సిబ్బంది

ఉత్తరాఖండ్‌లో పేలిన ట్రాన్స్‌ఫార్మర్

- 15 మంది మృతి
- అనేక మందికి గాయాలు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో మంగళవారం రాత్రి ఘోరం చోటు చేసుకుంది. చమోలీ జిల్లాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలి 15 మంది మరణించారు. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. అలకానంద నది ఒడ్డున నమామి గంగా ప్రాజెక్టు సమీపంలో ఈ విషాదం చోటుచేసుకుంది. మృతుల్లో ఒక ఎస్ఐ, ముగ్గురు హోంగార్డులు ఉన్నారు. వంతెనపై ఒక వ్యక్తి విద్యుదాఘాతంతో మరణించినట్లు సమాచారం రావడంతో నివేదిక తయారు చేయడం కోసం పోలీసు బృందం అక్కడకు వెళ్లిందని, అదే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ పేలి అక్కడ ఉన్న వంతెనకు విద్యుత్ ప్రవహించి మరణాలకు, గాయాలకు కారణమయిందని అధికారులు చెప్పారు. గాయపడిన వారిలో కొందరిని జిల్లా ఆసుపత్రికి, మరికొందరిని వాయుమార్గంలో రుషికేశ్‌లోని ఎయిమ్స్‌కు తరలించారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జ్యుడిషియల్ విచారణకు ఆదేశించారు. మరోవైపు, విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి పార్లమెంట్

ఆగస్టు 11తో ముగియనున్న వర్షాకాల సమావేశాలు

- 31 బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం
- అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీలు
- ప్రజా సమస్యలపై చర్చ చేయాలి : ప్రతిపక్షం
- చర్చలకు సిద్ధమే : కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



బుధవారం జరిగిన అఖిలపక్ష సమావేశానికి హాజరైన వివిధ పార్టీల నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గురువారం నుంచి జరగనున్నాయి. ఆగస్టు 11 వరకు జరిగే ఈ సమావేశాల్లో 17 రోజుల పాటు సమావేశమవుతుంది. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభానికి ముందు రోజు ఆనవాయితీగా జరిపే అఖిలపక్ష సమావేశం పార్లమెంట్ లైబ్రరీ బిల్డింగ్‌లో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశానికి పార్లమెంటులో ప్రాతినిధ్యం ఉన్న 34 రాజకీయ పార్టీల నుంచి 44 మంది నాయకులు హాజరయ్యారు. ధరలు పెరుగుదల, నిరుద్యోగం, కుల గణన, మహిళా రిజర్వేషన్ బిల్లు, మణిపూర్ అల్లర్లు, బాలసోర్ రైలు ప్రమాదం, ప్రతిపక్షాలపై ఈడి, సిబిఐ దుర్వినియోగం, ఎన్నికైన ప్రభుత్వాలపై గవర్నర్ల ఆధిపత్యం, సమాఖ్యవాదంపై దాడి, ఢిల్లీ ఆర్డినెన్స్ వంటి అంశాలపై ఈ సమావేశాల్లో చర్చ జరపాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. అలాగే మణిపూర్‌లో పరిస్థితి కూడా పార్లమెంటరీ బిజినెస్‌లో చేర్చాలని కోరాయి. దీనికి తాము సిద్ధమేనని అధికార పార్టీ తరపు ప్రతినిధులు చెప్పారు.

31 బిల్లులు సిద్ధం

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో 31 బిల్లులను ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించుకుంది. వీటిలో గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ (సవరణ) బిల్లు, అటవీ సంరక్షణ సవరణ బిల్లు, డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు, జీవ వైవిధ్య (సవరణ) బిల్లు వంటివి ఉన్నాయి.

సిపిఎం పార్లమెంటరీ పార్టీ నాయకులు ఎలమరం కరీం మాట్లాడుతూ ధరలు పెరుగుదల, నిరుద్యోగం, ప్రైవేటీకరణ, కేంద్ర సంస్థలు దుర్వినియోగం, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలపై గవర్నర్ల పెత్తనం, మణిపూర్ వంటి అంశాలను లేవనెత్తనున్నట్లు తెలిపారు. అలాగే పార్లమెంట్‌కు ప్రధాన మంత్రి గైర్హాజరుపై కూడా ప్రశ్నించామన్నారు. ప్రధాన మంత్రి సభకు హాజరై, మణిపూర్‌పై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశామన్నారు. దీనిపై వాయిదా తీర్మాన నోటీసు కూడా ఇస్తామన్నారు.కాంగ్రెస్ లోకసభా పక్షనేత అధీర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ సమావేశాల్లో వివిధ అంశాలను లేవనెత్తడానికి ప్రతిపక్షాలను అనుమతించాలని కోరినట్లు చెప్పారు. ఎస్‌పి ఎంపి ఎస్‌టి హసన్ మాట్లాడుతూ యూనిఫాం సివిల్ కోడ్ (యుసిసి)పై చర్చ జరపాలని కోరినట్లు తెలిపారు. ఒరిస్సాకు ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరినట్లు బిజెడి ఎంపి సస్మిత్ పాత్ర చెప్పారు.. ప్రతిపక్షాల నుండి తాము చాలా ముఖ్యమైన సలహాలు పొందామని, 31 బిల్లులను జాబితా చేశామనిపార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. మణిపూర్ అల్లర్లపై ఎక్కువ మంది సభ్యులు లేవనెత్తారని, దానిపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా నిర్వహించేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రులు అర్జున్ రాం మేఘ్వాల్, మురళీధరన్, జైరాం రమేష్, ప్రమోద్ తివారీ (కాంగ్రెస్), టిఆర్ బాలు, తిరుచ్చి శివ (డిఎంకె), ఎలమరం కరీం, పిఆర్ నటరాజన్ (సిపిఎం), విజయసాయి రెడ్డి (వైసిపి), గల్లా జయదేవ్, కనకమేడల రవీంద్ర కుమార్ (టిడిపి), కె.కేశవరావు, నామా నాగేశ్వరరావు (బిఆర్‌ఎస్), సంజయ్ సింగ్ (ఆప్), రామ్ గోపాల్ యాదవ్ (ఎస్‌పి), మనోజ్ కుమార్ ఝా (ఆర్‌జెడి), సంతోష్ కుమార్ (సిపిఐ), ఎన్‌కె ప్రేమ్ చంద్రన్ (ఆర్‌ఎస్‌పి), తంబిదొరై (అన్నాడిఎంకె), ఈటి మహ్మద్ బషీర్ (ఐయుఎంఎల్) తదితరులు ఈ అఖిలపక్ష సమావేశానికి హాజరయ్యారు. .

యుసిసిలో ఏముందో తెలియదు

ముస్లిం పెద్దలతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి



జగన్‌ను కలిసిన ముస్లిం పెద్దలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి)లో ఏముందో తెలియదని, దానికి సంబంధించి ఇంతవరకు ముసాయిదా రాలేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిమ్ మత పెద్దలకు తెలిపారు. దీనిపై ఆందోళన అవసరం లేదని అన్నారు. ఉమ్మడి పౌర స్మృతి బిల్లు ప్రవేశపెడుతున్న నేపథ్యంలో పలువురు ముస్లిం మత పెద్దలు బుధవారం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో జగన్‌ను కలిశారు. యుసిసిపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. దీనిపై సిఎం మాట్లాడుతూ.. యుసిసిపై భయాందోళనలకు గురికావొద్దని, ముస్లిముల మనసు నొప్పించేలా వైసిపి ప్రభుత్వం ఎప్పుడూ వ్యవహరించదని తెలిపారు. ముసాయిదాలో ఏమున్నాయో తెలియదని, మీడియాలో వచ్చిన అంశాల ఆధారంగా ముస్లిములు తమ మనోభావాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఒక రాష్ట్రానికి పాలకుడిగా తాను ఉన్నానని, ఇదే విషయంలో మీరైతే ఏమిచేస్తారో చెప్పాలని వారిని ప్రశ్నించారు. ముస్లిం ఆడబిడ్డల విషయంలో జరుగుతున్న చర్చను ముస్లిం మత పెద్దలు తిప్పికొట్టాలని కోరారు. మహిళలకు సమాన హక్కుల విషయంలో రాజీలేదని పేర్కొన్నారు. దేశం భిన్నమైందని, అనేక మతాలు, కులాలు, వర్గాలు ఉన్నాయని తెలిపారు. వారి మత గ్రంథాలు, విశ్వాసాలు, ఆచరించే సంప్రదాయాల ఆధారంగా వారికి వారి పర్సనల్ లా బోర్డులు ఉన్నాయని వివరించారు. ఏ నియమమైనా ఏ నిబంధన అయినా సాఫీగా తీసుకురావాలంటే నేరుగా ప్రభుత్వాలు కాకుండా ఆయా మతాలకు చెందిన సంస్థలు, పర్సనల్ లా బోర్డుల ద్వారా చేయాలని అన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు, లా కమిషన్, కేంద్ర ప్రభుత్వం కలిసి వివిధ మతాలకు చెందిన సంస్థలను, వారి పర్సనల్ లా బోర్డులతో కలిసి అవసరమైతే మార్పు జరగాలే తప్ప వేరే పద్ధతిలో జరిగితే ఇది ఇంత భిన్నత్వం ఉన్న మన దేశంలో తగదని అన్నారు.

ముస్లింలకు అండగా ఉంటాం

- మైనార్టీ నేతలతో టిడిపి అధినేత చంద్రబాబు
- చట్టానికి మద్దతు ఇవ్వొద్దన్న నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యూనిఫాం సివిల్ కోడ్ (యుసిసి)పై ముస్లిం వర్గం నుంచి వచ్చిన సూచనలపై అధ్యయనం చేసి అండగా నిలుస్తామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. ముస్లిం వర్గ మనోభావాలకు వ్యతిరేకంగా టిడిపి ఎప్పుడూ పనిచేయదని తెలిపారు. ముస్లిం పెద్దలు, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నేతలు, టిడిపి మైనార్టీ నాయకులు చంద్రబాబును టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో బుధవారం కలిశారు. యుసిసిపై తమ అభ్యంతరాలు, అభిప్రాయాలను చంద్రబాబుకు తెలిపారు. మైనార్టీ మనోభావాలను గౌరవించే ఎప్పుడూ నిర్ణయాలు తీసుకుంటామని చంద్రబాబు అన్నారు. టిడిపి లౌకిక మిగతా 7లో



ఉధృతంగా ప్రవహస్తున్న గోదావరి, (ఇన్‌సెట్‌లో) భద్రాచలం వద్ద బుధవారం సాయంత్రం 32 అడుగులకు చేరిన నీటిమట్టం

- ఆందోళనలో పోలవరం నిర్వాసితులు
- గండిపోశమ్మ ఆలయాన్ని చుట్టుముట్టిన వరద నీరు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఎగువ రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణల్లో కురిసిన భారీ వర్షాలకు గోదావరి, శబరి నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. ఈ నదుల్లో క్రమంగా వరద ప్రవాహం పెరుగుతుండడంతో పోలవరం నిర్వాసితుల ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వరద భయంతో అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండల కేంద్ర ప్రజలు ఎగువ ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం బుధవారం మధ్యాహ్నానికి 30.07 అడుగులు ఉండగా, ఎగువ ఉన్న కాళేశ్వరం, ఇంద్రావతి, తాలిపేరు నదుల నుంచి వస్తోన్న వరద నీటి వల్ల సాయంత్రానికి 34 అడుగులకు చేరుకుంది. అర్ధరాత్రి 12 గంటలకు 35 అడుగులకు చేరే అవకాశం ఉందని భద్రాద్రి జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 7.2 అడుగుల నీటిమట్టం నమోదైంది. గురువారం ఉదయానికి ఐదు లక్షల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. దీంతో, ఈ బ్యారేజీ నుంచి మిగతా 7లో



తీస్తా సెతల్వాదుకు రెగ్యులర్ బెయిల్

- కస్టడీ విచారణ అవసరం లేదు
- స్పష్టం చేసిన సుప్రీం కోర్టు
- గుజరాత్ హైకోర్టు తీర్పు కొట్టివేత

7

నీటిపై మరింత బాదుడు !

- కుళాయిల ఏర్పాటులో భిన్న వసూళ్లు
- 10 శాతం సేవా రుసుము పెంపుపైనా కసరత్తు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

మరో సరికొత్త బాదుడుకు రాష్ట్ర ప్రభుత్వం తెరతీస్తోంది. ఇళ్లు, ఆస్తి, చెత్త వంటి వాటిపై పన్నులతో వాతలు పెడుతున్న ప్రభుత్వం తాజాగా తాగునీటిపై పన్ను పెంచేందుకు రంగం సిద్ధం చేస్తోంది. దీంతోపాటు సేవా రుసుము కూడా వసూలు చేయనుంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను తు.చ. తప్పక పాటిస్తూ.. ప్రజలపై సైలెంటుగా భారాలు మోపడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం వెనుకాడడం లేదు. నీటి పన్ను పెంపు, సేవారుసుము వడ్డింపునకు సంబంధించి ప్రణాళిక సిద్ధం చేయాలని ఇప్పటికే అధికారులను పురమాయించింది.

పట్టణ సంస్కరణల పేరిట నీటి పన్నును కనీసం 10 శాతం పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రధానంగా ఇళ్లకు వినియోగించే తాగునీటిపై ఈ భారం పడనుంది. తాగునీటి కోసం ఏర్పాటుచేసుకునే కుళాయి కనెక్షన్లకు ఇప్పటికే కొంత పన్నును వసూలు చేస్తుండగా, రానున్న కాలంలో అదనంగా చెల్లించాల్సి వుంటుంది. ఈ పన్నుతోపాటు కుళాయిలకు సంబంధించిన రంగాల్లో కొంత సేవా రుసుమును కూడా వసూలు చేయాలన్న ప్రతిపాదన వుంది. కొత్తగా కుళాయి కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకున్న వారి నుంచి కొంత వసూలు చేయనున్నారు. అలాగే ఇంటిలో అదనపు కుళాయి సౌకర్యం కావాలన్నా సేవా రుసుము వసూలు చేయాలని భావిస్తున్నారు. ఒక ఇంటి నుంచి ఇంకో ఇంటికి మారే సమయంలో కుళాయి కనెక్షన్‌ను మార్చుకోవాలనుకున్న వారి నుంచి సేవా పన్ను వసూలు చేయనున్నారు. ఒకసారి కనెక్షన్ తీసుకున్న తరువాత దానిని రద్దు చేసుకోవాలని భావించినా సేవా రుసుము చెల్లించక తప్పదు.

మురుగుపైనా రుసుమే..

ఇళ్ల ముందు నుంచి వెళ్లే మురుగు కాల్వలను శుభ్రం చేసే సమయంలో దానిపై కూడా ఇళ్లలో నివశించేవారి నుంచి కొంత సేవా రుసుమును వసూలు చేసే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. నీటి పన్ను, మురుగు పన్నులపై ఒకే విధమైన విధానాన్ని అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

పాత ఉత్తర్వుల సవరణపై..

తాగునీరు, మురుగు తొలగింపులపై పన్నులు, సేవా రుసుములు 2020లోనే ఇచ్చిన ఉత్తర్వులను కూడా సవరించే ఆలోచన చేస్తున్నారు. కొత్తగా అమలు చేయనున్న ఛార్జీలు, రుసుములతో త్వరలో కొత్త ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఈ కొత్త ఉత్తర్వులు 2024 జనవరి నుంచి అమల్లోకి రానున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.



పుస్తకాలు అడిగితే పోలీస్ జులుం

ఇంటర్‌బోర్డు వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళన

8

తిరుపతి యార్డులో పట్టాలు తప్పిన 'పద్మావతి'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నుంచి సికింద్రాబాద్ బయల్దేరి వెళ్లాల్సిన పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలోని యార్డు వద్ద పట్టాలు తప్పింది. దీంతో రైల్వే కార్మికులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులను చేపట్టారు. రైలు సెంట్రింగ్ చేస్తుండగా బోగీలు పట్టాలు తప్పాయి. తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్లాల్సిన ట్రైన్ నంబర్. 12763 పద్మావతి ఎక్స్ ప్రెస్ సాయంత్రం 4.55కు బయల్దేరాల్సి ఉండగా రాత్రి 7.45కు బయలుదేరినట్లు రైల్వే అధికారులు తెలిపారు. అలాగే రాయలసీమ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 5.30కు బయల్దేరాల్సి ఉండగా రాత్రి 8 గంటలకు బయల్దేరింది. ప్రయాణికులు కొన్ని గంటల పాటు వేచి ఉండాల్సి వచ్చింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

21 నుంచి ఎస్ఐ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గతేడాది నవంబరు 28న విడుదలైన సివిల్, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ నోటిఫికేషన్‌లో అర్హులైన 57,923 మంది అభ్యర్థులకు ఈ నెల 21 నుంచి ఆగస్టు 4 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టనున్నట్లు రాష్ట్రస్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ అతుల్ సింగ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం సర్టిఫికెట్ వెరిఫికేషన్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు ఈ ఏడాది ఫిబ్రవరి 19న రాత పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ పరీక్షల్లో క్వాలిఫై అయిన 57,923 మందికి విశాఖపట్నం, ఏలూరు, గుంటూరు, కర్నూలులో ఈ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వుంటుందని తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థులంతా slprb.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

పునరుత్పాదక ఇంధన రంగంలో సాంకేతిక పురోగతి

- సాంకేతిక విద్య కమిషనరు నాగరాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగం ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్న నేపథ్యంలో పునరుత్పాదక ఇంధన రంగంలో సాంకేతిక పురోగతిని అన్వేషించాలని సాంకేతిక విద్యాశాఖ కమిషనరు సి.నాగరాణి అన్నారు. సుజలాన్ ఎనర్జీ సహకారంతో సాంకేతిక విద్యాశాఖ పవనశక్తి అవిష్కరణపై రాష్ట్రస్థాయి వెబినార్‌ను బుధవారం నిర్వహించింది. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ.. పవన విద్యుత్ రంగంలో రానున్న ఐదేళ్ల కాలంలో 4,800 మెగావాట్ల సామర్థ్యంలో పెట్టుబడులను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. సుజలాన్ ఎనర్జీ ఇంజినీరింగ్ హెడ్ ఎం రావన్ కీలకోపన్యాసం చేస్తూ గాలిద్వారా విద్యుదుత్పత్తి రానున్న కాలంలో మేలైన విధానం కానుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్య సంయుక్త కార్యదర్శి వి పద్మారావు, కార్యదర్శి కెవి రమణబాబు, జాయింట్ సెక్రటరీ జివిఎస్ఎన్ మూర్తి, డిప్యూటీ డైరెక్టర్ ఎంవివి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరదల పట్ల అప్రమత్తంగా ఉన్నాం

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ, విశాఖ



వర్షాల వల్ల అల్లూరి సీతారామరాజు జిల్లాకు వరదలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. విశాఖలోని జివిఎంసి కార్యాలయం వద్ద బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతేడాది జులై 9న శబరి నది ఉప్పొంగి చింతూరు ప్రాంతమంతా జలమయమైందని, అనేక గ్రామాలు నీట మునిగాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి అక్కడ ప్రజలకు పునరావాసం కల్పించిందన్నారు. గతేడాది అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది ముందుగానే అల్లూరి జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. అల్లూరి జిల్లాకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వైద్య, రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు.

జగన్‌కు భయం పట్టుకుంది

- అమరావతి రైతుల ధర్నాలో వక్తలు
- ద్రోహానికి సహకరిస్తున్న కేంద్రం
- రాజధాని లేకుండా చేసిన పాపం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే



ధర్నాలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జగన్ పాలనలో వైఫల్యం చెందారని, దోచుకోవడం దాచుకోవడం తప్ప మరొకటి అతనికి పట్టడం లేదని రాజధాని రైతుల ధర్నాలో వక్తలు పేర్కొన్నారు. రాజధాని రైతులకు యాన్యుటీ (వార్షిక కౌలు) బకాయిలు ఇవ్వాలని, దరఖాస్తులు తనిఖీ పేరుతో వేధింపులు ఆపాలని కోరుతూ బుధవారం విజయవాడలోని ధర్నాచౌక్‌లో రాజధాని పరిరక్షణ సమితి ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. దీనికి పెద్దఎత్తున రైతులు, మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ భూమి ఇవ్వలేదని, ప్రభుత్వానికి ఇచ్చారని తెలిపారు. కానీ జగన్ వచ్చిన తరువాత కక్షపూరితంగా వ్యవహరిస్తూ అమరావతి రాజధానిని అన్యాయం చేశారని అన్నారు. అభివృద్ధి పనులు చేయకపోగా, రైతులను మరిన్ని ఇబ్బందులు పెడుతున్నారన్నారు. స్వయంగా శంకుస్థాపన చేసిన ప్రధాని మోడీ పట్టించుకోకపోవడం లేదని, రాజధాని విషయంలో రాష్ట్రం చేస్తున్న ద్రోహానికి సహకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంటే జగన్‌కు ఇబ్బంది ఏమిటో అర్థం కావడం లేదని అన్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. రైతు పోరాటానికి తమపూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. ముఖ్యమంత్రి మూర్ఖంగా పాలన సాగిస్తున్నారని, ప్రజలు విసిగి వేసారిపోయారని అన్నారు. అన్నిట్లోనూ దోపిడీ సాగుతోందని, నెలకు రెండుచేల కోట్లు తాడేపల్లిలోని సిఎం ప్యాలెస్‌కు చేరుతున్నాయని ఆరోపించారు. అమరావతి పరిరక్షణ సమితి నాయకులు శివారెడ్డి, పువ్వాడ సుధాకర్ మాట్లాడుతూ.. చట్ట ప్రకారం పూలింగుకు భూములు ఇస్తే దానిపై నిరంకుశంగా వ్యవహరిస్తూ వేధింపులకు దిగడం అన్యాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ.. రాజధానికి అన్యాయం జరగడం వెనుక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా వ్యవహరించాయని విమర్శించారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య మాట్లాడుతూ.. రైతులకు అన్యాయం చేసిన ఏ ప్రభుత్వాలు మనుగడ సాగించలేదని అన్నారు. పంటలు పండే భూములను ప్రభుత్వం తీసుకుందని, అయినా వ్యక్తులకు ఇవ్వారని ప్రచారం చేసి జగన్‌మోహన్‌రెడ్డి కక్షపూరిత చర్యలకు దిగారని విమర్శించారు. కార్యక్రమానికి ముందు రాజధాని ప్రాంతంలో వైసిపి ప్రభుత్వం వేధింపులతో మనోవేదనకు గురై మరణించిన వారి సంతాపంగా ఒక నిమిషం మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం రవి, వెంకటేశ్వరరావు, రామారావు, ఎర్ర పీరు, పరిరక్షణ సమితి నాయకులు జి జయకృష్ణ, బెజవాడ నరేంద్ర, కొండయ్య, కె నరేంద్ర పాల్గొన్నారు.

కేంద్రానిది తీవ్ర అన్యాయం : బాబూరావు



సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ.. ఎపికి రాజధాని లేకుండా చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్రోహం చేశాయని అన్నారు. అసైన్డ్ రైతులకు మామూలు రైతులతో సమానంగా పరిహారం ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, భూమిలేని వారికి ఇస్తున్న రూ.2500 పెన్షన్ కూడా ఆరునెలలకు ఒకసారి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.5,000 పెంచుతామన్న హామీని గాలికొదిలేశారని అన్నారు. కేంద్రం కూడా నిధులివ్వకుండా మొండిచేయి చూపించిందన్నారు. భూములిచ్చిన రైతులు కౌలు కోసం కోర్టుకు వెళ్లాల్సిన దుస్థితి కల్పించారని అన్నారు. మా దళితులు, గిరిజనులు అంటూ కబుర్లు చెప్పే ముఖ్యమంత్రి అమరావతి దళితులు, బలహీనవర్గాలకు చెందిన అసైన్డ్ రైతులకు కౌలు ఇవ్వడం లేదని తెలిపారు. 1,300 రోజుల నుండి నిర్విరామంగా పోరాడుతున్న రైతులకు సిపిఎం తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అమరావతి రాజధానిగా ఉండాలని, కొనసాగాలని తొలి నుండి సిపిఎం తరపున పోరాడుతున్నామని పేర్కొన్నారు. ప్రజాభిప్రాయాన్ని, కోర్టు తీర్పులను, చట్టాలను లెక్క చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమరావతి ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేశాయని పేర్కొన్నారు.

ఇదెక్కడి న్యాయం సారూ..!

- బాధితులను స్టేషన్‌లో పెట్టి పొలంలో దౌర్జన్యంగా రోడ్డు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమని బాధితుల ఆవేదన



పురుగు మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న సుబ్బయ్య దంపతులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ (అన్నమయ్య జిల్లా)

అధికార బలానికి నిలువలేక మరణమే శరణ్యమంటూ ఓ రైతు తన భార్యతో కలిసి పురుగుల మందు తాగేందుకు సిద్ధపడ్డారు. బాధితులను పోలీసు స్టేషన్‌లో ఉంచి ఆక్రమంగా పొలంలో రోడ్డు వేశారు. ఈ ఘటన అన్నమయ్య జిల్లా రాజంపేట మండల పరిధిలోని హెచ్.చెర్లోపల్లి హస్తవరంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... చెర్లోపల్లికి చెందిన జనిసెట్టియారి సుబ్బయ్య, సుబ్బమ్మ దంపతులు తమ గ్రామంలోని 357, 358, 359 సర్వే నెంబర్లలో ఉన్న ఐదు ఎకరాల పట్టా భూమిని గత 25 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. వీరి భూమి వెనుకనే అదే గ్రామానికి చెందిన జనిసెట్టియారి వెంకటయ్యకు చెందిన భూమి ఉంది. వెంకటయ్య తన పొలానికి దారి కోసం సుబ్బయ్య కుటుంబంపై అధికారుల అండతో ఒత్తిడి తీసుకురావడంతో వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో రాజంపేట రూరల్ పోలీసులు రైతు సుబ్బయ్యను విచారణ నిమిత్తం మంగళవారం ఉదయం స్టేషన్‌కు పిలిపించి సాయంత్రం విడిచిపెట్టారు. ఇంటికి వచ్చే సమయానికి సుబ్బయ్య పొలంలో నుంచి వెంకటయ్య తన పొలానికి రహదారి నిర్మించుకున్నారు. ఇదంతా రెవెన్యూ, పోలీసు, విద్యుత్ అధికారుల అండతో వెంకటయ్య రోడ్డు వేశారని బాధితుడు సుబ్బయ్య ఆరోపించారు. విద్యుత్ శాఖ అధికారులు గతంలో తన పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి నేటి వరకు విద్యుత్ సరఫరా ఇవ్వలేదని తెలిపారు.

విద్యుత్ సరఫరా కావాలంటే వెంకటయ్య పొలానికి దారి ఇవ్వాలని విద్యుత్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. భూ వివాదం కోర్టులో ఉందని, కోర్టు ఉత్తర్వులు కూడా లెక్కచేయకుండా అధికారుల అండతో వెంకటయ్య అక్రమాలకు పాల్పడుతున్నాడని తెలిపారు. తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం అంటూ సుబ్బయ్య దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై డివిజన్ ఏవోకి చైతన్యకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై డిఎస్‌పి స్పందించి పోలీసు, రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. కేసును క్షుణ్ణంగా విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కృష్ణా యూనివర్సిటీ- మస్ట్ ఫిన్‌టెక్ మధ్య అవగాహనా ఒప్పందం

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్

కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీ, దక్షిణ కొరియాకు చెందిన మస్ట్ ఫిన్‌టెక్ కంపెనీల మధ్య అవగాహనా ఒప్పందం (ఈ-ఎంఒయు) బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మస్ట్ ఫిన్‌టెక్ గ్లోబల్ డైరెక్టర్ సాహిన్ నోబెల్ పిళ్లై మాట్లాడుతూ ఎంఒయు జరగడానికి కృషి చేసిన యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ జి.జ్ఞానమణి కృషిని అభినందించారు. ఆన్‌లైన్‌లో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ ఎంఒయు విద్యార్థులకు నూతన సాంకేతిక అంశాలలో శిక్షణ ఇవ్వడం, నైపుణ్యాలను మెరుగుపర్చడమేగాక రెండు దేశాల సంస్కృతి సంప్రదాయాలను ఒక్కటి చేసేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ ఎంఒయు ద్వారా కృష్ణా యూనివర్సిటీలో ఉద్యోగావకాశాలు పొందడం సులభతరం అవుతుందన్నారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జ్ఞానమణి మాట్లాడుతూ యూనివర్సిటీ అభివృద్ధిలో భాగంగా ప్రముఖ కంపెనీలతో ఎంఒయు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇలాంటి ఎంఒయుల ద్వారా విద్యార్థుల పరిశోధన, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. మస్ట్ ఫిన్ టెక్ సిఇఒ ఓ జూహాన్ చా, సిటిఒ ఎయోన్‌చా మాట్లాడుతూ ఎంఒయు ఉద్దేశాలను వివరించారు. కార్యక్రమంలో మస్ట్ ఫిన్‌టెక్ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ ఎల్హా భార్యుడ్, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎమ్.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అమ్మఒడి'కి కోత!

- లబ్ధిదారుల ఖాతాలో రూ.9 వేలే జమ
- పూర్తి డబ్బులు రాక ఆందోళన

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, కవిటి, జి సిగడాం

- శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం ప్రగడపుట్టుగ గ్రామానికి చెందిన జీరు కుమారి, బోరుభద్ర లక్ష్మి, ఎండ్రావు కుమారి, కొరికాన భారతి గత పదిహేను రోజులుగా అమ్మఒడి డబ్బుల కోసం ఆటు బ్యాంకు, ఇటు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం బ్యాంకుకు వెళ్లి తమ పాస్‌పుస్తకాలు సరిచూసుకున్న వారికి చెరో రూ.9 వేలు చొప్పున ఖాతాలో జమైనట్లు చూపించింది.
- జి.సిగడాం మండలం బుడితి కంచరాంలో పదిమంది తల్లులు తమకు డబ్బులు పడ్డాయని తెలియడంతో నగదు తీసేందుకు గ్రామంలోని మినీ ఎటిఎం దగ్గరకు వెళ్లారు. డబ్బులు ఎంత జమ అయ్యాయో తెలుసుకుని విత్‌డ్రా చేయాలనుకున్నారు. మీ ఖాతాల్లో తొమ్మిది వేలే పడ్డాయని బదులివ్వడంతో చేసేది లేక ఆ డబ్బులను తీసుకుని వచ్చేశారు. రాష్ట్ర మంతటా బుధవారం డబ్బులు జమ అయిన లబ్ధిదారుల అందరి ఖాతాల్లోనూ ఇదే రీతిన రూ.9 వేలు పడినట్లు తెలుస్తోంది.

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గత నెల 28న అమ్మఒడి నాల్గో విడత డబ్బులు జమ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 42,61,965 మంది తల్లుల ఖాతాల్లో రూ.6,392.94 కోట్లు జమ చేయనున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. మూడు వారాలు గడిచినా ఇంకా లక్షలాది మందికి డబ్బులు జమకాలేదు. కొందరి తల్లుల బ్యాంకు ఖాతాల్లో బుధవారం డబ్బులు పడ్డాయన్న సమాచారంతో తమ ఖాతాల్లో నుంచి డబ్బులు తీసేందుకు బ్యాంకులకు వెళ్లారు. నగదు జమ చూసుకుని సరికి రూ.9 వేలే కనిపించడంతో వారు షాక్‌కు గురయ్యారు. అమ్మఒడి కింద ప్రభుత్వం ఈ ఏడాది రూ.13 వేలు ఇవ్వనున్నట్లు ప్రకటించిందని చెబుతోంది. పూర్తి సొమ్ము రాకపోవడంపై తల్లులు సచివాలయాలకు పరుగులు తీశారు. తమకు తెలియదని సచివాలయ సిబ్బంది చెప్పడంతో నిరాశతో వెనుదిరిగారు.



రూ.9 వేలు జమ అయిన బ్యాంకు స్టేట్‌మెంట్

విద్యా శాఖ వద్దాలేని సమాచారం

తల్లుల ఖాతాల్లో రూ.13 వేలకు బదులుగా రూ.9 వేలే పడడానికి కారణంపై విద్యా శాఖాధికారుల వద్ద కూడా సమాచారం లేదు. విశాఖపట్నం రీజియన్ ఆర్‌జెడి ఎం.జ్యోతికుమారిని వివరణ అడగగా, తమకు సమాచారం లేదని, కనుక్కుని చెప్తానని తెలిపారు.

మిగిలిన డబ్బులు ఎప్పుడొస్తాయో



మా పిల్లల సంఖ్య, శర్మ.. కవిటి ప్రభుత్వోన్నత పాఠశాలలో చదువు తున్నారు. అమ్మఒడి కోసం గత 15 రోజులుగా ఎదురు చూస్తున్నాం. బుధవారం ఉదయం నా భర్త బ్యాంకుకు వెళ్లి డబ్బులు పడ్డాయో లేదో చూశారు. బ్యాంకు పాస్‌పుస్తకం ప్రింట్ తీస్తే రూ.9 వేలు మాత్రమే వచ్చినట్లు ఉంది. అమ్మఒడి కోసం ఎదురు చూస్తున్న కొంతమందిని వాకబు చేస్తే వారికీ రూ.9 వేలే వచ్చినట్లు చెప్పారు. మిగిలిన డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియడం లేదు

- కొరికాన భారతి, ప్రగడ పుట్టుగ (శ్రీకాకుళం జిల్లా)

బతికున్న మహిళకు డెత్ సర్టిఫికెట్

- రూ. కోటి విలువ చేసే ఆస్తి అమ్మకం

ప్రజాశక్తి- కుప్పం (చిత్తూరు జిల్లా)

ఆస్తిపై కన్నేసిన దుర్మార్గులు ఓ మహిళ బతికి ఉండగానే చనిపోయినట్లు రికార్డులు సృష్టించారు. ఆపై ఆమె ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసి విక్రయించేశారు. ఈ సంఘటన చిత్తూరు జిల్లా కుప్పంలో చోటుచేసుకుంది. బాధిత మహిళ బుధవారం కుప్పం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి నిరసనకు దిగడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బాధిత మహిళ రవికాంచన వర్మ మాట్లాడుతూ... తనది తమిళనాడులోని అంబూర్ ప్రాంతమని తెలిపారు. రవిపెరుమాళ్ అనే వ్యక్తి తాను మరణించినట్లు తప్పుడు ధ్రువీకరణపత్రం సృష్టించి తన ఆస్తిని ఇతరులకు విక్రయించారని ఆరోపించారు. తన భర్త రవివర్మ రెండేళ్ల క్రితం మరణించారని తెలిపారు. ఆయనే, తానూ మృతిచెందినట్లు పేర్కొంటూ కాంచన రవివర్మ పేరుతో డెత్ సర్టిఫికెట్ పుట్టించి కోటి రూపాయలు విలువ చేసే స్థలాన్ని ఇతరులకు విక్రయించారని తెలిపారు. తనకు న్యాయం చేయాలని రిజిస్ట్రేషన్ కార్యాలయం అధికారులను కోరారు. ఈ మోసం వెనుక రిజిస్ట్రర్, రిజిస్ట్రర్ కార్యాలయ సిబ్బంది హస్తం ఉందని, పది లక్షల రూపాయలు చేతులు మారాయని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని సబ్‌రిజిస్ట్రార్ వెంకట సుబ్బయ్య హామీ ఇవ్వడంతో బాధితురాలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఎసిబికి చిక్కిన మహిళా ఎస్ఐ

- కానిస్టేబుల్ కూడా..

ప్రజాశక్తి-కొనకనమిట్ల (ప్రకాశం జిల్లా)

ఎస్ఐగా పేరు తొలగించేందుకు లంచం తీసుకుంటుండగా కొనకనమిట్ల ఎస్ఐని, కానిస్టేబుల్‌ను ఎసిబి అధికారులు పట్టుకున్నారు. బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎసిబి అధికారులు కథనం ప్రకారం... ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం కాట్రగుంట గ్రామంలో భార్యభర్తల మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. గిల్లి వెన్నెలపై కేసు నమోదైంది. ఈ కేసులో వెన్నెల సోదరుడు కొంగ రమేష్ పేరును చేర్చారు. తన పేరును తొలగించాలని రమేష్ ఎస్ఐని ఆశ్రయించారు. రూ.60 వేలు లంచం ఇవ్వాలని ఎస్ఐ దీపికా అడిగారు. రూ. 45 వేలకు ఒప్పందం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో నరసింహారావు ఎసిబి అధికారులను ఆశ్రయించారు. బుధవారం దొనకొండ అడ్డరోడ్డు సమీపంలో రూ.45 వేలు ఎస్ఐ దీపిక, కానిస్టేబుల్ జి నరసింహారావుకు లంచంగా ఇస్తుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎస్ఐ, కానిస్టేబుల్‌ని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎసిబి అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఒంగోలు ఎసిబి డిఎస్‌పి వి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిఐలు అన్వర్లు, సిహెచ్ శేషు, ఇవివి శ్రీనివాసులు, ఎసిబి సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలు అవసరం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ



విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఐక్య పోరాటాలు అవసరమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షలు బుధవారం నాటికి 888వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ సిఐసిపిఐ విభాగ ఉద్యోగులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ ఛైర్మన్ డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ మాట్లాడారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కుగానే ఉండాలన్నారు. పోరాట కమిటీ చేసే అన్ని కార్యక్రమాల్లో ప్రతి కార్మికుడూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్టీల్‌ప్లాంట్‌ని ఎలా నిర్వీర్యం చేస్తున్నాయో వివరించారు. ఐక్య పోరాటాల అవసరాన్ని గుర్తించాలన్నారు. ఎన్నికల సమయం ఆసన్నం కీలకమని, ఈ సమయంలో పోరాటాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షలో టివికె రాజు, కెఎస్ఎన్ అప్పలనాయుడు, ఎస్‌కెటి మొహిద్దీన్, పి శ్రీనివాస్, వి నరసింగరావు, జగదీష్, నర్సింగ్, గోపాలరావు, కనకరాజు, బాబూరావు, ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారా లోకేష్

పెండింగ్ బిల్లులను రూ.2 వడ్డీతో చెల్లిస్తాం

- విద్యా దీవెన, వసతి దీవెనలో అక్రమాలు : లోకేష్

ప్రజాశక్తి-పిసిపల్లి (ప్రకాశం జిల్లా)

టిడిపి హయాంలో చేసిన పనులకు జగన్ ప్రభుత్వం బిల్లులు ఇవ్వకుండా ఆపేసిందని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత రూ.2 వడ్డీతో బిల్లులు చెల్లిస్తామని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. బుధవారం యువగళం పాదయాత్ర ప్రకాశం జిల్లా పిసిపల్లి మండలంలో కొనసాగింది. పెదఅలవలపాడు వాసులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ప్రతి సంవత్సరం జాబ్ కేలండర్ ప్రకటించి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ, పారిశ్రామిక రంగాలతో కలిపి నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామన్నారు. ఐదేళ్లలో ఖాళీగా ఉన్న పెండింగ్ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. మొదట ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. విద్యా దీవెన, వసతి దీవెనలో పెద్ద కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. రెండు లక్షల మంది విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ పడక కాలేజీలో సర్టిఫికెట్లు తీసుకోలేకపోతున్నారని, చదువుండి ఉపాధి పొందలేకపోతున్నారని తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్, విదేశీ విద్యాదీవెన, ఫీజురీయింబర్స్‌మెంట్ పునరుద్ధరణ చేస్తామన్నారు. జగన్ పాలన పోతేనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయని పేర్కొన్నారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారం కోసం వెలిగొండ నీటిని గ్రిడ్ ఏర్పాటు చేసి పైప్‌లైన్ ద్వారా ఇంటింటికీ సాగర్ నీటిని సరఫరా చేస్తామన్నారు. భూసార పరీక్షలు నిర్వహించి భూసారానికి అవసరమైన సూక్ష్మపోషకాలను అందజేస్తామని హామీ ఇచ్చారు.



పిఎల్ఆర్ ప్రసాద్‌కు నివాళులు అర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు,సిపిఎం నాయకులు

పిఎల్ఆర్ ప్రసాద్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-దీపకుర్తి (ప్రకాశం జిల్లా)

జిల్లా కంకర మిల్లుల యజమానుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, పిఎల్ఆర్ సంస్థల అధినేత పంగులూరి ప్రసాదరావుకు పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఒంగోలులోని చెన్నకేశవనగర్‌లోని స్వగృహం వద్ద బుధవారం ఆయన పెద్దకర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు చిత్రపటం వద్ద సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, మాజీ ఎంపి పి మధు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులు పంగులూరి అనీష్, నవ తెలంగాణ దినపత్రిక సిఇఒ పంగులూరి ప్రభాకరరావులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వరరావు, జె జయరాం, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, తెలంగాణా సిఐటియు ప్రధాన కార్యదర్శి పి భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్, టిడిపి మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు, మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ ఉన్నారు.

గిరిజనుడిపై అఘాయిత్యం కేసులో నిందితుల అరెస్టు

- ప్రధాన నిందితుడు పరారీలో..
- దొంగతనాల కేసుల్లో విభేదాలే గొడవలకు కారణం : ఎస్‌పి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒంగోలు శివార్లలో గిరిజన యువకుడిని చితకబాది.. మూత్రం తాగించిన నిందితులను బుధవారం తాలూకా పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం ఏడుగురిలో ఆరుగురిని అరెస్టు చేయగా.. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. ఈ ఘటన వివరాలను ఒంగోలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్‌పి మల్లికగర్గ్ వెల్లడించారు.

గిరిజన యువకుడు నవీన్, అతని స్నేహితుడు మన్నం రామాంజనేయులు అలియాస్ అంజి పలు దొంగతనాల కేసుల్లో నిందితులు. వీరికి పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజా కేసులో ప్రధాన నిందితుడు అంజి గత నెల 19న ఒంగోలు శివారులో పరిక్షం ప్రకారం నవీన్‌ను మద్యం తాగుదాం రమ్మంటూ ఇంటి నుంచి తీసుకెళ్లాడు. అక్కడ అంజి స్నేహితులు కొందరితో కలిసి పూటుగా మద్యం తాగారు. పాత గొడవల వ్యవహారం చర్చకు వచ్చి మాటామాటా పెరిగింది. నవీన్‌ను అంజి, అతని స్నేహితులు కర్రలు, రాళ్లతో చితకబాదారు. పదిలేయాలంటూ కాళ్లావేళ్లా పడ్డా కనికరించలేదు. నవీన్ నోట్లోనూ, తలపైనా అంజి మూత్రం పోశాడు. కాళ్లతో తన్నాడు. రాత్రంతా కొట్టాడు. ఈ ఘటనను మొత్తాన్ని తమ సెల్‌ఫోన్లలో నిందితులు వీడియో తీశారు. వివరాలను పోలీసులకు చెప్పొద్దని బెదిరించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో బయటకు రావడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నవీన్ అక్కడ నుంచి తప్పించుకుని పోగాకు కార్మికుల సాయంతో ఇంటికి చేరాడు. కుటుంబసభ్యులు అతన్ని ఆస్పత్రిలో చేర్పించారు. మరుసటి రోజున తాలూకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం నిందితులు తీసిన వీడియో లీకైంది. దీంతో పోలీసులు అప్రమత్తమై కేసుపై దృష్టి సారించి నిందితులను అరెస్టు చేశారు. పాత దొంగతనాల కేసుల్లో పేచీలతో పాటు ఓ బాలిక వ్యవహారంలోనూ వీరి మధ్య విభేదాలున్నట్లు పోలీసులు చెప్పారు. ఈ ఘటనలో ఆ బాలిక అన్న, అతని స్నేహితులూ భాగస్వాములయ్యారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో చిన్నపాటి అబిలాష్, మూలకోయిన నవీన్‌కుమార్, పఠాన్‌నాయబ్ రసూల్, షేక్ హుస్సేన్, అప్పనబోయిన జయశంకర్, షేక్ సాహిద్‌గఫూర్ ఉన్నారు. ప్రధాన నిందితుడు అంజి పరారీలో ఉన్నాడు. నిందితుడిపైన వివిధ పోలీసుస్టేషన్లలో 18 కేసులున్నాయి. ఇక బాధితుడిపైనా 28 కేసులున్నాయి.

తెచ్చిపెట్టిన 'వరద'!

- కాఫర్ డ్యాం నిర్మాణంతోనే 2022 జులైలో బీభత్సం
- 1986లో నాలుగైదు రోజుల్లో వరద నీరు వెనక్కి
- గతేడాది వరదకు నెలల తరబడి గ్రామాల్లో నీరు

ప్రజాశక్తి- ఏలూరు, రాజమహేంద్రవరం ప్రతినిధులు

● 1986లో భద్రాచలం వద్ద 75 అడుగుల నీటిమట్టం వచ్చేసరికి ఎంత వరద వచ్చిందో 2022లో భద్రాచలం వద్ద 71.5 అడుగుల నీటిమట్టానికే అంతకంటే పెద్ద వరద వచ్చింది. అప్పట్లో వచ్చిన వరద నాలుగైదు రోజులకే తగ్గిపోయింది. గతేడాది వచ్చిన వరద నీరు రెండు వారాలకుపైగా గ్రామాలను విడిచి వెళ్లలేదు. అప్పట్లో ఎటువంటి అడ్డంకులూ లేకపోవడంతో వరద నీరు వేగంగా తగ్గిపోయింది. ఇప్పుడు కాఫర్ డ్యాం కారణంగా వరద ఉధృతంగా రావడంతోపాటు వరద నీరు త్వరగా తగ్గలేదు.

-ఏలూరు జిల్లాలోని కుక్కునూరు మండలం కిష్టారం, కుక్కునూరు బి బ్లాక్ గ్రామస్తులు

● మా గోదావరి గురించి మాకు తెలుసు. ఈ నదితో మాకు తరతరాల అనుబంధం. కన్నతల్లిగా మేం భావిస్తాం. గోదావరికి నీరు వచ్చినంత వేగంగానే తీసేస్తుంది (తగ్గుముఖం పడుతుంది). 1986 వరదలకు ఇళ్లు వదిలి గుట్టపైకి చేరాం. గుడిసెల్లో తలదాచుకున్నాం. మూడో రోజు నుంచే వరద తగ్గుముఖం పట్టడంతో వారానికే మా పెద్దలను, బిడ్డలను తీసుకుని ఇంటికి చేరాం. కానీ, 2022 వరదకు ప్రాణాలు అరచేతపట్టుకుని బిక్కుబిక్కుమంటూ మూడు నెలలు గుట్టపైనే గడిపాం. నరకం అంటే ఇలా ఉంటుందేమో? అనుకున్నాం. కాఫర్ డ్యాం నిర్మాణంతోనే గోదావరి తీయడం లేదు.'

-అల్లూరి సీతారామరాజు (ఎఎస్ఆర్) జిల్లా విఆర్.పురం మండలం చింతరేవుపల్లి గ్రామస్తులు

ఇటువంటి వ్యాఖ్యలు ఈ గ్రామాల నిర్వాసితులకే పరిమితం కాలేదు. పోలవరం ముంపు గ్రామాల్లోని ఏ ఒక్కరిని కదిలించినా అదే విషయం చెప్తున్నారు. వీరిలో చాలామంది 1986 వరద సమయంలో యువకులు. అప్పుడు, ఇప్పుడు వరద బాధితులుగా ఉన్న వారే. తమ అనుభవాలను కళ్లకు కట్టినట్లు చెబుతున్నారు. దీనినిబట్టి పోలవరం కాఫర్ డ్యాం నిర్మాణం కారణంగానే 2022 జులైలో అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాలోని పోలవరం నిర్వాసిత గ్రామాలపై గోదావరి వరద తీవ్ర ప్రభావం చూపిందని స్పష్టమవుతోంది. తాజాగా గోదావరి వరద రాక నేపథ్యంలో అక్కడి ప్రజలను 'ప్రజాశక్తి' పలకరించింది.

1986లో వచ్చిన వరద కంటే గతేడాది వచ్చిన వరదతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ప్రజలు పెద్ద ఎత్తున నష్టం చవిచూశారు. ఏడు వేలకుపైగా ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఈ రెండు మండలాల్లో 107 హేబిటేషన్స్ ఉండగా 90కుపైగా గ్రామాలు నీటమునిగాయి. మిగిలిన గ్రామాలు సైతం జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. దీంతో, దాదాపు 20 వేల మంది వరద బాధితులుగా మారి పునరావాస కేంద్రాల్లో నెలల తరబడి ఉండాల్సి వచ్చింది.

పోలవరం నిర్వాసితులకు పునరావాసం, పరిహారంపై పాలకులు దృష్టి పెట్టకుండా ప్రాజెక్టు పనులు సాగిస్తుండడం వివాదస్పదంగా మారుతోంది. సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గతేడాది మూడుసార్లు వచ్చిన వరదలకు నిర్వాసితులంతా నరకయాతన అనుభవించారు. ఇప్పుడు మళ్లీ వర్షాలు ప్రారంభం కావడంతో మరోసారి వరద భయం వారిని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. 1986 తర్వాత కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలను వణికించింది 2022 వరదలే.

కాంటూరు లెక్కల పేరుతో నిర్వాసితులకు అన్యాయం

1986, 2022 వరదల లెక్కలను పరిశీలిస్తే పోలవరం ప్రాజెక్టుపై ప్రభుత్వం చెబుతున్న కాంటూరు లెక్కలన్నీ అవాస్తవమని తేలుతోంది. కాంటూరు లెక్కల ప్రకారం కుక్కునూరు మండలంలో ఎనిమిది గ్రామాలు, వేలేరుపాడు మండలంలో 15 గ్రామాలు వెరసి 23 గ్రామాలు 41.15 కాంటూరులో ఉన్నట్లు ప్రభుత్వం ముందు చెప్పింది.

గతేడాది వరదల తర్వాత కాంటూరు లెక్కలపై తీవ్ర విమర్శలు రావడంతో ప్రభుత్వం లైడార్ సర్వే నిర్వహించింది. ఆ తర్వాత కుక్కునూరు మండలంలో మరో తొమ్మిది గ్రామాలు, వేలేరుపాడు మండలంలో మరో పది గ్రామాలు వెరసి 19 గ్రామాలను ఈ కాంటూరులో చేరుస్తున్నట్లు ప్రకటించింది. దీన్నిబట్టి కాంటూరు సర్వే తప్పుల తడకని తేలిపోయింది. ఇప్పుడు చేసిన లైడార్ సర్వే కూడా శాస్త్రీయంగా లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 2022లో ఇళ్లపై కప్పుల నుంచి వరకూ మునిగిపోయిన గ్రామాలను కూడా 45.72 కాంటూరులోనే చూపిస్తున్నారు.

కాఫర్ డ్యాం వద్ద 37 మీటర్ల వరద నీటికే ఇంత పెద్ద వరద వస్తే, ప్రాజెక్టును పూర్తి చేసి నీరు నిలబెడితే మొత్తం జలమయమయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ముంపులోనే లేదని పేర్కొంటూ కుక్కునూరు మండలం కివ్వాకలో గిరిజనుల కోసం పునరావాస కాలనీని నిర్మించారు. గతేడాది వరదలకు ఈ కాలనీలో ఇళ్లు నీటమునిగాయి. 1986, 2022 వరదల ప్రాతిపదికన ముంపు లెక్కలు నిర్ధారించి మండలం యూనిట్‌గా లెక్కిస్తే తప్ప, నిర్వాసితులకు న్యాయం జరిగే పరిస్థితి కనిపించడం లేదు.

ప్రభుత్వం మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. గోదావరి ఉధృతిని బట్టి 1986, 2022 వరదలను పరిగణిస్తే, గతేడాది వరద కాఫర్ డ్యాం నిర్మాణం కారణంగా తెచ్చిన పెట్టిన వరద అని తేలిపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా నిర్వాసితు లందరికీ పరిహారం ఇచ్చి ఖాళీ చేయించాల్సి ఉంది. లేకపోతే నిర్వాసితులు నిత్యం నరకం అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.



వరదలకు కుక్కునూరు కిష్టారంలో ఇంటిపైకప్పు దాకా వచ్చిన వరద (ఫైల్ ఫొటో)

గుక్కెడు నీళ్లు అందించేవారు కరువు



1986 వరదలకు గ్రామంలోని గుట్టపై కుటుంబాలతో ధైర్యంగా ఉన్నాం. హెలికాప్టర్ ద్వారా ఆహార పొట్లాలు విసిరేవారు. రోజుకు రెండుసార్లు వచ్చేది. ఆకలి, దప్పికలకు బాధలు పడలేదు. గతేడాది వరదలకు మమ్మల్ని ప్రభుత్వం పట్టించుకోలేదు. టార్పాలిన్లు, ఆహారం పొట్లాల సంగతి దేవుడెరుగు కనీసం తాగునీరు కూడా ఇవ్వలేదు. 500 కుటుంబాలకు గుంట కింద ఉన్న చేతిపంపే దిక్కైంది. మరో అడుగు వరద వస్తే అదీ మునిగిపోయేది.

- కోట్ల బాలరాజు, చింతరేవుపల్లి, విఆర్.పురం మండలం, ఎఎస్ఆర్ జిల్లా

1986 కంటే 2022 వరదే అతి పెద్దది



1986 వరద కంటే 2022 వరదే అతి పెద్దది. ఇప్పుడున్న ప్రాంతంలోనే అప్పుడు ఉన్నాం. అప్పటి కంటే ఇప్పుడు దాదాపు నాలుగైదు అడుగుల ఎత్తు మెరక చేసుకుని ఇళ్ల నిర్మాణం చేసుకున్నాం. అప్పుడు ఇంటిని వరద చుట్టుముట్టింది. అప్పటికంటే ఇప్పుడు ఎత్తులో ఇల్లు కట్టుకున్నా 2022 వరదలకు కూడా ఇంటి చుట్టు వరద వచ్చింది. అప్పట్లో నాలుగైదు రోజులకు వరద తగ్గిపోయింది. ఈసారి వచ్చిన వరద వారం రోజులకుగానీ తగ్గలేదు. అలాంటి ప్రాంతాన్ని 45.72 కాంటూరులో చేర్చి పరిహారం ఇవ్వడం లేదు. ప్రాజెక్టు పూర్తయితే మా పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు.

-షేక్ మహబూబ్ బాషా, కుక్కునూరు, బి బ్లాక్, ఏలూరు జిల్లా

వరద ఒక్కసారిగా వచ్చిపడింది



1986లో వర్షాలు కురిసి, చెరువులు నిండిన తర్వాత వరద వచ్చింది. గతేడాది ముందురోజు పశువులను మేతకు తోలుకు వెళ్లాం. తెల్లారే సరికి వరద ముంచెత్తింది. వెంటనే కిష్టారం గుట్ట వద్దకు వెళ్లి తలదాచుకున్నాం. అప్పట్లో ఏ అడ్డూ లేకపోవడంతో వరద వెంటనే తగ్గిపోయింది. 2022లో వరద త్వరగా తగ్గలేదు. మాకు ఇప్పటికీ ఆర్ అండ్ ఆర్ పరిహారం ఇవ్వడం లేదు.

-సోడే కన్నయ్య, కిష్టారం, ఏలూరు జిల్లా

కాఫర్ డ్యాం కట్టినప్పటి నుంచి ఏటా ముంపే



పోలవరం కాఫర్ డ్యాం కట్టినప్పటి నుంచి ఏటా వరద ఊరిని ముంచేస్తోంది. నాకు ప్రస్తుతం 70 ఏళ్లు. గోదావరి వరదలు ఐదు దశాబ్దాలుగా చూస్తున్నాను. కానీ, గతేడాది వరదకు జులై 14 నుంచి సెప్టెంబరు 14 వరకూ మూడు నెలల పాటు గ్రామంలోని గుట్టపైనే గుడారాలు వేసుకుని జీవించాం. గతంలో ఎప్పుడూ ఇంతకాలం ఉండాల్సిన అవసరం రాలేదు.

- ముత్యాల సీతయ్య, చింతరేవుపల్లి, విఆర్.పురం మండలం, ఎఎస్ఆర్ జిల్లా

1986 వరద ప్రభావం చాలా తక్కువ



2022తో పోల్చితే 1986 వరద ప్రభావం చాలా తక్కువ. అప్పటి వరదకు గుట్ట కింద ఉన్న చేతి పంపు మునిగింది. తాజా వరదకూ ఈ పంపు మునిగిపోయింది. మా ఊరి వరదలకు ఇదే గీటు రాయి. అయితే, 1986లో మూడో రోజు నుంచే వరద తగ్గుముఖం పట్టింది. ఇళ్లు శుభ్రం చేసుకుని వారానికే తిరిగి వచ్చాం. గతేడాది వరదలకు మూడు నెలలు ఊరు ముంపులోనే ఉంది. దీంతో, అన్ని కుటుంబాలకూ గ్రామంలోని గుట్టే దిక్కైంది.

- ముత్యాల శోభన్ బాబు, చింతరేవుపల్లి, విఆర్.పురం మండలం, ఎఎస్ఆర్ జిల్లా

వరద అంటేనే ప్రాణంపోతోంది



గతంలో గోదావరి అంటే భయపడేవాళ్లం కాదు. పది లేక 15 సంవత్సరాలకు ఒక్కసారి ఉధృతంగా వచ్చేది. తర్వాత రోజుల వ్యవధిలోనే తగ్గిపోయేది. మూడేళ్లుగా ఏటా వరద తీవ్రత పెరిగింది. 1986 వరదలకు నా వయస్సు 25 ఏళ్లు. చంటి బిడ్డలతో గుట్టపైకి వెళ్లి వారం రోజులు గుడారంలోనే ఉన్నాం. 2022 వరదలకు నా కోడలు నిండు గర్భిణి. చుటూ వరద నీరు. నావలో కోతుల గుట్టకు చేర్చి కాన్పు చేశాం. ఆ సాయమూ అందకపోతే ఏమై పోయేవాళ్లమో. అందుకే గోదారి వరద అంటేనే ప్రాణం పోతోంది.

- ముత్యాల సావిత్రి, చింతరేవుపల్లి, విఆర్.పురం మండలం, ఎఎస్ఆర్ జిల్లా



గత ఏడాది వరద ముంపునకు గురైన కన్నాయిగూడెం పునరావస కాలనీ (ఫైల్ ఫొటో)

పునరావాసంలో అవస్థలు

- నిర్వాసిత కాలనీల్లో వసతుల కరువు
- అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణం
- అస్తవ్యస్తంగా రోడ్లు, డ్రెయినేజీలు

ప్రజాశక్తి - ఎటపాక, అల్లూరి సీతారామరాజు జిల్లా

పోలవరం నిర్వాసిత కాలనీల్లో మౌలిక సదుపాయాలు ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడంలేదు. ఒక వైపు ప్రాజెక్ట్ నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నా.. ఆ స్థాయిలో పునరావాస కాలనీల్లో పురోగతి కనిపించడం లేదు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏటపాక మండలంలో నర్సింగపేట, కాపవరం, ఎర్రబోరు, రాయనపేట, కన్నాయిగూడెం గ్రామాల్లో విఆర్.పురం మండలంలోని 41.15 కాంటూరు ముంపు గ్రామాలకు పునరావాస కాలనీల నిర్మాణాన్ని చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో వీటి నిర్మాణాలు ప్రారంభించినా నేటికీ ఒక్క పునరావాస కాలనీ కూడా పూర్తి స్థాయిలో నిర్మాణం జరగలేదు. ఐదు పునరావాస కాలనీలలో ఇళ్ల నిర్మాణం తుది దశకు చేరుకున్నప్పటికీ మౌలిక సదుపాయాలు మాత్రం ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి.

నర్సింగపేట ఆర్అండ్ఆర్ కాలనీలో విఆర్.పురం మండలానికి చెందిన ముంపు గ్రామాలైన కొటారిగొమ్ము, శ్రీరామగిరి, సీతంపేట, కొల్లూరు-గొందూరు, వివన్.పురం, మెట్టగుడెం, కొత్తూరు గ్రామాలకు పునరావాసం కల్పిస్తున్నారు. 285 కుటుంబాలకు ఇక్కడ కాలనీ నిర్మిస్తుండగా వాటిలో కామన్ హౌస్‌లు 259, ట్విన్ హౌస్‌లు 15 ఉన్నాయి. రోడ్లు, డ్రెయినేజీ, పంచాయతీ కార్యాలయం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం, హెల్త్ సెంటర్, జిసిసి గోడౌన్ తదితర నిర్మాణాలు పూర్తి కాలేదు. రాయనపేట ఆర్అండ్ఆర్ కాలనీలో కూనవరం మండలంలోని 41.15 కాంటూరు ముంపు గ్రామమైన బోజ్జరాయిగూడేనికి చెందిన 166 కుటుంబాలకు పునరావాసం కల్పిస్తున్నారు. ఇక్కడ మౌలిక వసతులు పూర్తికాలేదు. రోడ్లు లేవు. పాఠశాల, అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాలు నిర్మాణ దశలోనే ఉన్నాయి. గతేడాది గోదావరి వరదలలో ఈ పునరావాస కాలనీ సగం నీట మునిగింది. పునరావస కాలనీ నిర్మాణం చేపట్టక ముందు ఆ ప్రదేశంలో ఆది మానవుల అవశేషాలను గుర్తించారు. ఇది గోదావరి ముంపు ప్రాంతమని గుర్తించి ఆ అవశేషాలను తరలించారు. కానీ అదే ప్రాంతంలో ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మాణం చేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.

కాపవరం ఆర్అండ్ఆర్ కాలనీలో విఆర్.పురం మండలానికి చెందిన తుష్టివారిగూడెం గ్రామస్తులకు 131 ఇళ్లు నిర్మాణం చేపట్టారు. గతేడాది వరదలకు ఈ కాలనీ సమీపంలోకి వరద నీరు చేరిందని స్థానికులు తెలిపారు. ఎర్రబోరు ఆర్ అండ్ ఆర్ కాలనీలో విఆర్ పురం మండలం ముంపు గ్రామమైన ఇసునూరుకు చెందిన 88 కుటుంబాలకు పునరావాసం కల్పిస్తున్నారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణం పూర్తికావచ్చినా మౌలిక సదుపాయాలు ప్రారంభానికి నోచుకోలేదు. కన్నాయిగూడెం ఆర్అండ్ఆర్ కాలనీలో విఆర్.పురం మండలానికి చెందిన ములకనపల్లి, భీమవరం, కల్తనురు, ఇప్పూరు గ్రామాలకు చెందిన 329 కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇక్కడ ప్రభుత్వం ప్రకటించిన మౌలిక వసతుల జాడే కనిపించడం లేదు. గతేడాది వరదలకు దాదాపు సగం ఇళ్లు నీట మునిగాయి.

అన్ని పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు పూర్తి చేయడానికి కావాల్సిన నిధులు కేటాయింపులు లేకపోవడమే నిర్మాణల ఆలస్యానికి కారణంగా తెలుస్తోంది. ఒకవైపు గోదావరి ముంపు గ్రామాలను వరద భయపెట్టి తరుముతుంటే మరోవైపు పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన నత్తనడకన సాగుతోంది.

సమగ్ర సర్వే అవసరం

- పోలవరం ముంపుపై అధ్యయనాలు చెపుతున్నదిదే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

గోదావరికి నిరుడొచ్చిన వరదల ఉధృతి, సృష్టించిన విధ్వంసం నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ముంపుపై సమగ్ర సర్వే చేయాల్సిన అవసరం ఉందన్న డిమాండ్ నిపుణుల నుంచి, నిర్వాసితుల నుంచి వినవస్తోంది. దీనిపై కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ పరిధిలోని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పిపిఎ) నుంచి కాని, కేంద్ర జలసంఘం (సిడబ్ల్యుసి) నుంచి కాని, ప్రాజెక్టు పనులను తలకెత్తుకున్న రాష్ట్ర ప్రభుత్వం నుంచి కాని కనీస స్పందన రావట్లేదు. ఎప్పుడో బ్రిటీష్ కాలం నాటి కాంటూర్ లెక్కలనే ప్రామాణికంగా చేసుకొని ముంపు ప్రాంతాలను నిర్ణయిస్తున్నారు. నిర్వాసితుల ఆందోళనలతో లైడార్ సర్వే నిర్వహించగా ప్రాజెక్టు తొలిదశగా చెపుతున్న +41 మీటర్ల కాంటూర్ పరిధిలో గతంలో 123 గ్రామాలుండగా, లైడార్ సర్వే తర్వాత అదనంగా 48 గ్రామాలను కలిపారు. ఈ పరిణామంతో పాత కాంటూరు గణాంకాలు తప్పని తేటతెల్లమైంది. ప్రాజెక్టు రెండవ దశగా చెపుతున్న +45 కాంటూర్‌లో లేని గ్రామాలు సైతం నిరుడొచ్చిన వరదలకు మునిగాయి. సర్వసాధారణ (నేచురల్) వరద ముంపు అని ప్రభుత్వం వాదిస్తోంది. నదికి అడ్డంగా కాఫర్‌డ్యాం కట్టడం వలన వరద నీరు వెనక్కి తన్ని వచ్చిన ముంపు అని, చాలా రోజులు గ్రామాల్లో వరద ప్రభావం ఉందని బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ పరిస్థితి సమగ్ర సర్వే ఆవశ్యకతను మరింత ముందుకు తెచ్చింది.

భద్రాచలం బేస్ అంచనాలు

నిరుడొచ్చిన వరదలపై తెలంగాణ ప్రభుత్వ ఇరిగేషన్ ఇంజనీరింగ్ విభాగం అధ్యయనం చేసి, పోలవరం బ్యాక్ వాటర్‌పై స్వతంత్ర సంస్థతో సమగ్ర సర్వే చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెపుతూ పిపిఎకి లేఖ రాసింది. గోదావరి వరదలంటే స్ఫురించేది భద్రాచలం. ఉమ్మడి రాష్ట్రం నుంచి గోదావరి వరదల లెక్కలు భద్రాచలం బేస్‌గానే వేశారు. భద్రాచలం టౌన్‌కు అతి సమీపంలోనే పోలవరం కోసం ఎ.పి.లో కలిపిన ఎటపాక, కూనవరం, విఆర్ పురం, చింతూరు విలీన మండలాలున్నాయి. ఆ మండలాలకూ భద్రాచలం వద్ద లెక్కలే నేటికీ ఆధారం. గోదావరికి 1986లో వచ్చిన వరదలు అతిపెద్దవిగా చెపుతారు. అప్పుడు భద్రాచలం వద్ద 55.65 మీటర్ల మట్టం (182.60 అడుగులు) రికార్డయింది. గరిష్టంగా 27 లక్షల క్యూసెక్కుల వరద నీరు పారింది. నిరుడు అంతకంటే తక్కువ స్థాయి వరదలొచ్చినప్పటికీ 1986 నాటి తీవ్రత కనిపించిందని, పోలవరం బ్యాక్ వాటరే అందుక్కారణమని తెలంగాణ ఇరిగేషన్ ఇంజనీరింగ్ విభాగం అంచనా వేసింది. నిరుడు జులై 9న భద్రాచలం వద్ద 38.71 మీటర్లు (127 అడుగులు) నీటిమట్టం నమోదైంది. అదే నెల 16 మధ్యాహ్నం ఒంటి గంటకు అత్యధికంగా 54.35 మీటర్లు (178.30 అడుగులు) నీటి మట్టం రికార్డయింది. గరిష్టంగా 24.50 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. అశ్వాపురం, భద్రాచలం, బూర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం, పినపాక మండలాల్లోని 99 గ్రామాలు నీట మునిగాయి. ఈ గ్రామాలన్నీ మన విలీన మండలంలోని గ్రామాల కంటే ఎగువన ఉంటాయి. ఈ నేపథ్యంలో దిగువనున్న ఎపిలో ముంపు తీవ్రత స్థాయిని ఊహించవచ్చు.

ఐఐటి రూర్కీ స్టడీ

పోలవరం ప్రాజెక్టును తొలుత 36 లక్షల క్యూసెక్కుల వరద సామర్థ్యంగానే పేర్కొన్నారు. అనంతరం గరిష్ట పరిమితి 50 లక్షల క్యూసెక్కులకు పెంచారు. సిడబ్ల్యుసి స్టడీ 36 లక్షల మేరకే జరిగింది. భద్రాచలం వద్ద గోదావరికి మొదటి ప్రమాద హెచ్చరిక 45.73 మీటర్లు (+150 అడుగులు) రెండవ ప్రమాద హెచ్చరిక 47.15 మీటర్లు (+155 అడుగులు), డేంజర్ లెవల్ 48.77 మీటర్లు (+160 అడుగులు). పోలవరం వద్ద 42.67 మీటర్ల (+140 అడుగులు) వద్ద వరదను నిర్వహిస్తుంటే భద్రాచలం వద్ద 58.32 మీటర్ల (191.35 అడుగులు) లెవెల్‌లో వరద ప్రవాహం ఉంటుంది. భద్రాచలం వద్ద కనిష్ట లోతు +107 అడుగులు (బెడ్ లెవెల్) కాగా పోలవరం నిర్మించాక 135 అడుగుల వద్ద ఎండిడిఎల్ (మినిమం డ్రాడౌన్ లెవెల్) ఉన్నప్పుడు భద్రాచలం వద్ద బెడ్ లెవల్‌పై 28 అడుగుల మట్టం పెరుగుతుంది. అదే పోలవరం వద్ద పూర్తి స్థాయిలో +150 అడుగుల వద్ద ఎండిడిఎల్ ఉంటే భద్రాచలం వద్ద బెడ్ లెవల్‌పై 43 అడుగులు పెరుగుతుంది. ఐఐటి రూర్కీ అంచనా ప్రకారం గోదావరికి 58 లక్షల క్యూసెక్కుల వరదొస్తే శబరి ఎగువనున్న కుంట వద్ద 66.58 మీటర్లు (218.40 అడుగులు) నీరొస్తుంది. సిడబ్ల్యుసి మాత్రం 36 లక్షల క్యూసెక్కులకు 54.92 మీటర్ల (180.15 అడుగులు) వరకే అంచనా వేసింది. గోదావరికి 36 లక్షల క్యూసెక్కుల వరదొస్తే తెలంగాణలో 74 గ్రామాలు మునుగుతాయని సిడబ్ల్యుసి లెక్క. అదే 50 లక్షల క్యూసెక్కులైతే 92 గ్రామాలు మునుగుతాయి. కానీ నిరుడొచ్చిన వరదలకు (24.50 లక్షల క్యూసెక్కులు) ఏకంగా 99 గ్రామాలు మునిగాయని తెలంగాణ ఇరిగేషన్ పిపిఎకి రాసిన లేఖలో పేర్కొంది. ఈ అధ్యయనాల నేపథ్యంలో బ్యాక్‌వాటర్ ముంపు ప్రభావంపై సమగ్ర సర్వే అవసరమని రూఢీ అవుతోంది.

కాకిలెక్కలతో కాంటూర్ లెవల్స్

- పోలవరంలో కచ్చితత్వాన్ని గుర్తించని ప్రభుత్వం
- ముందుకు సాగని పునరావాసం పనులు
- ఆందోళనలో నిర్వాసితులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు సంబంధించిన కాంటూర్ లెక్కలు గందరగోళంగా వున్నాయి. 2022లో గోదావరికి వచ్చిన వరదలతో కాంటూర్ లెవల్స్ ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో తేటతెల్లమైంది. ఆ వరదల్లో పునరావాస కాలనీ కూడా ముంపునకు గురికావడం నిర్వాసితులను మరింత ఆందోళనకు గురిచేసింది. గోదావరి నదికి 1986లో వచ్చిన వరద మట్టం 75 అడుగులు కాగా, 2022లో వచ్చిన వరదలు 71.2 అడుగులు మాత్రమే. అయితే 1986లో జరిగిన ముంపుకంటే 2022లో ముంపు ఎక్కువగా వుందని, కాఫర్ డ్యామ్‌తోనే ఇంత పెద్ద ముంపు ఏర్పడితే డ్యామ్ పూర్తిస్థాయి మట్టం 45.75 మీటర్లు కడితే తమ పరిస్థితి ఏమటనే నిర్వాసితులు ప్రశ్నలకు ప్రభుత్వం వద్ద సరైన సమాధానం లేని పరిస్థితి వుంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి మాత్రమే నిధులిస్తామని, భూసేరకరణను రాష్ట్ర ప్రభుత్వమే భరించుకోవాలని కేంద్ర ప్రభుత్వం చెబుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం పునరావాస పనులన్నిటినీ అటకెక్కించి కేవలం ప్రాజెక్టు నిర్మాణ పనులను మాత్రమే చేస్తోంది. దీంతో పోలవరం ప్రాజెక్టులో నిర్మాణ పనులు 79.6 శాతం పూర్తయితే, పునరావాసం పనులు 22 శాతం మాత్రమే జరగ్గా, కేవలం 11.9 శాతం కుటుంబాలను మాత్రమే పునరావాస కాలనీలకు తరలించారు. నిధుల విడుదలకు సంబంధించి కేంద్రం పెట్టిన తిరకాసులతో రాష్ట్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని రెండు ప్యాకేజీలుగా విభజించింది. 41.15 మీటర్ల కాంటూర్ లెవల్‌కు ఒక ఫేజ్, 45.73 కాంటూర్ లెవల్‌కు రెండో ఫేజ్ కింద చేపడతామని ప్రకటించి ఆ మేరకు ఇప్పుడు మొదటి దశ పునరావాస పనులను మాత్రమే చేపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న లెక్క ప్రకారం పోలవరం ప్రాజెక్టు కింద మొత్తం 45.72 మీటర్లకు 373 నివాసిత గ్రామాలు ముంపునకు గురవుతున్నట్లు అంచనాలు కట్టింది. ఇందులో మొదటి దశలో 41.15 మీటర్లకు ఆరు మండలాల్లోని 123 నివాసిత ప్రాంతాల్లోని 20,946 కుటుంబాలు ముంపుబారిన పడుతున్నట్లు ప్రభుత్వం లెక్క చెబుతోంది. ఈ మేరకు ప్రభుత్వం ఎగువ ప్రాంతాల్లో పునరావాస గ్రామాల నిర్మాణాలకు పూనుకుంది. 213 పునరావాస గ్రామాల నిర్మాణాలు చేపట్టింది. అయితే 2022లో గోదావరికి వచ్చిన భారీ వరదలు ప్రభుత్వం చెబుతున్న ముంపు గ్రామాల లెక్క తప్పని ఆచరణలో రుజువైంది. కుకునూరు గ్రామంలో చేపట్టిన పునరావాస కాలనీ కూడా వరదలో ముంపునకు గురైంది. ప్రభుత్వం పూర్తి సురక్షిత ప్రాంతంలో కడుతున్నామని చెబుతున్న పునరావాస కాలనీలు కూడా ముంపునకు గురికావడంతో ముంపు ప్రాంత ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వరదలకే తీవ్ర ముంపు ఏర్పడితే పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక పూర్తిస్థాయిలో (ఎఫ్ఆర్ఎల్) నీటిని నిల్వ వుంచితే ముంపు తీవ్రంగా వుంటుందని పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇటీవల పొరుగు రాష్ట్రాలు 2022లో వచ్చిన వరదలకు ఏర్పడిన ముంపును పరిగణనలోకి తీసుకొని రీ సర్వే చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోలవరం అథారిటీ లైడార్ సర్వే చేయగా, మరో 36 గ్రామాల పరిధిలో 48 నివాసిత ప్రాంతాలు కొత్తగా ముంపులోకి చేరాయి. ఈ నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టులో ముంపు ఎంత అన్నది తేల్చి వారికి పునరావాసం పనులను ముందు చేపట్టాలని సిపిఎం డిమాండ్ చేస్తోంది. 2022 వరదలకు ముందు ప్రకారం భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి రూ.28,172.21 కోట్లు అవుతుందని అంచనా. ముంపుపై సమగ్ర సర్వే చేస్తే అంచనాలు మరింత పెరిగే అవకాశం వుంది. ఇందులో భూసేకరణ కోసం రూ.6,528 కోట్లు, ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణానికి రూ.12,218 కోట్లు, పునరావాసం కోసం రూ.7,234 కోట్లు అవసరమని అంచనా. ఏలూరు జిల్లాలో మూడు మండలాల్లో 137 నివాసిత ప్రాంతాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఐదు మండలాల్లో 236 నివాసిత ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. ఏలూరు జిల్లాలో 34,697 కుటుంబాలు, ఎఎస్ఆర్ జిల్లాలో 71,309 కుటుంబాలు కలిపి మొత్తం 1,06,006 కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి వుండగా కేవలం 12,658 కుటుంబాలను మాత్రమే ఇప్పటిదాకా తరలించారు. ఆర్అండ్ఆర్ కాలనీల నిర్మాణం కూడా నత్తనడకన నడుస్తోంది. మొత్తం ముంపునకు గురయ్యే 373 నివాసిత ప్రాంతాలకు 213 కాలనీల నిర్మాణం చేయాల్సి వుండగా ఇప్పటిదాకా కేవలం 26 కాలనీలు మాత్రమే పూర్తయ్యాయి. పోలవరం ప్రాజెక్టులో స్ట్రక్చరల్ నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నట్లుగా పునరావాసం పనులు జరగని పరిస్థితి వుంది. ప్రాజెక్టు నిర్మాణ పనులు దాదాపు 80 శాతానికి చేరుకోగా పునరావాసం పనులు 22 శాతం వద్దనే వుండటం ఆందోళన కలిగించే అంశంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం పోలవరంలో పునరావాస పనులతో ప్రమేయం లేకుండా ప్రాజెక్టు పూర్తికి పరుగులు పెట్టించడం తగదని పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నిర్వాసితులకు పూర్తిగా న్యాయం చేశాకే పోలవరం పనుల్లో ముందుకు వెళ్లాలని బాధితులు కోరుతున్నారు. కాంటూర్ లెక్కలతో ప్రమేయం లేకుండా 2022లో వచ్చిన వరద ముంపును ఆధారంగా పునరావాస ప్యాకేజీని అమలు చేయాలని బాదితులు కోరుతున్నారు.

డయాఫ్రమ్ వాల్‌కు నష్టం గత ప్రభుత్వ నిర్వాకమే

- భారీ జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - పోలవరం (పశ్చిమగోదావరి జిల్లా)



పోలవరం పనులను పరిశీలిస్తున్న మంత్రి అంబటి

పోలవరం ప్రాజెక్ట్ పనులను గత ప్రభుత్వం ప్రొటోకాల్ భిన్నంగా చేపట్టిన కారణంగా డయాఫ్రమ్ వాల్‌కు నష్టం జరిగిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. పోలవరం ప్రాజెక్ట్ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్మించాల్సిన జాతీయ ప్రాజెక్టును తాము నిర్మిస్తామని చంద్రబాబు ప్రభుత్వం నెత్తినేసుకోవడమే గత ప్రభుత్వం చేసిన మొదటి తప్పిదమన్నారు. గోదావరి నీటిని మళ్లించేందుకు ఎగువ, దిగువ కాపర్ డ్యామ్ పూర్తి చేసిన తరువాత డయాఫ్రమ్ వాల్ నిర్మించాల్సి ఉండగా, వాటిని పూర్తి చేయకుండా డయాఫ్రమ్ వాల్ నిర్మించి రెండో తప్పిదం చేశారని విమర్శించారు. కాఫర్ డ్యామ్ మూడేళ్ల వరకు గ్యారంటీ ఉంటుందని, ఆ సమయంలోనే ఎర్త్ కం రాక్ ఫిల్ డాం నిర్మించుకోవలసి ఉంటుందని, నదిని డైవర్ట్ చేసే పని చేయకుండా లోయర్, అప్పర్ కాపర్ డ్యామ్ పనులు గత ప్రభుత్వం చేపట్టిందన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లోయర్, అప్పర్ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేశామని చెప్పారు. గత ప్రభుత్వం ప్రొటోకాల్‌కు భిన్నంగా నిర్మించడం వల్ల గతేడాది గోదావరి నదికి వచ్చిన వరద ఉధృతికి డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని తమ ప్రభుత్వం సరిచేసిందని, ఎగువ కాఫర్ డాం ఎత్తును ఒకటిన్నర మీటర్లు పెంచామన్నారు. కాఫర్ డ్యామ్, స్పిల్ వే, స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్, అప్రోచ్ ఛానల్ తమ ప్రభుత్వం పూర్తి చేసిందని, స్పిల్‌వేకి గేట్లు తమ ప్రభుత్వమే ఏర్పాటుచేసి నది నీటిని మళ్లించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కేంద్ర జలసంఘం, నేషనల్ హైడ్రో ప్రాజెక్ట్ కార్పొరేషన్ నిపుణులు డయాఫ్రమ్ వాల్‌ని పరిశీలించిన తరువాత వారి సూచనల మేరకు డయాఫ్రమ్ వాల్‌కు మరమ్మతులా లేక దానికి సమాంతరంగా మరో డయాఫ్రమ్ వాల్ నిర్మించడమా అనేది నిర్ణయిస్తామని తెలిపారు. ప్రస్తుతం గోదావరి నదికి 1.2 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తోందని, వరద నీటి కారణంగా ప్రాజెక్ట్ పనులకు ఎటువంటి అంతరాయం లేదని, వరద తీవ్రత ఇంకా పెరిగితే అప్పటి పరిస్థితి అనుసరించి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ నారాయణరెడ్డి, చీఫ్ ఇంజినీర్ సుధాకర్ బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్ నరసింహామూర్తి పాల్గొన్నారు.

సంపాదకీయం

రెండు సమావేశాలు

అధికార, ప్రతిపక్ష పార్టీలు మంగళవారం నాడు విడివిడిగా జరిపిన సమావేశాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. బిజెపి దుష్ట పాలనను అంతమొందించాలన్న లక్ష్యంతో ప్రతిపక్ష పార్టీలు బెంగళూరులో సమావేశం కాగా, ఎలాగైనా మళ్లీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా తొమ్మిదేళ్లుగా మరచిపోయిన ఎన్‌డిఎ పార్టీలతో పాలక బిజెపి హడావిడిగా దేశ రాజధాని నగరం ఢిల్లీలో సమావేశం నిర్వహించింది. కేవలం ఎన్నికల దృష్టితోనే కాకుండా దేశ భవిష్యత్తుకు కూడా ఈ రెండు సమావేశాలు ఎంతో కీలకమైనవి! ప్రతిపక్షాలు చేస్తున్న ప్రయత్నాలు దేశ ప్రజలకు కొత్తేమీకాదు. బెంగళూరు తరహా సమావేశం ఇంతకుముందు పాట్నాలో జరిగింది. దాని కొనసాగింపుగానే తాజా సమావేశం జరిగింది. రానున్న రోజుల్లోనూ మరికొన్ని సమావేశాలు ఉంటాయని, వాటిలోనే తమ కార్యాచరణను వెల్లడిస్తామని ప్రతిపక్ష నేతలు ప్రకటించారు. అయితే, గత బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్షాలన్నింటిని కట్టగట్టి ఓడించడానికి తానొక్కడినే చాలంటూ ఛాతీ విరుచుకున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆకస్మికంగా ఎన్‌డిఎ పల్లవిని ఎత్తుకోవడమే అనూహ్యం! నిజానికి గుజరాత్‌లో మినహా గత మూడేళ్లలో వివిధ రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు మరీ ముఖ్యంగా హిమాచల్, కర్ణాటక ఫలితాలు బిజెపికి వణుకు పుటించాయి. ఆ తరువాత 26 ప్రతిపక్ష పార్టీలు ఏకం కావడం బిజెపి నేతలను బెంబేలెత్తిస్తున్నాయనడానికి ఈ హఠాత్తు సమావేశమే ఒక నిదర్శనం. హిందుత్వ నినాదంతో దేశ ప్రజలను చీల్చాలన్న ఎత్తుగడ ఎల్లకాలం సాగదని స్పష్టమౌతోంది. ప్రతిపక్షాల సమావేశానికి 26 పార్టీలు హాజరుకాగా, తాము నిర్వహించిన సమావేశానికి 38 పార్టీలు హాజరయ్యాయని బిజెపి గొప్పగా చెప్పుకుంటోంది. నిజానికి ఈ 38 పార్టీలలో రెండింటికి మాత్రమే పార్లమెంటులో చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రాతినిధ్యం ఉంది. 24 పార్టీలకు ప్రాతినిధ్యం లేదు. మిగిలిన వాటికి ఎన్నికల సంఘం గుర్తింపే లేదు. ఆ పార్టీల్లో కూడా చాలావరకు ఇడి, సిబిఐ, ఐటి, ఎన్‌ఐఎ దాడులకు భయపడి వచ్చి చేరినవే!

ప్రతిపక్షాల సమావేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమానత్వం, సామాజిక న్యాయం, అభివృద్ధి వంటి అంశాలు చర్చకు వచ్చాయి. తొమ్మిదేళ్ల బిజెపి పాలనలో ప్రజల హక్కులపైనా, జీవనోపాధిపైనా, స్వేచ్ఛపైనా, సౌభ్రాతృత్వంపైనా జరిగిన భయానక దాడిని విపక్ష నేతలు చర్చించారు. వీటిని పునరుద్ధరించడమే లక్ష్యంగా ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయెన్స్ (ఐఎన్‌డిఐఎ-ఇండియా)ను ప్రకటించారు. ఈ దిశలో మరింత విస్తృత కార్యాచరణను రూపొందించడమే లక్ష్యంగా త్వరలో మరోసారి సమావేశం కానున్నట్లు తెలిపారు. భేటీ అనంతరం నాయకులు చేసిన ప్రకటనలు కూడా ఈ స్ఫూర్తినే కనపరిచాయి. ప్రధాని పదవి పట్ల కాంగ్రెస్‌కు ఎటువంటి ఆసక్తి లేదని ఆ పార్టీ అధ్యక్షుడు ఖర్గే ప్రకటించడం, మిగిలిన పార్టీల నాయకులు కూడా ఇదే వైఖరి అవలంభించడం ఆహ్వానించదగిన పరిణామం. ప్రతిపక్షాల మధ్య వ్యక్తమైన ఇటువంటి ఐక్యతే గతంలో ఒకసారి బిజెపి ప్రభుత్వాన్ని అధికారం నుండి దించగలిగింది. ఎన్నికల సమరంలో రాష్ట్రాల పరిధిలో ఎక్కడికక్కడ సహకరించుకోవడం ద్వారా బిజెపి వ్యతిరేక ఓటు చీలకుండా చూడాలన్న ఏకాభిప్రాయానికి విపక్ష పార్టీలు వచ్చాయి. బిజెపి నిర్వహించిన ఎన్‌డిఎ సమావేశం దీనికి భిన్నంగా నరేంద్రమోడీ చుట్టూ తిరిగింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల ఊసే ఈ సమావేశంలో కనిపించలేదు. మోడీ ఉపన్యాసం ప్రతిపక్షాలను ఆడిపోసుకోవడానికే పరిమితమైంది. తొమ్మిదేళ్ళ కాలంలో ఎన్‌డిఎ లోని వివిధ పార్టీలను నిట్టనిలువునా ఎందుకు చీల్చారో, ఇన్నేళ్ల పాటు ఒక్కసారి కూడా సమావేశం ఎందుకు నిర్వహించలేదో అన్న అంశాలపై కూడా ఆయన మిత్రపక్షాలకు వివరణ ఇవ్వలేదు. అయినా, ఆ సమావేశానికి చిన్నా చితక పార్టీలు హాజరయ్యాయంటే, ఒకటో, రెండో సీట్లు గెలవొచ్చనే ఆశ! రానున్న రోజుల్లో ఆ నమ్మకం కూడా పోదన్న గ్యారంటీ లేదు. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ సమావేశానికి రాష్ట్రం నుండి జనసేన వెళ్లడం ఆ పార్టీతో పాటు, రాష్ట్రానికీ హాని కలిగించే చర్యే. ఈ పరిణామం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మరోవైపు అధికారంలో ఉన్న వైసిపి, ప్రతిపక్షం టిడిపిలు బిజెపికి వంత పాడుతూనే ఉన్నాయి. కామన్ సివిల్ కోడ్ పేరుతో మరోసారి మతోన్మాద ఎజెండాను దేశం మీద రుద్దాలని బిజెపి ప్రయత్నిస్తున్న ప్రస్తుత సమయంలోనైనా ఆ పార్టీలు తమ వైఖరేమిటో స్పష్టం చేయాలి. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో బిజెపిని బలపరుస్తూ తాము లౌకిక వాదులమని చెప్పుకునే అర్హత ఏ పార్టీకి ఉండదు.

మంచి మాట



నిన్న పోయింది.
రేపు ఇంకా రాలేదు.
మనకు ఈ రోజు మాత్రమే ఉంది.
ప్రారంభిద్దాం.

- మదర్ థెరిస్సా

మన 'దరిద్రపు' లెక్కలేంటి? మనం ఎక్కడున్నాం?

విశ్లేషణ

శారద



ప్రపంచ బహుముఖ దారిద్ర్య సూచిక (ఎంపిఐ)-2023 ప్రకారం మన దేశం గడచిన పదిహేను సంవత్సరాలలో 41.5 కోట్ల మందిని దారిద్ర్యం నుంచి విముక్తి కలిగించినట్లు ప్రకటించారు. ఎందరో ఈ వార్తను చదివి సంతోషించారు. జీవన పరిస్థితులను "గణనీయం"గా మెరుగుపరచినందున ఈ పురోగతి సాధించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్‌తో పాటు, తమ పాలన కూడా వుంది గనుక, మరీ డబ్బా కొట్టుకుంటే జనం నవ్విపోతారు గనుక కాషాయ దళాలు కాస్త తగ్గి ఉన్నట్లు కనిపిస్తోంది. సున్నా కంటే ఒకటి విలువ ఎంతో ఎక్కువ అన్నట్లుగా దీని గురించి సానుకూల వైఖరితోనే మంచి చెడ్డలను చూద్దాం. ఈ సూచికను ఐరాస అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి), ఆక్స్‌ఫర్డ్ దారిద్ర్య, మానవ అభివృద్ధి చొరవ (ఓపిహెచ్‌ఐ) సంస్థ ఉమ్మడిగా రూపొందించాయి. ప్రభుత్వాలు అందించిన సమాచారాన్ని విశ్లేషించి వివరాలను వెల్లడించారు. ఇది ఒక్క మన దేశం గురించే కాదు, అన్ని దేశాల గురించీ 2010 నుంచి ప్రతి ఏటా ఇలాంటి సమాచారాన్ని ప్రకటిస్తున్నారు. వివిధ అంశాల ప్రాతిపదికన జీవన నాణ్యతను లెక్కిస్తున్నారు. మన దేశంలో 2005-06 నుంచి 2019-2021 వరకు పదిహేను సంవత్సరాలలో వచ్చిన మార్పు ప్రకారం పోషకాహారం, శిశు మరణాలు, స్కూలుకు వెళ్లే సంవత్సరాలు, బడికి హాజరు, వంట గ్యాస్, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ అందుబాటు, ఇంటివసతి, ఆస్తులు ఎంత మేరకు కలిగి ఉన్నారనేదాని ప్రాతిపదికగా అంచనా వేశారు. 2005-06లో ఇవి లేని వారు దేశ జనాభాలో 55.1 శాతం, 2015-16లో 27.7 శాతం, 2019-2021లో 16.4 శాతం మంది ఉన్నారని ఎంపిఐ సూచికలో పేర్కొన్నారు. మన దేశంలో 41.5 కోట్ల మంది జీవితాలు మెరుగుపడితే చైనాలో 2010-14 మధ్య 6.9 కోట్ల మంది జీవితాలు మెరుగుపడ్డాయి. ప్రపంచ మంతటా 110 దేశాల్లో 110 కోట్ల మంది ఇంకా దారిద్ర్యం లో మగ్గుతున్నారు. మన దేశంలో 23 కోట్ల మంది ఉన్నారు. ప్రతి ఆరుగురిలో ఐదుగురు ఆఫ్రికాలోని సబ్ సహారా, దక్షిణాసియాలో ఉన్నారు. ఈ విశ్లేషణలన్నీ కరోనాకు ముందు ఉన్న సమాచారం ప్రాతిపదికగా చేసినవే, ఆ మహమ్మారి కలిగించిన ప్రతికూల ప్రభావం వలన దారిద్ర్యంలోకి దిగజారిన వారు ఇంకా పెరిగారని చెబుతున్నారు.

దారిద్ర్యం నుంచి ఇంత మంది బయపడ్డారు అన్నది ఏ ప్రాతిపదికన నిర్ణయిస్తారు. దీనికి ఆయా దేశాలు నిర్ణయించిన ప్రమాణాలు తప్ప ప్రపంచమంతటికీ వర్తించే ప్రాతిపదిక లేదు. ప్రపంచబాంకు నిర్వహించే దారిద్ర్యం, అసమానతల వేదిక-పావర్టీ అండ్ ఇనీక్వాలిటీ ప్లాట్‌ఫాం (పిఐపి) విశ్లేషణ ప్రకారం రోజుకు 2.25 డాలర్లు, అంతకంటే తక్కువ వచ్చే వారు మన దేశంలో 2019లో 11.88 శాతం ఉన్నారు. త్వరలో మన దేశం చైనాను అధిగమించనుందని అనేక మంది చెబుతున్నారు గనుక, దానితో పోలిక ఎలా ఉందో చూద్దాం. 2017 పిపిపి పద్ధతిలో లెక్కించిన మేరకు 2019 నాటి వివరాలు. ఆ ఏడాది సగటున ఒక డాలరుకు రూ.70 మారకపు విలువ ఉంది (జులై 15న ఒక డాలరుకు రూ.82గా ఉంది). కనుక ఎవరికి వారు ఆ రోజున ఉన్న విలువ ప్రకారం లెక్కించుకోవచ్చు. ప్రామాణికంగా డాలర్లను తీసుకున్నారు గనుక ఇక్కడ కూడా దాన్నే తీసుకుందాం. విశ్లేషకులు తీసుకొనే రాబడి అంకెలలో స్వల్ప తేడాలుంటే జనాభా శాతాలు ఎలా మారతాయో కూడా చూద్దాం. ప్రపంచ బాంకు పేర్కొన్న ప్రమాణం ప్రకారమే రోజుకు 2.15 డాలర్ల రాబడిని ప్రాతిపదిక తీసుకుంటే 2015-2019 కాలంలో దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న జనాభా మన దేశంలో 18.7 నుంచి 10 శాతానికి తగ్గగా చైనాలో 1.2 నుంచి 0.1 శాతానికి తగ్గింది. పిఐపి వేదిక సమాచారం మేరకు దిగువ విధంగా ఉన్నారు.

దిగువ అంకెలను బట్టి రోజుకు ఎక్కువ సంపాదించే వారు చైనాలో చాలా ఎక్కువ మంది ఉన్నారు. రాబడిని బట్టి జీవన ప్రమాణాలు, నాణ్యత ఆధారపడి ఉంటుందని వేరే చెప్పనవసరం లేదు. జనాల రాబడితో పాటు ప్రభుత్వాలు అందించే సేవలు కూడా వాటికి తోడౌతాయి. బిజెపి పెద్దలు, కొన్ని మీడియా సంస్థలు మన దేశాన్ని పొరుగు దేశాలైన బంగ్లాదేశ్ (2016), పాకిస్తాన్ (2018)లతో పోల్చి చూపటం తెలిసిందే. వాటి స్థితి ఎలా ఉందో కూడా చూద్దాం. అచ్చే దిన్ గురించి ప్రతి దేశంలోని పాలకులూ చెప్పే కబుర్లే కనుక ఎవరు ఎక్కడ ఉన్నారో ఎవరికి వారే పోల్చుకోవచ్చు.

దక్షిణాసియాలో మన ఇరుగు పొరుగు దేశాల్లో శ్రీలంక పరిస్థితి మెరుగ్గా ఉంది. మన దేశంలో దారిద్ర్యరేఖ గురించి ఎవరికి వారే తమదైన సూత్రీకరణలు చేశారు, భాష్యాలు చెప్పారు. వాటి తీరు తెన్నుల గురించి చూద్దాం. ప్రపంచ బాంకు రోజుకు 1.90 డాలర్లుగా అంతకు ముందు నిర్ణయించిన దానిని 2022లో 2.15 డాలర్లకు పెంచింది. దారిద్ర్యరేఖ నిర్ణయానికి అన్ని దేశాల ప్రమాణాలు ఒకే విధంగా లేవని ముందే చెప్పుకున్నాం. మన దేశంలో కూడా వివిధ కమిటీలు భిన్న ప్రమాణాలను ప్రాతిపదికగా తీసుకున్నాయి. అలఘ్ కమిటీ (1979) ప్రతి రోజూ పెద్దవారికి గ్రామాలలో 2,400, పట్టణాలలో 2,100 క్యాలరీల శక్తి అవసరమని, అందుకు అవసరమైన ఆహారం, దాని ధరలను ప్రాతిపదికగా తీసుకుంది. తరువాత లకడావాలా కమిటీ (1993), టెండూల్కర్ కమిటీ (2009), రంగరాజన్ కమిటీ (2012)లు దీని గురించి నివేదికలు ఇచ్చాయి. రంగరాజన్ కమిటీ పట్టణాల్లో రోజుకు తల ఒక్కింటికి నెలకు రూ.1,407, గ్రామాలలో రూ.972 ఖర్చును దారిద్ర్యరేఖ నిర్ధారణకు ప్రామాణికంగా తీసుకుంది.

మన దేశంలో దారిద్ర్యానికి కారణాలుగా దిగువ వాటిని పేర్కొంటున్నారు. జనాభా పెరుగుదల నిరంతరం జరుగుతున్నది, దానికి అనుగుణంగా వస్తు వినియోగ డిమాండ్ విపరీతంగా పెరుగుతున్నది. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత తక్కువగా ఉండటం. దీనికి కారణం కమతాలు చిన్నవిగా ఉండటం, రైతులకు పెట్టుబడి లేమి, నూతన సాంకేతిక పద్ధతుల గురించి తెలియని తనం, సాంప్రదాయ పద్ధతుల్లోనే సాగు, వృధాను అరికట్టలేకపోవటం, దీని వలన జీవన ప్రమాణాలు పెరగటం లేదు అని చెబుతున్నారు. వనరులను సమర్ధవంతంగా ఉపయోగించకపోవటం, ఆర్థిక వృద్ధి తక్కువగా ఉండటం, పెట్టుబడుల లేమి, ధరల పెరుగుదల, నిరుద్యోగం, వారసత్వం, కుల వ్యవస్థ కూడా కారణాలుగా పేర్కొంటున్నారు. ఇవి నాణానికి ఒక వైపు మాత్రమే. ఈ అంశాల పరిష్కారానికి పాలకులు అనుసరించిన దివాలాకోరు విధానాలు అసలైన కారణాలు. ఆపరేషన్ అవసరమైన చోట పూత మందులు పూసి చికిత్స చేసినట్లుగా అనేక ఉపశమన పథకాలను అమలు జరిపినా ఫలితం ఉండటం లేదు. పరిమితమైన మెరుగుదలను చూపి మొత్తం దారిద్ర్యం నుంచి జనాలను బయటపడవేసినట్లు చెబుతున్నారు. దానికి జీవన ప్రమాణాలు మెరుగుపడినట్లు అందమైన పేరు. ప్రపంచ బ్యాంకు చెప్పినట్లు రోజుకు 2.15 డాలర్లు అంటే (ఇప్పటి మారకపు రేటు ప్రకారం) రూ.172 రాబడి ఉంటే దారిద్ర్యం నుంచి వెలుపలికి వచ్చినట్లే. దీని ప్రకారం నెలంతా పని ఉందనుకుంటే రాబడి రూ.5160 వస్తుంది. రంగరాజన్ కమిటీ ప్రతి వ్యక్తి నెలకు రూ.1,407 ఖర్చు చేస్తే చాలని చెప్పింది. ఇవి నేడున్న స్థితిలో వాస్తవాల ప్రాతిపదికన వేసిన అంచనాలేనా? మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన కనీస వేతనం కూడా నెలకు ఐదున్నర వేలకు అటూ ఇటూగా ఉంటోంది. కేంద్ర ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్‌గా రూ.200, రూ.500 చొప్పున నిర్ణయించింది. అరవై, ఎనభై ఏళ్ల దాటిని వారికి ఇది ఏమూలకు వస్తుందో, ఇతర ఏ ఆధారం లేని పని చేయలేని వారు దానితో ఎలా బతుకులీడుస్తారో అచ్చే దిన్ కబుర్లు చెప్పేవారు ఎన్నడైనా ఆలోచించారా? దారుణమైన అంశం ఏమంటే 2013 లోనే టాస్క్‌ఫోర్స్ కమిటీ పెన్షన్లు పెంచాలని సిఫార్సు చేసింది. దాన్ని పట్టించుకోవాల్సినంత గొప్పది కాదన్నట్లుగా గత తొమ్మిది సంవత్సరాలుగా నరేంద్ర మోడీ సర్కార్ పక్కన పెట్టింది. డిఎంకె సభ్యురాలు కనిమొళి సారథిగా ఉన్న పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ 2023 మార్చి నెలలో ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో దీర్ఘకాలంగా ఎదుగుబొదుగూ లేకుండా ఉన్న ఈ మొత్తాలు ఇప్పుడు దేనికీ చాలవని, పెంచాలని చేసిన సిఫార్సును కూడా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నది పచ్చి నిజం.

మన దరిద్రం గురించి మనమే చెప్పుకుంటే ప్రపంచంలో పలుచన కామా అని కొంతమంది మండి పడతారు. కానీ మన గురించి ప్రపంచం ఎన్నో అంశాలను చెబుతోంది. మన పాలకులు వాటిని దాచిపెడుతున్నారు. ఎవరైనా లేవనెత్తితే రాజద్రోహం అంటున్నారు. ఈ అంశాలను ఎక్కడ చర్చించాలి? ప్రపంచ సంస్థలు ఇచ్చే ర్యాంకులు, సూచికలను అంగీకరించేది లేదు, వాస్తవాలకు ప్రతిబింబం కాదు అంటారు. పోనీ వారు అసలైన అంకెలను వెల్లడిస్తారా అంటే అదీ లేదు. నిజంగా మన దేశం దరిద్రం నుంచి 41.5 కోట్ల మందిని విముక్తి చేస్తే కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన గణాంకాలు చెబుతున్నదేమిటి? కేంద్ర ప్రభుత్వం 2018లో అనీమియా (రక్తహీనత) ముక్త భారత్ పథకాన్ని ప్రకటించింది. జీవన ప్రమాణాలను ప్రతిబింబించే వాటిలో ఇది ఒకటి. ప్రధాని నరేంద్రమోడీ కేంద్రంలో అధికారానికి వచ్చిన తరువాత రెండుసార్లు 2015-16లో నాలుగవ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్), 2019-21లో ఐదవ సర్వే చేశారు. రక్తహీనత పెరుగుదల తగ్గుదల గురించి ఈ రెండు సర్వేలను పోలుస్తూ కేంద్ర ప్రభుత్వం 2022 ఫిబ్రవరిలో పిఐబి ద్వారా సమాచారాన్ని విడుదల చేసింది. దాని ప్రకారం ఒకటి రెండు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో తప్ప దేశమంతటా, మెజారిటీ రాష్ట్రాలలో రక్తహీనత ఉన్నవారి సంఖ్య పెరిగింది. దరిద్రం తగ్గితే ఇది కూడా తగ్గాలి కదా!

జనాభాను ఆరు బృందాలుగా విభజించి రక్తహీనత పరిస్థితి ఎవరిలో ఎలా ఉందో విశ్లేషించారు (పట్టిక). ఇక్కడ బాలికలు, బాలురు అంటే 15-19 సంవత్సరాల వారు. గుజరాత్ అభివృద్ధి నమూనాను దేశమంతటా విస్తరిస్తాను అని నరేంద్రమోడీ 2014 ఎన్నికల్లో చెప్పిన సంగతి తెలిసిందే. కేరళలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ గానీ సిపిఎం గానీ తమది నమూనా అనే మాటలు చెప్పలేదు. దేశ సగటు కంటే ధనిక రాష్ట్రం గుజరాత్‌లో రక్తహీనత అన్ని తరగతుల వారిలో ఎక్కువగా ఉంది. దానికి విరుద్ధంగా కేరళలో మెరుగైన స్థితి ఉంది. ప్రపంచ ఆకలి సూచికలో 2022లో 121 దేశాలకు గాను మన ర్యాంక్ 107గా ఉంది. మెజారిటీ రాష్ట్రాలలో బిజెపి, నరేంద్ర మోడీ కేంద్రంలో అధికారానికి రాక ముందు 2013లో 120 దేశాలకు మన రాంకు 63గా ఉంది. ఇండెక్స్ ముండీ డాట్ కామ్ సమాచారం 2019 ప్రకారం ఐదేళ్ల లోపు పిల్లల్లో రక్తహీనత ఎక్కువగా ఉన్నవారు 186 దేశాలకు గాను మనం 32వ స్థానంలో ఉన్నాం, అదే చైనా 141వ స్థానంలో ఉంది. మన కంటే మెరుగైన స్థానాల్లో శ్రీలంక 98, బంగ్లాదేశ్ 55, నేపాల్ 51, భూటాన్ 50, మయన్మార్ 41, పాకిస్తాన్ 33వ స్థానంలో ఉంది. రెండు ఇంజన్ల పాలన ఉంటేనే అభివృద్ధి అని చెప్పేవారు దీనికి ఏ సమాధానం చెబుతారు. పిల్లలను ఆరోగ్యంగా ఉంచలేని వారు జిడిపి గురించి ఎన్ని కబుర్లు చెప్పినా దాని వలన ఫలితం ఏమిటి ?

★

మన దేశంలో రక్తహీనత వివరాలు

గణన	రాష్ట్రం	పిల్లలు	15 -49 స్త్రీలు	15 -49 గర్భిణులు	మొత్తం స్త్రీలు	బాలికలు	బాలురు
సర్వే 4	దేశం	58.6	53.2	50.4	53.1	54.1	29.2
సర్వే 5	దేశం	67.1	57.2	52.2	57	59.1	31.1
సర్వే 4	గుజరాత్	62.6	55.1	51.3	54.9	56.5	31.9
సర్వే 5	గుజరాత్	79.7	65.1	62.6	65	69.0	36.0
సర్వే 4	కేరళ	35.7	34.7	22.6	34.3	37.8	14.3
సర్వే 5	కేరళ	9.4	36.5	31.4	36.3	32.5	27.4

భారత్-చైనా : రాబడి

దేశం	డాలర్లలో రాబడి	జ. శాతం	డాలర్లలో రాబడి	జ. శాతం	డాలర్లలో రాబడి	జ. శాతం
భారత్	2.25	11.88	3.60	43.66	6.95	84.31
చైనా	2.25	0.18	3.70	3.24	6.80	24.34

బంగ్లాదేశ్ - పాకిస్తాన్ : రాబడి

దేశం	డాలర్లలో రాబడి	జ. శాతం	డాలర్లలో రాబడి	జ. శాతం	డాలర్లలో రాబడి	జ. శాతం
బంగ్లాదేశ్	2.20	14.62	3.65	51.63	6.95	87.43
పాకిస్తాన్	2.15	4.93	3.65	39.84	6.95	85.16

అభిప్రాయం

రేషనలైజేషన్ పేరిట ఐసిటిసి కేంద్రాల కుదింపు



ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ పరీక్ష, కౌన్సిలింగ్ (ఐసిటిసి) కేంద్రాలను కుదించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటు న్న చర్యలు వివాదాస్పదం అవుతున్నాయి. హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) పేరుతో కేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (న్యాకో) ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు సమాచారం. జులై 5వ తారీఖున 'న్యాకో' జారీ చేసిన సర్క్యులర్ నంబర్-11025 పట్ల ఆ సంస్థ సిబ్బంది ఆందోళనలో పడ్డారు. ఎయిడ్స్ రోగులు సైతం అయోమయానికి గురవుతున్నారు.

ప్రపంచ దేశాలను గడగడలాడించిన మహమ్మారిగా పేరున్న హెచ్‌ఐవి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులలో ఉన్న వివక్షతలను పారదోలి, రోగులలో మానసిక స్థైర్యాన్ని, ధైర్యాన్ని నింపేందుకు సుశిక్షితులైన నిష్ణాతులైన కౌన్సిలర్లు సేవలు అందించేవారు. అయితే ప్రస్తుతం కేంద్రం తలపెట్టిన రేషనలైజేషన్ వల్ల ఆ సేవలు కరువు కానున్నాయి. పరీక్షలు చేయించుకోవడానికి అందుబాటులో ఐసిటిసి కేంద్రాలు లేకపోవడం వల్ల, సదరు హెచ్‌ఐవి, అనుమానిత, హై రిస్క్ గ్రూప్, సంక్రమిత వ్యక్తుల ద్వారా ... చాప కింద నీరు లాగా సమాజంలో మరింతగా ఎయిడ్స్ వ్యాధి ప్రబలే ప్రమాదం ఎక్కువగా ఉంది.

భారతదేశం మొత్తం మీద వివిధ రాష్ట్రాలలో 593 ఐసిటిసి కేంద్రాలను ఎత్తివేయడానికి రంగం సిద్ధమైంది. ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ పాలన, ప్రజా సంక్షేమ పథకాలు ఉండాలని పదేపదే వల్లెవేసే ప్రభుత్వాలు వాటిని ప్రజలకు అందకుండా హేతుబద్ధీకరణ పేరిట పట్టణాలకే పరిమితం చేయడం పట్ల ప్రజలు, ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. 2005 సంవత్సరం నుంచి దాదాపు ఇరవై ఏళ్లుగా ప్రతి సామాజిక ఆరోగ్య ఆసుపత్రులలో ఐసిటిసి కేంద్రాలను ఏర్పాటు చేసి హెచ్‌ఐవి, ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ, కౌన్సిలింగ్ సేవలను అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రోగులకు హెచ్‌ఐవి, ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ, సలహాలు, సూచనలతో పాటు ఇతర రోగాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు వివరిస్తూ, కౌన్సిలర్లు తమ ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. జనరల్ వ్యక్తులు, రిస్క్ ఉన్నవారు, ప్రతి గర్భిణీకి, శస్త్ర చికిత్సల సందర్భంగా హెచ్‌ఐవీ వ్యాధి నిర్ధారణ పరీక్షలను శిక్షణ పొందిన ల్యాబ్ టెక్నీషియన్లు మూడు దశలలో పలు టెస్ట్ కిట్లతో ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్ (ఐసిటిసి)లలో కన్ఫర్మేషన్ టెస్టులను నిర్వహిస్తారు. పల్లెల్లో ఇంతటి కీలకమైన సేవలు అందిస్తున్న ఐసిటిసి కేంద్రాలలోని కౌన్సిలర్, ల్యాబ్ టెక్నీషియన్లను ఏరియా, జిల్లా కేంద్ర ఆస్పత్రులలోని ఐసిటిసి కేంద్రాల్లో సర్దుబాటు చేయనున్నారు. ఈ ప్రక్రియ వల్ల పల్లె ప్రాంతాల్లోని రోగులకు వైద్య సేవలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, కౌన్సిలింగ్ సేవలు చేరువలో లభించక రోగులు అనేక అవస్థలకు గురయ్యే పరిస్థితి నెలకొంటుంది. ఆర్థికంగా చితికిపోయే దుస్థితి ఎదురు కానుంది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి సామాజిక ఆరోగ్య కేంద్రాలలోని ఐసిటిసి కేంద్రాలను యథాతథ స్థితిని కొనసాగించాలని ఉద్యోగులు, రోగులు, ప్రజాసంఘాలు ప్రభుత్వానికి విన్నవించాయి. ఆ దిశగా ఆలోచించి చర్యలు చేపట్టడం మంచిది.

- రావుల రాజేశం, సెల్ :9848811424

కవిత్వం

చేయూత లేని చేనేత

చేతులాడటం లేదు
కాళ్ళు కదపటం లేదు
నూలిపోగు ఉరిపోగైనాక
ఊపిరి సలుపటంలేదు
బతుకుబండి చక్రాలు ఆగినాక
అతుకుల జీవనం సాగలేదు.
పాతాళంలో ధర
తిష్టవేసి కూర్చుండి పోయాక
గుక్కతిప్పడం చేతకాలేదు
అల్లికలన్నీ మెలికలు తిరిగి
ఎక్కడికక్కడ తెగిపోయాక
చేనేతకు చేయి తిరగలేదు.
నిలబడిపోయిన
పట్టు వస్త్రాల నడుమ
నలిగిపోయిన బతుకు లేవనేలేదు
నింగినంటిన
దారం పోగుల ధరల గుప్పిట్లో
ఇరుక్కుపోయి కూర్చున్నాక
మెతుకు ముట్టట్లేదు.
ఆగిన మగ్గాల గోతుల్లో
అరువు దెబ్బకు దాక్కున్నాక
ఒక్క పూట కూడా మింగుడు పడ్డేదు
చేనేతకు లేని చేయూతతో
అచేతనంగా మిగిలిపోయాక
పోగులతకడం లేదు.
గాలి వాటపు అమ్మకం పొదిలో
వ్యాపారం చిక్కుకున్నాక
దారపు ఉండ కరగనేలేదు
చేనేతకు చేయందించే కాలం
ఎప్పుడొస్తుందాని
కళ్ళల్లో దారం వత్తులు పోసేసి
ఎదురు చూస్తూ కూర్చున్నాం.

- నరెద్దుల రాజారెడ్డి,
సెల్: 9666016636

సమస్య

ఫీజుల నియంత్రణ ఏది!



మన రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో నర్సరీ నుంచి పదో తరగతి, ఇంటర్మీడియట్ వరకు వేలు, లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. పుస్తకాలు, యూనిఫామ్ పేరిట భారీగా దోపిడీ చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం 1994లో జీవో నెంబర్1 లో ఒకసారి, 2008లో జీవో నెం.90, 91, 92లో మరోసారి ప్రైవేటు విద్యాసంస్థలు పాటించాల్సిన నియమ నిబంధనలను పేర్కొన్నది. ఫీజుల నియంత్రణపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. 1994 జీవో నెంబర్1 ప్రకారం ఫీజులను నిర్ణయించడానికి పాఠశాల చైర్మన్, ప్రిన్సిపల్, విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఇద్దరు, విద్యార్థి సంఘాలతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలి. పాఠశాలల యాజమాన్యాలు వసూలు చేసిన ఫీజుల్లో 5 శాతానికి మించి తీసుకోవడానికి వీల్లేదు. వసూలు చేసిన ఫీజుల్లో 50 శాతం మొత్తాన్ని టీచర్లకు వేతనాలుగా ఇవ్వాలి. 15 శాతం వరకు పాఠశాల నిర్వహణ, విద్యుత్, అద్దె ఖర్చులు, 15 శాతం స్కూల్ అభివృద్ధికి ఉపయోగించాలి. 15 శాతం ఫీజును స్కూల్ సిబ్బందికి బీమా, భవిష్య నిధి కోసం కేటాయించాల్సి ఉంటుంది. 2008 జీవో నెం.90, 91, 92 ప్రకారం ఫీజు నిర్ణయించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి, ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, విద్యార్థి సంఘాలు, ప్రైవేటు విద్యాసంస్థల ప్రతినిధితో కమిటీని ఏర్పాటు చేయాలి. దీనికి కలెక్టర్ చైర్మన్‌గా ఉండాలి. ఈ కమిటీ పాఠశాలను పరిశీలించి మౌలిక సదుపాయాలు, పరిస్థితి చూసి ఎంత ఫీజులు వసూలు చేయాలనే విషయమై నివేదిక ఇస్తుంది. దీనిపై విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే ప్రభుత్వ పరంగా ఓ ప్రకటన విడుదల చేయాలి. జీవో నెంబర్ 42 ప్రకారం ఫీజులను పెంచాలంటే జిల్లా ఫీజ్ రెగ్యులేషన్ కమిటీ అనుమతి తీసుకోవాలి.

ఇష్టారాజ్యంగా ఫీజులు పెంపు...

ఎలాంటి అనుమతి లేకుండా ఏటా 20 నుంచి 30 శాతం ఫీజులను యాజమాన్యాలు యథేచ్ఛగా పెంచుతూ వెళ్తున్నాయి. జీవో నెంబర్ 91 ప్రకారం దరఖాస్తు రుసుము రూ.100, అడ్మిషన్ ఫీజు రూ.500 మాత్రమే తీసుకోవాలి. పాఠశాలలో పుస్తకాలు, విద్యా సామగ్రిని కొనుగోలు చేయాలన్న నిబంధనలు పెట్టకూడదు. సెక్షన్ 8(1) ప్రకారం విద్యాసంస్థ పేర్లకు ఇంటర్నేషనల్, ఐ.ఐ.టి, ఒలంపియాడ్, కాన్సెప్ట్, ఈ టెక్నో వంటి పదాలను చేర్చకూడదు. జీవో 88 ప్రకారం 200 మంది విద్యార్థులు చదివే పాఠశాలలో 700 చదరపు మీటర్ల విస్తీర్ణంలో క్రీడా మైదానం ఉండాలి. అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. అగ్నిమాపక సామగ్రిని అందుబాటు లో ఉంచాలి. కానీ ఏ ఒక్క ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో అగ్నిమాపక సామగ్రిని పూర్తి స్థాయిలో పెట్టడం లేదు. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి పాఠశాల యాజమాన్యం ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులో పెట్టాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రతి కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేటాయించి ఉచిత విద్యను అందించాల్సి ఉంటుంది.

మా పాఠశాల.. మా ఇష్టం..?

'మా ఇష్టం' అన్నట్లు ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థలు వ్యవహరిస్తున్నాయి. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయాలంటే ఆ విద్యాసంస్థల్లో ఎన్నో సదుపాయాలు ఉండాలి. విద్యార్థులకు వసతులు కల్పించాలి. రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలో అగ్ని ప్రమాద నివారణ చర్యలు చేపట్టడం లేదు. ఫైర్ సేఫ్టీ లేదు. విద్యార్థులకు క్రీడలకు అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉండాలి. విశాలమైన ఆటస్థలం ఉండాలి. కానీ రాష్ట్రంలో 80 శాతం పాఠశాలలకు ఈ సౌకర్యాలు లేవు. ఇరుకు గదులు, అపార్ట్‌మెంట్లలో పాఠశాలలు నడుస్తున్నాయి. ఇలా అనేక రకాలుగా దోపిడీ జరుగుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరించడం దారుణం. దీని వల్ల రాష్ట్రంలో విద్య వ్యాపార వస్తువుగా మారుతున్నది. విద్యాహక్కు చట్టం అమలు, దోపిడీని అరికట్టేందుకు ఫీజుల నియంత్రణ చట్టం కోసం విద్యావేత్తలు, మేధావులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు...అందరూ ఐక్యంగా ఉద్యమించాలి.

- ఎం.సోమేశ్వరరావు,
ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు,
సెల్:9010849524

పట్టిసీమపై దృష్టి సారించని సర్కార్

- కృష్ణా డెల్టాకు పెరుగుతున్న నీటి ఎద్దడి
- జలాశయాల్లో పడిపోతున్న నిల్వలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

కృష్ణా పరివాహక ప్రాంతంలో ఈ ఏడాది సాగు నీటి ఎద్దడి తీవ్రం కానుంది. ప్రధానంగా 13.65 లక్షల ఎకరాలు సాగయ్యే కృష్ణా డెల్టాలో ఈ ఏడాది సేద్యం ఇబ్బందికరంగా మారింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఏడాది జులై 19వ తేదీ వరకు ఆల్మట్టి జలాశయానికి నీరు రాకపోవడంతో ఈ ఏడాది సాగు పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. కృష్ణా డెల్టాకు ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు వినియోగించేందుకు పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించింది. 2016 నుంచి మూడేళ్లపాటు ఏటా 80 టిఎంసిల వరకు గత టిడిపి ప్రభుత్వం కృష్ణా డెల్టాకు అందించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం గత నాలుగేళ్లుగా పట్టిసీమ నీటిని వినియోగించుకోలేదు. గత నాలుగేళ్లుగా కృష్ణా ఎగువ ప్రాంతం నుంచి సకాలంలో నీరు రావడం, ఏటా వరదలు కూడా సంభవించడం వల్ల ఈ కాలంలో నీటి సమస్య అంతగా రాలేదు. ఈ ఏడాది కృష్ణా ఎగువ



పట్టిసీమ లిఫ్ట్ ఇరిగేషన్ (ఫైల్ ఫొటో)

ప్రాంతంలో ప్రధానంగా కర్ణాటకలో వర్షాలు లేకపోవడం, ఆల్మట్టి జలాశయానికి నీరు రాకపోవడం వల్ల రైతులకు ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడింది. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల నీటిమట్టం గణనీయంగా తగ్గిపోతోంది. కృష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకరణ కోసం నిర్మించిన పులిచింతల జలాశయంలో గరిష్ట నిల్వ 45.77 టిఎంసిలు. బుధవారం 17.95 టిఎంసిల నీరు మాత్రమే నిల్వ ఉంది. గతేడాది జులై 19న 37.27 టిఎంసిల నీరు ఉండేది. నాగార్జునసాగర్‌లో గరిష్ట నీటి నిల్వ 312 టిఎంసిలు. ప్రస్తుతం 144.94 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. గతేడాది ఇదే రోజుకు 171.48 టిఎంసిల నీరు నిల్వ ఉంది. శ్రీశైలంలో గరిష్ట నీటి నిల్వ 215.80 టిఎంసిలు. ప్రస్తుతం 33.62 టిఎంసిల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే రోజుకు 147.99 టిఎంసిల నీరు నిల్వ ఉండేది. ఈ ఏడాది శ్రీశైలంలో నీటిమట్టం గణనీయంగా తగ్గిపోయింది. కృష్ణా తూర్పు డెల్టాలో వరి సాగు కోసం గత కొన్ని రోజులుగా రోజూ ఆరు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కృష్ణా జిల్లాలో 4.22 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని అంచనా వేశారు. ప్రస్తుతం లక్ష ఎకరాల్లో వరి సాగవుతోంది. కృష్ణా పశ్చిమ డెల్టాకు వెయ్యి క్యూసెక్కుల నీరు ఇస్తున్నారు. ఈ డెల్టాలో 4.36 లక్షల ఎకరాల్లో వరి సాగు జరగాల్సి ఉన్నా ఇంకా వరి నాట్లు ప్రారంభం కాలేదు. వెద పద్ధతిలో 20 వేల ఎకరాల్లోనే సాగు ప్రారంభించారు. గతేడాది జులై రెండో వారం నాటికి ఆల్మట్టి, నారాయణ్‌పూర్, జూరాల జలాశయాలకు వరద ప్రారంభమైందని, ఈ ఏడాది ప్రస్తుతం కర్ణాటకలో వర్షాలు లేక ఎగువ నుంచి జలాశయాలకు నీరు రావడంలేదని అధికారులు తెలిపారు.

నివేదిక వస్తే నిర్ణయం

కృష్ణా డెల్టాలో నీటి ఎద్దడిపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి అధికారులు నివేదిక పంపితే ప్రత్యామ్నాయంపై దృష్టి సారిస్తాం. పట్టిసీమ నుంచి గోదావరి జలాలు వినియోగించాలని నీటిపారుదల శాఖాధికారుల ప్రతిపాదిస్తే ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుంది. కృష్ణా డెల్టాకు తక్షణం నీరు అవసరమైతే వెంటనే పట్టిసీమ నుంచి విడుదలకు నిర్ణయం తీసుకుంటాం.

-అంబటి రాంబాబు, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి

ఖాళీలు భర్తీ చేయండి

- పశుసంవర్ధకశాఖ డైరెక్టరుకు డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పశుసంవర్ధకశాఖలో ఖాళీగా ఉన్న 4,765 అసిస్టెంట్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ఆ సంఘం కార్యదర్శి జి రామన్న పశు సంవర్ధకశాఖ డైరెక్టరు అమరేంద్రకుమార్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో 50 వేలమందికి పైగా నిరుద్యోగులు డెయిరీ డిప్లమో, ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసి ఎహెచ్ఎ పోస్టుల కోసం శిక్షణ కేంద్రాల్లో వేలకు వేలు వెచ్చించి మూడేళ్ల నుంచి ఎదురుచూస్తున్నారని తెలిపారు. పశుసంవర్ధక అధికారులు అనాలోచితంగా క్లస్టర్ విధానాన్ని తీసుకొచ్చారని అన్నారు. ఈ విధానం వల్ల ఉన్న ఉద్యోగాలు మిగులుతాయని, శాశ్వతంగా పోస్టులు భర్తీ కావని ఆవేదన వ్యక్తం చేశారు. పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చామని, ఎలాంటి ఫలితం లేదని అన్నారు. ఈ క్లస్టర్ విధానాన్ని రద్దు చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పి కృష్ణ, అభ్యర్థులు శ్రీను, అనిల్, నరసింహ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌సిలో స్టాఫ్ భర్తీ చర్యలు చెప్పండి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సి)లో సిబ్బంది భర్తీకి తీసుకున్న చర్యలు తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. విచారణను 2 వారాలకు వాయిదా వేస్తూ తాత్కాలిక చీఫ్ జస్టిస్ ఎవి శేషసాయి, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారణ జరిపింది. హెచ్‌ఆర్‌సిలో అవసరమైన సిబ్బందిని నియమించేలా ఉత్తర్వులు ఇవ్వాలని, అక్కడ ప్రజల ఫిర్యాదులను స్వీకరించే యంత్రాంగం ఏర్పాటుకు కూడా ఉత్తర్వులు ఇవ్వాలంటూ ఎపి సివిల్ లిబర్టీస్ అసోసియేషన్ ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. సిబ్బంది లేకపోవడంతో హెచ్‌ఆర్‌సి ఛైర్మన్ ఇచ్చే తీర్పులను ఆయనే టైప్ చేసుకోవాల్సిన పరిస్థితి ఉందని పిటిషనరు తరఫున న్యాయవాది బి శ్రీనివాసరావు వాదించారు. సిబ్బంది కొరత వల్ల జాప్యం అవుతోందని ఛైర్మన్ ఒక తీర్పులో పేర్కొన్నారని తెలిపారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఎస్ శ్రీరామ్ ప్రతివాదన చేస్తూ, కాంట్రాక్టు పద్ధతిలో సిబ్బంది నియామక చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఈ మేరకు మంత్రివర్గం కూడా నిర్ణయం తీసుకుందన్నారు. విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.

'చందమామ' ప్రభాకర్‌కు కన్నీటి వీడ్కోలు



ప్రజాశక్తి - విజయవాడ

ప్రముఖ కళాకారుడు, చిత్రకారుడు ప్రభాకర్ (75) అంత్యక్రియలు బుధవారం విజయవాడలో జరిగాయి. గాంధీనగర్‌లోని తన స్వగృహంలో ప్రమాదవశాత్తూ బాత్‌రూమ్‌లో జారిపడి తుదిశ్వాస విడిచారు. 'చందమామ' ప్రభాకర్‌గా ఆత్మీయంగా పిలుచుకునే ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రభాకర్ చందమామ పత్రికతోపాటు అనేక పత్రికల్లో చిత్రకారుడిగా, డిజిటల్ ఆర్టిస్ట్‌గా పని చేశారు. ఆయనకు సంగీతం పట్ల కూడా అభిరుచి ఉంది. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

డిప్రెషన్‌కు గురయ్యా

- ఆత్మహత్య ఆలోచనలు వచ్చాయి
- బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులే కారణం
- మహిళా రెజ్లర్ ఆరోపణలు

న్యూఢిల్లీ : రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళల్లో ఒకరు తనకు ఎదురైన మానసిక వేదనను వెలిబుచ్చారు. తాను డిప్రెషన్‌తో బాధపడుతున్నాననీ, లైంగిక వేధింపుల కారణంగా ఆత్మహత్య ఆలోచనలు వచ్చాయని వివరించారు. బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై గత నెలలో దాఖలు చేసిన చార్జిషీట్‌లో మహిళ ఆరోపణలను పోలీసులు పేర్కొన్నారు. డబ్ల్యుఎఫ్ఐ చీఫ్ ఐపీసీలోని సెక్షన్ 354, 354ఎ, 354డీ కింద శిక్షార్హుడని పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. 1599 పేజీల చార్జిషీట్‌లో ఆరుగురు రెజ్లర్ ఫిర్యాదుదారుల వాంగ్మూలాలు ఉన్నాయి. బ్రిజ్‌భూషణ్ సింగ్ చర్యల కారణంగా తాను డిప్రెషన్‌లోకి వెళ్లి ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలో పడ్డానని వారిలో ఒక మహిళ చార్జిషీట్‌లో పేర్కొన్నది. బ్రిజ్‌భూషణ్ ను కలిసేందుకు నిరాకరించడంతో ప్రధాని మోడీని కలిసేందుకు వెళ్లిన అథ్లెట్ల జాబితా నుంచి తన పేరు తొలగించారని ఆ మహిళ ఆరోపించింది. మరో ఫిర్యాదుదారు 2009లో సింగ్‌తో "రాజీ" చేసుకోవడానికి నిరాకరించినందున రెజ్లింగ్ రంగానికి తిరిగి రాలేకపోయానని వివరించింది. 2021లో తన అడ్వాన్సులను తిరస్కరించిన తర్వాత బ్రిజ్‌భూషణ్ సింగ్ తన కెరీర్‌ను ముగించేస్తానని బెదిరించాడని మరో రెజ్లర్ ఆరోపించారు.

యుపిలో దారుణం

- దళిత బాలుడిపై అమానవీయ చర్య
- తీవ్రంగా కొట్టి.. మలాన్ని చేతితో తొలగించాలంటూ బలవంతం
- కేసు నమోదు చేసిన పోలీసులు

లక్నో : బిజెపి పాలిత యూపిలో దళితులపై పెత్తందార్ల ఆగడాలు పెరిగిపోతున్నాయి. యోగి పాలనలో మహిళలతో పాటు దళితులకు రక్షణ ఉండటం లేదు. ఏదో ఒక విధంగా వారిపై దాడులు నిత్యకృత్యమవుతున్నాయి. తాజాగా ఒక దళిత బాలుడిపై దాడి జరిగింది. అంతే కాకుండా మలాన్ని చేతితో తీయాలంటూ ఆ బాలుడిని నిందితుడు బలవంతం చేయటం గమనార్హం. ఎటవా జిల్లా సైఫైలో ఈ ఘటన చోటు చేసుకున్నది. ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై దళిత సంఘాల నాయకులు, సామాజిక, ప్రజా సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలకు వారు డిమాండ్ చేశారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు (15) 11వ తరగతి చదువుతున్నాడు. అయితే, ఉదయం జగ్రామ్ యాదవ్ వ్యవసాయ భూమిలో బహిర్భూమికి వెళ్లాడు. అయితే, ఇది గమనించిన జగ్రామ్ యాదవ్.. బాలుడిపై ఆగ్రహంతో ఊగిపోయాడు. బాలుడిని తీవ్రంగా కొట్టాడు. బాలుడి చేతితోనే అతని(బాలుడి) మలాన్ని తీసివేయించాడు. జిల్లాలోని ప్రసన్న పంచాయతీలో ఈనెల 13న ఈ ఘటన చోటు చేసుకున్నది. ఈ ఘటనపై బాధితుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జగ్రామ్ యాదవ్.. ఘటనకు దగ్గర పొలాల్లో పని చేస్తున్న తమ బంధువు ఈ దాడిని ఆపేందుకు యత్నించినందుకు ఆమెపై కూడా దాడికి పాల్పడ్డాడని బాలుడి తండ్రి తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు జిల్లా పోలీసు అధికారి తెలిపారు. జగ్రామ్ యాదవ్ పరారీలో ఉన్నాడనీ, అతనిని అరెస్టు చేయడానికి పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారని చెప్పారు. అయితే, జగ్రామ్ యాదవ్.. కోర్టులో సరెండర్ అప్లికేషన్‌ను దాఖలు చేయటం గమనార్హం.

సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టరు ప్రసాద్ ఇళ్లపై ఎసిబి దాడులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అక్రమాస్తులు కూడబెట్టారని ఆరోపిస్తూ.. ఎపి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ జాయింట్ డైరెక్టరు కెడివిఎమ్ ప్రసాద్ ఇళ్లపై ఎసిబి ఆకస్మిక దాడులు నిర్వహించింది. బుధవారం విజయవాడలోని బృందావన కాలనీలోని ఆయన ఇంటితోపాటు, బంధువుల ఇళ్లలో ఏకకాలంలో ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు అందిన సమాచారం మేరకు ఎసిబి అధికారులు సోదాలు చేపట్టారు. ప్రసాద్ 1991లో హైదరాబాద్‌లో ఐటిబిపి కానిస్టేబుల్‌గా, ఎస్‌పిఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా ఎస్ఐ, సిఐగా పనిచేశారు. 2007లో ఎపిపిఎస్‌సి ద్వారా గ్రూప్-1లో ట్రెజరిశాఖలో ఎటిఓగా చేరారు. తెలంగాణలోని భువనగిరి, కృష్ణా జిల్లా డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టరుగా పనిచేశారు. డిప్యూటేషన్‌పై కృష్ణా జిల్లా ఎస్ఎస్ఎ ప్రాజెక్టు డైరెక్టరుగా పనిచేసిన ప్రసాద్ ప్రస్తుతం ఎపి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ జాయింట్ డైరెక్టరుగా పనిచేస్తున్నారు. తన సర్వీసులో నిబంధనలకు విరుద్ధంగా ఏలూరులో రెండు ప్లాట్లు, విజయవాడలోని పోరంకిలో రెండు ప్లాట్లు, ఏలూరులోని మాదేపల్లిలో ఆర్‌సిసి ఇళ్లు, మాదేపల్లిలో మరో భవనం, హైదరాబాద్‌లో జిప్లస్-2 భవనం, పామర్రులో ప్లాట్, దెందులూరు మండలంలో 90 సెంట్ల వ్యవసాయ భూమిని గుర్తించారు. అలాగే మూడు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు, 500 గ్రాముల బంగారం, రూ.30 వేలు నగదు, రూ.15 లక్షలు విలువ చేసే ఎల్‌ఐసి పాలసీలు, మౌనిక ఆక్వా ఫామ్‌లో పెట్టుబడులు, ఇతరులకు వడ్డీలకు ఇచ్చిన రూ.26 లక్షలు విలువ చేసే ప్రామిసనరీ నోట్లను ఎసిబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ప్రకాశం జిల్లా కొనకమిట్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె దీపిక, కానిస్టేబుల్ పి నరసింహారావును లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. హెచ్‌ఎం పాడు మండలం, రాజగారి పల్లె గ్రామానికి చెందిన జి నరసింహా అతని కుటుంబ సభ్యుల నుండి 498 కేసు నుండి తొలగించేందుకు రూ.60 వేలను డిమాండ్ చేశారు. జి నరసింహా బుధవారం రూ.45 వేలను ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేశారు.

రుషికొండపై నిర్మాణాల నివేదికను ఎంఒఇఎఫ్‌కు ఇస్తే అభ్యంతరం ఎందుకు?

- రాష్ట్ర ప్రభుత్వ వైఖరి చెప్పాలి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

విశాఖలోని రుషికొండపై అనుమతులకు మించి జరిపిన తవ్వకాలు, నిర్మాణాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అంశాన్ని కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖకు నివేదించే ఆలోచనలో ఉన్నామని హైకోర్టు స్పష్టం చేసింది. ఉల్లంఘనలు తీవ్రంగా ఉన్నాయో లేదో కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ (ఎంఒఇఎఫ్)ను కోరనున్నామని తెలిపింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి అభ్యంతరం ఎందుకని ప్రశ్నించింది. ఎంఒఇఎఫ్ చేసిన అనుమతులకు లోబడి నిర్మాణాలు ఉండాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపింది. ఎంఒఇఎఫ్‌కు నివేదిక ఇచ్చే విషయంలో ప్రభుత్వ అభిప్రాయం చెప్పాలని కోరింది. అనుమతి నిబంధనలను ఉల్లంఘించి చేసిన నిర్మాణాలను కొనసాగించకుండా ఉత్తర్వులు ఇవ్వాలంటూ దాఖలైన అనుబంధ పిటిషన్‌ను తాత్కాలిక చీఫ్ జస్టిస్ ఎవి శేషసాయి, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జనసేన నేత పివిఎస్ఎన్ మూర్తి యాదవ్ వేసిన పిల్స్‌లో తనను ప్రతివాదిగా చేర్చాలంటూ నర్సాపురం ఎంపి కనుమూరి రఘురామ కృష్ణరాజు వ్యాజ్యాలను బుధవారం హైకోర్టు విచారించింది.

రుషికొండపై నిర్మాణాలను సర్వే చేసి రిపోర్టు ఇవ్వాలని కేంద్ర పర్యావరణ, అటవీశాఖను గతంలో హైకోర్టు ఆదేశించింది. ఆ ప్రాంతాన్ని పరిశీలన చేసి నివేదిక ఇవ్వడం కోసం కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ పర్యటించాక ఎంఒఇఎఫ్ ఇచ్చిన నివేదికలో అనుమతులకు మించి నిర్మాణాలు జరిగాయని పేర్కొంది. యాదవ్ తరఫున సీనియర్ న్యాయవాది కెఎస్ మూర్తి వాదిస్తూ.. నివేదిక నేపథ్యంలో నిర్మాణాలు నిలిపేయాలని కోరారు. ఈ వ్యవహారాన్ని ఎంఒఇఎఫ్‌కు నివేదించాలన్న హైకోర్టు ప్రతిపాదనను ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సుమన్ వ్యతిరేకించారు. హైకోర్టు తుది ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ అభిప్రాయాన్ని తెలియజేయాలని ఆదేశించిన హైకోర్టు విచారణను 2 వారాలకు వాయిదా వేసింది.

అథమ స్థాయిలో విద్యా వ్యవస్థ

- టిడిపి ఎమ్మెల్సీ రామ్‌గోపాల్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అథమస్థాయికి చేర్చారని టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి విమర్శించారు. నాడు-నేడు, అమ్మఒడితో విద్యా వ్యవస్థలో గొప్ప సంస్కరణలు తీసుకొచ్చామని చెప్పుకుంటున్న సిఎం ప్రభుత్వ పాఠశాలల్లో 7.5 లక్షల మంది విద్యార్థులు ఎందుకు తగ్గారని ప్రశ్నించారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు కల్పించకపోవడం, విద్యాప్రమాణాలు పెంచే దిశగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో జగన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఏకోపాధ్యాయ పాఠశాలలు లేకుండా చేస్తానన్న జగన్ నేటికీ 9,600పైగా పాఠశాలలు ఉండటంపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. జాతీయ విద్యావిధానం పేరుతో 117 జిఓ ద్వారా ప్రాథమిక విద్యను సర్వనాశనం చేశారని విమర్శించారు. మెగా డిఎస్‌సి నిర్వహిస్తానని చెప్పి నాలుగున్నరేళ్లలో ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదన్నారు.

175 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా

- పిల్‌లో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

పల్నాడు జిల్లా వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి గ్రామ పరిధిలోని వివిధ సర్వే నంబర్లలోని 175 ఎకరాల ప్రభుత్వ, ఎసైన్డ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయనే పిల్‌లో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మాల్పూరి ఆగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీవత్స ఫుడ్‌పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రభుత్వ భూముల్ని ఆక్రమించుకున్నాయని, వాటిని రక్షించాలంటూ వినుకొండకు చెందిన కీర్తిపాటి వెంకటేశ్వర్లు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని బుధవారం హైకోర్టు విచారించింది. ప్రతివాదులైన మాల్పూరి ఆగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఎమ్‌డి, వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, శ్రీవత్స ఫుడ్‌పార్క్ ఎమ్‌డి లక్ష్మణస్వామి, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి, పల్నాడు జిల్లా కలెక్టరు, సబ్ కలెక్టర్, ఆర్‌డిఒ, వినుకొండ తహశీల్దారు తదితరులకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని తాత్కాలిక చీఫ్ జస్టిస్ ఎవి శేషసాయి, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. ఆ 175 ఎకరాలను బ్యాంక్‌లో తనఖా పెట్టి రూ.50 కోట్లను రుణంగా తీసుకుని మరో నేరానికి పాల్పడ్డారని పిటిషనర్ తరఫున న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ చెప్పారు. భూమిని స్వాధీనం చేసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. విచారణ 4 వారాలకు వాయిదా పడింది.

టిఎఆర్‌ఎల్ టెస్టు ఫలితాలు ఎందుకు వెల్లడించలేదు?

- రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

టెన్త్ విద్యార్థి 5వ తరగతి పుస్తకాలను, 5వ తరగతి విద్యార్థి రెండో తరగతి పుస్తకాలను చదవలేని దుస్థితిలో ఉండటంపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితి ఉన్నందున అందరూ సిగ్గుపడాలని వ్యాఖ్యానించింది. భావితరాలు పరిస్థితి తలుచుకుంటే బాధేస్తోందని చెప్పింది. మాతృభాష రాకపోతే అవమానంగా భావించేవారని, ఇప్పుడు తెలుగు రాకపోవడం ఉన్నత విషయంగా భావించడం సిగ్గుచేటని వ్యాఖ్యానించింది. ఇలాంటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకునే చర్యలు వివరించాలని కోరింది. బేస్ లైన్, టిఎఆర్‌ఎల్ టెస్టు ఫలితాలను ఎందుకు ప్రచురించలేదో చెప్పాలంది. ఈ నెల 22న జరిగే విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని తాత్కాలిక చీఫ్ జస్టిస్ ఎవి శేషసాయి, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది.

విద్యాహక్కు చట్టం, ఎన్‌సిఇఆర్‌టి (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్, ట్రైనింగ్) ప్రకారం బేస్ లైన్, టిఎఆర్‌ఎల్ (టీచింగ్ ఎట్ రైట్ లెవల్ టెస్ట్) టెస్టుల ఫలితాల్ని ప్రభుత్వం ప్రకటించకపోవడాన్ని తప్పు పడుతూ డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ దాఖలు చేసిన పిల్‌ను బుధవారం హైకోర్టు విచారించింది. న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్‌బాబు వాదిస్తూ.. ఆ ఫలితాల్ని వెబ్‌సైట్‌లో పెట్టి తీసేశారన్నారు. 2వ తరగతి పుస్తకాన్ని 5వ తరగతి వాళ్లు, 5వ తరగతి పుస్తకాన్ని పదో తరగతి విద్యార్థులు చదవలేకపోతున్నారని చెప్పారు.

మహిళా కార్యదర్శుల్ని కానిస్టేబుళ్లుగా చేయొద్దు

- హైకోర్టులో వాదనలు

ప్రజాశక్తి-అమరావతి

గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శులను దొడ్డిదారిలో మహిళా కానిస్టేబుళ్లుగా చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని హైకోర్టులో వాదనలు జరిగాయి. చట్ట వ్యతిరేక ప్రభుత్వ చర్యను అడ్డుకోవాలని పిటిషనరు తరఫున న్యాయవాది వడేరా బాలాజీ వాదించారు. మహిళా సంరక్షణ కార్యదర్శులకు, మహిళా కానిస్టేబుళ్లకు నియామకాల విద్యార్హతలు వేర్వేరని చెప్పారు. మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా కానిస్టేబుళ్లుగా పేర్కొంటూ వెలువడిన జిఓలను విశాఖకు చెందిన ఆరేటి ఉమామహేశ్వరావు ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఇదే తరహాలో పలువురు మహిళా సంరక్షణ కార్యదర్శులు కూడా రిట్లు దాఖలు చేశారు. వీటిని న్యాయమూర్తులు జస్టిస్ యు దుర్గాప్రసాదరావు, జస్టిస్ వెంకట జ్యోతిర్మయితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారించింది. పిటిషనర్ల వాదనలు పూర్తికావడంతో ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఎస్ శ్రీరామ్ వాదనల నిమిత్తం విచారణ గురువారానికి వాయిదా పడింది.

ఏం తినే(కొనే)టట్టు లేదు..

- టమోట కేజీ రూ.150 • అల్లం కేజీ రూ.400



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఏం తినేటట్టు లేదు.. ఏం కొనేటట్టు లేదు.. ధరలిట్టా పెరగబట్టే... అన్నట్లుగా ఉంది ప్రజల పరిస్థితి. నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో నిత్యావసర ధరలు పగలే చుక్కలు చూపుతున్నాయి. రూ.500లు తీసుకొని కూరగాయల మార్కెట్‌కి వెళ్లితే సంచి నిండా కూరగాయలు వచ్చే పరిస్థితి లేదు. ధరలు అదుపు చేస్తామంటూ ప్రభుత్వ అధికారులు నానా యాగీ చేస్తున్నా క్షేత్రస్థాయిలో ఫలితం కనిపించడం లేదు. సన్న బియ్యం రేట్లు తగ్గిస్తామంటూ కేజీ సన్నబియ్యం రూ.44.50లకు విక్రయించేలా ట్రేడర్స్ ద్వారా కౌంటర్లు ప్రారంభించారు. ఈ కౌంటర్లకు స్పందన లేదు. టమోటా కేజీ వందకు చేరిన టమోట ధరను అదుపు చేసేలా రైతు బజార్లలో కేజీ టమోట రూ.50లకు విక్రయించేలా కౌంటర్లు ఏర్పాటు చేసినా స్టాక్ వచ్చిన గంటలోపే ఖాళీ అవుతోంది. ఉదయం 6 గంటల నుండి కౌంటర్ల వద్ద క్యూవ్ కడుతున్నారు.

పెరిగిన నిత్యావసరాల ధరలు...

బియ్యం, పప్పు, వంట నూనెలు, కూరగాయలు ఇలా ఒక్కటేమిటి అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య, మధ్యతరగతికి పగలే చుక్కలు చూపుతున్నాయి. సన్నబియ్యం సాధారణ రకం 25 కేజీలు రూ.1,400 నుండీ 1,500 అమ్ముడుపోతోంది. కందిపప్పు కేజి రూ.150 , చక్కెర కేజి రూ.40, మినపప్పు కేజి రూ.120 బహిరంగ మార్కెట్‌లో అమ్ముడుపోతోంది. వీటి తోడు వంటగ్యాస్ ధర రూ.1000 ఇక కూరగాయల విషయానికొస్తే టమోట ఏకంగా కిలో రూ.150, అల్లం రూ.400, పచ్చిమిర్చి రూ.120, వంకాయ రూ.40, బెండ రూ.45, కాకర రూ.60, బీన్స్ రూ.60, బీర రూ. 40, క్యారెట్ రూ.60, క్యాబేజి రూ.40 ఇలా అన్ని రకాల కూరగాయల ధరాలు గత నెలతో పొచ్చితే రెండు రెట్లు పెరిగాయి. గత నెల టమోట కిలో రూ.30 నుంచి 40 ఉంటే గత వారం రోజులుగా కిలో టమోట రూ.150 తగ్గడం లేదు. నిత్యావసర సరుకుల పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతి, హోటల్ నిర్వాహకులు బెంబెలెత్తిపోతున్నారు. దినసరి కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో కార్మికుల పరిస్థితి ఇంకా దారుణం. నిత్యావసర వస్తువుల ధరలు అమాతంగా పెరగడంతో దిక్కుతోచని స్థితి ఏర్పడింది. పౌరసరఫరాశాల, జిల్లా అధికారులు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సమాన్య, మధ్యతరగతి కోరుతున్నారు.

ధరలను అదుపు చేసేందుకు చర్యలు - శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్

ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. లైసెన్స్ దార్లు, ట్రేడర్స్‌తో చర్చించి జిల్లా వ్యాప్తంగా నిత్యవసర వస్తువులను సరసమైన ధరలకు పంపిణీ చేసేలా కౌంటర్లు ఏర్పాటు చేయడం జరుగుతోంది. ఈమేరకు చిత్తూరు, పలమనేరు, నగరి ఇతర ప్రాంతాల్లో కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. నాణ్యమైన సన్న బియ్యం కిలో రూ.44.50పైసలు, కందిపప్పు కేజీ రూ.140 ఇతర నిత్యావసరాలు కూడా సరసమైన ధరలకు ఈ కౌంటర్ల ద్వారా విక్రయిస్తున్నాం. అలాగే టమోట కిలో రూ.50లకు రైతులు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నాం. మరో వైపు కృతిమ కొరత సృష్టించేలా స్టాక్‌ను దాచిన గోడౌన్‌లపై దాడులు చేయాలని పౌర సరఫరాశాఖకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది.

రేపు వెంకటగిరికి సిఎం రాక

- భద్రతా ఏర్పాట్లలో కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి -రేణిగుంట, వెంకటగిరి (తిరుపతి)

తిరుపతి జిల్లా వెంకటగిరికి ఈ నెల 21న శుక్రవారం సిఎం జగన్మోహన్‌రెడ్డి రానున్న నేపథ్యంలో డేగ కన్నులాంటి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎయిర్‌పోర్టులో సిఎం భద్రతపై ఉన్నతస్థాయి అధికారులతో కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్‌పి పరమేశ్వరరెడ్డిలు సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి తిరుగు ప్రయాణం అయ్యేవరకూ ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా గట్టి భద్రత కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. వైద్య శాఖ స్పెషలిస్ట్ డాక్టర్ల ఏర్పాటు, అంబులన్స్, సేఫ్ హౌస్, సేఫ్ హాస్పిటల్, ఫైర్ సేఫ్టీ చర్యలు, ఫుడ్ సేఫ్టీ తదితర శాఖలు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం వెంకటగిరి పట్టణంలో సిఎం పర్యటించే హెలిపాడ్, బహిరంగసభా వేదిక ప్రాంతాల వద్ద పర్యటించి జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించి భద్రతపరంగా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు వెంకటరావు, కులశేఖర్, విమలకుమారి, జేసీ డికె బాలాజీ, ఎస్‌బి డిఎస్‌పి గిరిధర, గూడూరు డిఎస్‌పి సూర్యనారాయణరెడ్డి, గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుండి ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్

ప్రజాశక్తి-నూజివీడు రూరల్ (ఏలూరు జిల్లా)

రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటిలకు సంబంధించి ప్రవేశాల కౌన్సెలింగ్ ఈనెల 20వ తేదీ నుండి నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య గోపాలరాజు బుధవారం తెలిపారు. ఈనెల 20, 21 తేదీల్లో నూజివీడు ట్రిబుల్ ఐటీలోను 21, 22 తేదీల్లో ఇడుపులపాయలోను, 24, 25 తేదీల్లో శ్రీకాకుళంలోనూ, ఒంగోలు ట్రిబుల్ ఐటీలో సీటు వచ్చిన అభ్యర్థులకు ఇడుపులపాయ ట్రిబుల్ ఐటీ క్యాంపస్‌లో 24, 25 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకోండి

- జెఎన్‌టియుఎ విసి రంగజనార్థన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

అధ్యాపకులు, విద్యార్థులు మారుతున్న సాంకేతికతను అనుసరిస్తూ వాటి మెలుకువలపై శిక్షణ పొందడం చాలా అవసరమని జెఎన్‌టియుఎ వైస్ చాన్సలర్ రంగజనార్ధన అన్నారు. బుధవారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో 'సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీలపై ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంను విసి రంగాజనార్ధన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ నేడు సాంకేతికత కొత్త మార్పులు తీసుకువస్తుందని దానికి అనుగుణంగా అధ్యాపకులతో పాటు విద్యార్థులకు మంచి ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. ఈ ప్రోగ్రాం కన్వీనర్లుగా డాక్టర్ ఆర్. స్వాతి, కో కన్వీనర్ గా డాక్టర్ ఎన్ మురళీకష్ణ వ్యూహరించారు.

మాస్టారు కుటుంబానికి ఎమ్మెల్యేల పరామర్శ

ప్రజాశక్తి- బాడంగి (విజయనగరం జిల్లా)

ఇటీవల హత్యకు గురైన ఏగిరెడ్డి కృష్ణ మాస్టారు కుటుంబాన్ని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చిన్న అప్పలనాయుడు, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన మృతికి తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. అనంతరం శంబంగి మాట్లాడుతూ కృష్ణ మాస్టారు చాలా ఏళ్లుగా తనతో ఎంతో సన్నిహితంగా ఉండేవారని, అలాంటి వ్యక్తి మరణ వార్త తన హృదయాన్ని కలచివేసిందని అన్నారు. కృష్ణ మాస్టార్‌ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించామన్నారు. ఆయన ప్రజల కోసం, గ్రామాభివృద్ధి కోసం తపన పడేవాడని గుర్తు చేశారు. ఆయన కుటుంబానికి, గ్రామానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ కృష్ణ మాస్టారుది ఉద్దవోలు గ్రామం అయినప్పటికీ రాజాంలో ఉంటూ తనకు కొన్నేళ్లుగా పరిచయమని అలాంటి మంచి వ్యక్తి మరణించడం చాలా బాధాకరమని తెలిపారు. అంత కిరాతకంగా హతమార్చిన నిందితులకు కఠినంగా శిక్ష పడేలా చూడాలని పోలీస్ శాఖ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, వైసిపి నాయకులు ఉన్నారు.

ఇల్లు ప్రారంభించకపోతే పట్టాలు రద్దు

ప్రజాశక్తి- బొబ్బిలి (విజయనగరం జిల్లా)

స్థానిక ఐటిఐ కాలనీలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులను నెలాఖరులోగా ప్రారంభించకపోతే పట్టాలు రద్దు చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం జగనన్న ఇళ్ల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోతే పట్టా స్వాధీనం బోర్డులు ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం జగనన్న ఇళ్లను మంజూరు చేసిందని, నిర్మాణ పనులు పూర్తి చేసుకుని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని కోరారు. ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఉద్యోగులను హెచ్చరించారు. లబ్దిదారులు వద్దకు వెళ్లి ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పంటల బీమాకు ఒకే ఒక్క గ్రామం

- ముంజేరు మినహా జిల్లా రైతులంతా సుభిక్షమేనట
- సర్కారు లెక్కలకు ఉలిక్కిపడుతున్న రైతాంగం

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

పంచపాండవులెంతమంది అంటే మంచం కోళ్లలా ముగ్గురున్నారంటూ రెండు చేతి వేళ్లు చూపించి ఒకటి మూసేశాడంట వెనుకటికి ఓ వ్యక్తి. 2022 ఖరీఫ్ పంటల బీమా ఎంపికలో సర్కారు లెక్క అచ్చం అలాగే ఉంది. గతేడాది జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల వర్షాభావం, అకాలవర్షాల వల్ల పంటనష్టం వాటిల్లింది. కానీ అధికారులు మాత్రం ఒక్క ముంజేరు గ్రామ రైతులనే పంటల బీమాకు ఎంపిక చేయడం గమనార్హం. దీంతో అధికారుల తీరుపై మిగతా రైతులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తున్న విషయం విధితమే. ఇటువంటి బీమా సదుపాయం కేవలం నాలుగు (వరి, మొక్కజొన్న, పత్తి, నువ్వులు) పంటలకు మాత్రమే ప్రభుత్వం కల్పించింది. జిల్లా వ్యాప్తంగా సుమారు అన్ని పంటలు కలుపుకుని దాదాపు 4.50 లక్షల ఎకరాలు సాగవుతున్నా, వరి, మొక్కజొన్న, పత్తి, నువ్వుల పంటలు సాగుచేసి రైతులు ఇ-క్రాప్ బుకింగ్ ప్రకారం 3.60 లక్షల మంది ఉంటారని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వీరిలో కేవలం భోగాపురం మండలం ముంజేరు గ్రామంలో పంటల దిగుబడి తక్కువగా వచ్చినందున 324 మందికి మాత్రమే బీమా సదుపాయం వర్తించినట్టు ప్రభుత్వం చెబుతోంది. గడిచిన ఐదేళ్ల సాధారణ దిగుబడి సరాసరి కన్నా తక్కువగా ఉత్పత్తి కాని, అతివృష్టి, లేదా అనావృష్టి వల్ల 30 శాతం కన్నా ఎక్కువ నష్టం జరిగినా బీమా వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన మన జిల్లా సరాసరి దిగుబడి ఎకరాకు 1432 కిలోలు రావాల్సి ఉంది. కానీ, ముంజేరులో సుమారు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో ఎకరాకు 921 కిలోలు మాత్రమే దిగుబడి రావడంతో బీమా సదుపాయం వర్తించినట్టు, మిగిలిన జిల్లా అంతటా 2077 కిలోల వరకు దిగుబడి వచ్చినట్టు అధికారులు లెక్కలు చెబుతున్నారు. ఈనేపథ్యంలో కేవలం ముంజేరులోని 324 మంది రైతులకు రూ.50,14,290 అందాయి. దీంతో మిగిలిన గ్రామాల రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి 2022లో వరి దిగుబడి కాస్త ఎక్కువ వచ్చినప్పటికీ అన్ని చోట్లా ఆ పరిస్థితి లేదు. చాలా చోట్ల వర్షాభావంతో చివరిదశలో వరి దెబ్బతింది. అకాల వర్షాలు కొంతమేర దెబ్బతీశాయి. అధిక వర్షాలకు పత్తిపంట వందలాది ఎకరాల్లో నీటమునిగిపోయింది. మొక్కజొన్న కూడా వర్షాలకు తడిచి నాశనమైంది. ఇవీవే అధికారులు పట్టించుకోకుండా అధికారులు సాగునీటి వసతులు ఉన్నచోట పరిశీలించి, సగటు లెక్కలు వేసి ఉంటారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

90 శాతం హామీలు నెరవేర్చాం : పెద్దిరెడ్డి

- అభివృద్ధి చేయకుంటే చొక్కా పట్టుకుని నిలదీయండి :ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- శాంతిపురం

మండలంలో బుధవారం పల్లెబాట కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. తన రెండు రోజుల పర్యటనలో భాగంగా మంత్రి పెద్దిరెడ్డి తొలిరోజు పల్లెబాట కార్యక్రమంలో మొదటి రోజు 11 పంచాయతీల్లో పర్యటించారు. ఈసందర్భంగా మంత్రి పెద్దిరెడ్డికి ప్రజలు, నేతలు నుంచి ఘనస్వాగతం లభించింది. మంత్రి పెద్దిరెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గత 35 సంవత్సరాలు శాసన సభ్యులుగా, 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉండి చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో రోడ్లు కూడా వేయలేదని దునుమాడారు. అలాంటి వ్యక్తిని మళ్ళీమళ్ళీ గెలిపిస్తే కుప్పం నియోజకవర్గంలో ఇంకా సమస్యలు ఎందుకున్నాయని ప్రశ్నించారు. ఎన్నికల ముందు సిఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీలు అన్ని 90శాతం దాదాపు గా నెరవేర్చారన్నారు. ప్రతి మండలంలో కోట్ల రూపాయల నిధులు వివిధ పథకాలు ద్వారా పేదలకు చేరుతోందని తెలిపారు. తన నియోజకవర్గం పుంగనూరులో మండలం మొత్తం తిరిగితే వచ్చేది 10 అర్జీలు మాత్రమే అందులో అధికంగా అర్హత లేనివే ఉంటాయి. కానీ కుప్పంలో ప్రతి పంచాయతీలో వందల కొద్ది అర్జీలు తమకు అందుతున్నాయి. తాను మంత్రి హోదాలో పర్యటన చేస్తుంటే ఇన్ని అర్జీలు వస్తుంటే మరి కుప్పంలో ఇన్ని సంవత్సరాలు చంద్రబాబు ఏమి చేసినట్టని ప్రశ్నించారు. ఇప్పుడు అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో హంద్రీనీవా నీరు అందిస్తానని చంద్రబాబు అంటున్నారు. సీఎంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 95 శాతం హంద్రీనీవా పనులు చేస్తే ముఖ్యమంత్రిగా ఉండి చంద్రబాబు మిగిలిన 5 శాతం పనులు పూర్తి చేయలేదని త్వరలో ఆ పనులు తామే పూర్తి చేసి సిఎం వైఎస్ జగన్‌తో ప్రారంభోత్సవం చేస్తామని హామీ ఇచ్చారు. కుప్పంలో చంద్రబాబు ఓడుతారా లేదా అని రాష్ట్రమంతా ఉత్కంఠగా ఎదురు చూస్తుందని, ఆయన ఓడితే రాష్ట్రానికి శని పోతుందన్నారు. అందుకే తాను ప్రతి గ్రామంలో తిరుగుతున్నానని ఇకపై ప్రజలను భయపెట్టి ఓట్లు వేయించుకునే టిడిపి ఆటలు సాగనివ్వబోమన్నారు. చంద్రబాబు ఓట్లు అడగకుండా, నామినేషన్ వేయడానికి కూడా రాలేని వారికి ఓటు వేయడం అవసరమా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో భరత్‌ను ఎమ్మెల్యేగా, రెడ్డప్పను ఎంపిగా గెలిపించాలని కోరారు. భరత్‌ను శాసనసభ్యుడిగా గెలిపిస్తే కుప్పం నియోజకవర్గాన్ని అభివద్ధి పథంలో తీసుకొని వెళ్తామని ప్రకటించారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సహాయ సహకారాలతో కుప్పం నియోజకవర్గ అభివద్ధికి తమ ప్రభుత్వం కంకణం కట్టుకుందని అన్నారు. ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నేను అభివద్ధి చేయనప్పుడు చొక్కా పట్టుకుని ప్రశ్నించే హక్కు మీకుందని అన్నారు. జడ్పీ చైర్మన్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తన మామకు వెన్నుపోటు పొడిచి అధికారాన్ని హస్తగతం చేసుకుని ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసం చేస్తూ పబ్బం గడుపుకునే ఏకైక వ్యక్తి చంద్రబాబుని విమర్శించారు. ఎంపీ ఎన్.రెడ్డప్ప మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీలో ఎంపీగా కొనసాగిన వ్యక్తి ప్రజలకు తెలుసా అని ప్రశ్నించారు. తాను ఎంపీగా ఎన్నికైనప్పటినుంచి వందలసార్లు కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతున్నానని మరోసారి తనకు ఎంపీగా అవకాశం కల్పించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, నరేష్ కుమార్‌రెడ్డి, టిటిడి పాలకమండలి సభ్యులు పోకల అశోక్ కుమార్, కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ డి.సుధీర్, మండల జడ్పీటిసి ఎస్ శ్రీనివాసులు, ఎంపీపీ కే.వసుంధర కోదండరెడ్డి, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, జె.చక్రపాణిరెడ్డి, నడింపల్లి శ్యామరాజు, టీవీ పట్టాభి, సరస్వతి రమేష్, సెందిల్ కుమార్, ఏఎస్ విద్యాసాగర్, వనిత శ్రీనివాస్, వి.పెద్దన్న, నాగభూషణమ్మ సుబ్బరాజు, జెఎం కష్ణమూర్తి, విశాలాక్షి సుకుమార్, వీరభద్రప్ప, సర్పంచులు అధికారులు పాల్గొన్నారు.

జగన్ హయాంలో రాష్ట్రం నాశనం

- టిడిపి బస్సు యాత్రలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం (పశ్చిమగోదావరి జిల్లా)

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని నాశనం చేశాడని టిడిజి మాజీ మంత్రులు అయ్యన్న పాత్రుడు, ప్రత్తిపాటు పుల్లారావు, ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు విమర్శించారు. టిడిపి భవిష్యత్ గ్యారెంటీ చైతన్య బస్సు యాత్ర, బహిరంగ సభ బుధవారం పశ్చిమగోదావరి జిల్లా పెద తాడేపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెన్షన్లను దఫాదఫాలుగా పెంచుతూ ప్రజల నుంచి ఒక్కొక్కరికీ రూ.26 వేల నష్టం చేకూర్చారన్నారు. రాష్ట్రంలో 42 వేల ఎకరాల దేవాలయ భూములు కనపడడం లేదని, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ అంటున్నారని, ఆ భూములు ఏమయ్యాయని వారు ప్రశ్నించారు. వైసిపి మంత్రులకు కేసులు పెట్టడం తప్ప పాలన సాధ్యం కాదన్నారు. లక్షల కుటుంబాలకు చంద్రన్న బీమా ద్వారా భద్రత కల్పించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. 15 రూపాయలకే మూడుపూటలా అన్నా క్యాంటీన్ ద్వారా అన్నం పెడితే జగన్ ఆ పథకాన్ని రద్దు చేసి పేదల కడుపు కొట్టారన్నారు. అసమర్థులు మంత్రులైతే రాష్ట్రం ఎలా బాగుపడుతుందని విమర్శించారు. టిడిపితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని దీమా వ్యక్తం చేశారు.

జమ్ముకాశ్మీర్‌లో భారీ వర్షాలు

- ఎనిమిది మంది మృతి

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో కొన్ని రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా గత 24 గంటల వ్యవధిలో ఎనిమిది మంది మరణించారు. కథువా జిల్లాలో భారీ వర్షాల కారణంగా ఇల్లు కూలి ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మరణించారు. ఇదే జిల్లాలో మరో చోట కొండ చరియలు విరిగిపడటంతో ముగ్గురు మరణించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్ ఖయ్యూం, ముస్తాక్ అహ్మద్‌లు బాని ప్రాంతంలో నివసిస్తున్నారు. వీరు కుటుంబ సభ్యులతో కలిసి రెండు వేర్వేరు ఇళ్లలో ఉండగా భారీ వర్షాలకు అవి ఒక్కసారిగా కూలిపోయాయి. ఈ ఘటనలో అబ్దుల్ ఖయ్యూం కుటుంబానికి చెందిన ఐదుగురు చనిపోయారు. వారి మృతదేహాలు శిథిలాల కింద చిక్కుకుపోయాయి.

ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఘటనా స్థలంలో సహాయక చర్యలు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి దాకా మూడు మృతదేహాలను వెలికిశారు. మరో ఇద్దరి మృతదేహాలను బయటకు తీసేందుకు కృషి చేస్తున్నారు. మరో చోట కొండ చరియలు విరిగి పడటంతో ముగ్గురు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఒక బాలుడు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

రఫేల్‌పై కొనసాగుతున్న సంప్రదింపులు

- ఇంకా ఖరారు కాని ఒప్పందం

న్యూఢిల్లీ : ఫ్రాన్స్ నుండి 26 రఫేల్-ఎం యుద్ధ విమానాలు, మూడు స్కార్పేన్ జలాంతర్గాముల కొనుగోలుకు సంబంధించి సంప్రదింపులు కొనసాగుతున్నాయి. ధరను, సాంకేతిక-వాణిజ్య వివరాలను ఖరారు చేసే ప్రక్రియ ఇంకా ఓ కొలిక్కి రాలేదు. జలాంతర్గాముల ప్రాజెక్టుకు సంబంధించి మన దేశానికి చెందిన ప్రభుత్వ రంగ నౌకా నిర్మాణ సంస్థ మజగాన్ డాక్ లిమిటెడ్, ఫ్రాన్స్‌కు చెందిన నౌకాదళ గ్రూపు ఈ నెల 6న ఒక ఒప్పందాన్ని ఖరారు చేశాయి. అయితే ధర, సాంకేతిక వివరాలపై జరుగుతున్న చర్చలు ఇంకా పూర్తి కాలేదు. రఫేల్ విమానాల సేకరణకు సంబంధించి సైతం సాంకేతిక, వాణిజ్య వివరాలను ఖరారు చేయాల్సి ఉంది. రఫేల్ విమానాలు, జలాంతర్గాముల కొనుగోలుకు సంబంధించి భారత నౌకాదళం చేసిన ప్రతిపాదనకు ఈ నెల 13న ఫ్రాన్స్ రక్షణ సేకరణ మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. అదే రోజు ప్రధాని నరేంద్ర మోడీ తన రెండు రోజుల ఫ్రాన్స్ పర్యటనను ప్రారంభించారు. ఆ పర్యటనలోనే కొనుగోలు ఒప్పందాలపై ప్రకటన వెలువడుతుందని భావించారు. అయితే మోడీ పర్యటన సందర్భంగా రూపొందించిన ప్రణాళికలో దీనిని చేర్చలేదు. ధర పైన, యుద్ధ విమానాలు, జలాంతర్గాములను అందజేసే తేదీ పైన సంప్రదింపులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ధర నిర్ణయం కానప్పటికీ 9-10 బిలియన్ యూరోల మధ్య ఉండవచ్చునని అంచనా.

చైనాపై ఎక్కువగా ఆధారపడరాదు

కొత్త వ్యూహాత్మక పత్రాన్ని ఆమోదించిన జర్మనీ

బెర్లిన్ : చైనాపై యుద్ధాన్ని సాగించేందుకు జర్మనీ ప్రభుత్వం చైనా వ్యూహాన్ని ఆమోదించింది. చైనాపై జర్మనీ ఆర్థిక వ్యవస్థ ఆధారపడడాన్ని తగ్గించే లక్ష్యంతో 64పేజీల డాక్యుమెంట్‌ను రూపొందించింది. అధికార బాధ్యతలు చేపట్టడానికి ముందు జర్మనీ సంకీర్ణం కుదుర్చుకున్న ఒప్పందంలో చైనాను భాగస్వామిగా, పోటీదారుగా, వ్యవస్థాగత ప్రత్యర్థిగా పేర్కొన్నారు. అప్పటి నుండి 'మన సంబంధాల్లో శతృత్వం, పోటీ అంశాలు పెరుగుతునే వున్నాయి."అని ఆ డాక్యుమెంట్ పేర్కొంది. మోసపూరితమైన మాటలైన "పశ్చిమ దేశాల విలువలు", ఉదారవాద ప్రజాస్వామ్యం, 'మానవ హక్కులు' వంటి పదాలను చొప్పించిన ఆ వ్యూహాత్మక పత్రం మొత్తంగా చైనాకు వ్యతిరేకంగా చేపట్టాల్సిన ఆర్థిక, రాజకీయ చర్యలు వివరిస్తోంది. చైనాపై ఆధారపడడాన్ని తగ్గించేందుకు గానూ, ఇతర దేశాల్లో సుస్థిరమైన సరఫరా మార్గాలను జర్మనీ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిపరుచుకుంటోందని ఆ పత్రం పేర్కొంది. అలాగే కీలక రంగాల్లో చైనా సాంకేతికతలపై ఆధారపడకూడదని కూడా నిర్ణయించింది. ఇందుకు గానూ ప్రారంభ దశలోనే కీలక సాంకేతికతను గుర్తించాల్సిన అవసరం వుందని పేర్కొంది. తమ స్వంత పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణ రంగాల్లో మరింత ఎక్కువగా పెట్టుబడులు పెట్టాలని జర్మనీ ప్రభుత్వం భావిస్తోంది. చైనాతో సాంకేతికతలు బదిలీ జరగాల్సిన ప్రాజెక్టుల నుండి నిధులను ఉపసంహరించుకోవాలని భావిస్తోంది. చైనాలో చురుకుగా పనిచేస్తున్న జర్మనీ కంపెనీలు ఎదుర్కొనే ముప్పులపై గతంలో మాదిరిగా ఇకపై ప్రభుత్వం స్పందించబోదు. అలాగే చైనాకు ఎగుమతులను కూడా నియంత్రించనున్నారు. మొబైల్ ఫోన్ నెట్‌వర్క్‌లు వంటి కీలకమైన మౌలిక వ్యవస్థలో కొన్ని చైనా విడిభాగాలను ఉపయోగిస్తున్నారు. ఐటియేతర ఉత్పత్తుల కోసం కూడా నిబంధనలను రూపొందించనున్నారు.

భారత్‌పై రుద్దు...అమెరికాకు వద్దు

- వాషింగ్టన్ నిషేధ జాబితాలో ఇజ్రాయిల్ నిఘా సంస్థలు
- వాటికి ప్రెడేటర్ స్పైవేర్‌తో సంబంధాలు
- అదే స్పైవేర్ కొనుగోలుకు భారత్ ఆసక్తి



వాషింగ్టన్ : భారత్ సహా పలు దేశాలలో రాజకీయ ప్రత్యర్థులు, విమర్శకులు, పాత్రికేయులకు సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని రాబట్టుకునేందుకు ఆయా ప్రభుత్వాలు స్పైవేర్‌ను ప్రయోగించడం కొత్తేమీ కాదు. తాజాగా ప్రెడేటర్ స్పైవేర్‌ను అభివృద్ధి చేసి విక్రయిస్తున్న రెండు ఇజ్రాయిల్ నిఘా సంస్థలను అమెరికా వాణిజ్య శాఖ మంగళవారం నిషేధిత జాబితాలో ఉంచింది. అయితే ఇదే ప్రెడేటర్ స్పైవేర్‌ను కొనుగోలు చేసేందుకు మోడీ ప్రభుత్వం ఆసక్తి చూపుతుండడం గమనార్హం. ప్రెడేటర్ అభివృద్ధి కోసం యూరప్ నుండి కార్యకలాపాలు సాగిస్తున్న ఈ రెండు సంస్థలు ప్రపంచవ్యాప్తంగా వ్యక్తులు, సంస్థల సమాచార గోప్యతకు, భద్రతకు ముప్పుగా పరిణమించాయని అమెరికా అభిప్రాయపడింది. తాజా నిషేధం ప్రకారం... గ్రీస్‌లోని ఇంటెలెక్సా, హంగరీలోని సైట్రాక్స్ కంపెనీలతో పాటు ఐర్లాండ్, ఉత్తర మసెడోనియా దేశాలలోని వాటి అనుబంధ సంస్థలు అమెరికా నుండి వస్తువులు, సేవల ఎగుమతి లైసెన్స్ కోసం దరఖాస్తు చేస్తే దానిని తిరస్కరిస్తారు. ఇంటెలిజెన్స్ సంస్థలకు, చట్టాలను అమలు చేసే సంస్థలకు వాణిజ్య స్పైవేర్‌ను విక్రయిస్తున్న కంపెనీలపై బైడెన్ ప్రభుత్వం వేటు వేస్తున్న విషయం తెలిసిందే. ఈ చర్యలలో భాగంగానే తాజా నిర్ణయం వెలువడింది. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ఎన్‌ఎస్‌ఓకు చెందిన పెగాసస్ స్పైవేర్‌కు ప్రత్యామ్నాయంగా ఇంటెలెక్సా కు చెందిన ప్రెడేటర్ స్పైవేర్‌ను కొనుగోలు చేసేందుకు భారత్ ఆసక్తి చూపుతోందని మార్చిలోనే వార్తలు వచ్చాయి. పెగాసస్ స్పైవేర్‌ను అమెరికా ప్రభుత్వం గతంలోనే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. ప్రెడేటర్ స్పైవేర్‌ను ఇజ్రాయిల్ సైన్యానికి చెందిన మాజీ సైనికాధికారులు అభివృద్ధి చేశారు.

అప్పుడు పెగాసస్...

పాత్రికేయులు, ప్రతిపక్ష నాయకులు, ప్రభుత్వ విమర్శకులు, హక్కుల కార్యకర్తలు వంటి ప్రముఖులను పెగాసస్ లక్ష్యంగా చేసుకుందని 2021లో వార్తలు వచ్చాయి. వారికి సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని యావత్తూ ఆ స్పైవేర్‌లో పెగాసస్ నిక్షిప్తం చేసింది. దానిని కొన్ని ప్రభుత్వాలకు విక్రయించింది. అయితే ఏయే దేశాలకు అమ్మిందీ ఎన్‌ఎస్‌ఓ గ్రూపు బయటపెట్టలేదు. పెగాసస్ గూఢచర్యంపై పలు కథనాలు రావడంతో అమెరికా ప్రభుత్వం ఎన్‌ఎస్‌ఓ పైన, మరో ఇజ్రాయిల్ సంస్థ కాన్‌డిరూ పైన 2021 నవంబర్‌లో నిషేధం విధించింది. ఎన్‌ఎస్‌ఓ మాదిరిగానే ఇప్పుడు రెండు యూరోపియన్ సంస్థలు వ్యవస్థలో చొరబడి ప్రపంచ దేశాలలోని వ్యక్తులు, సంస్థలకు చెందిన సమాచారాన్ని చోరీ చేసి, వాటి భద్రతకు ముప్పు కలిగిస్తున్నాయని అమెరికా వాణిజ్య శాఖ తెలిపింది.

2017లో కుదిరిన విస్తృత రక్షణ ఒప్పందంలో భాగంగా మన ప్రభుత్వం ఇజ్రాయిల్ నుండి పెగాసస్ స్పైవేర్‌ను కొనుగోలు చేసింది. అయితే దీనిపై దేశంలో రాజకీయ దుమారం రేగింది. .

దుకాణాలు సర్దుకొని...

పెగాసస్‌ను అభివృద్ధి చేసినట్లుగానే ప్రెడేటర్‌ను కూడా ఇజ్రాయిల్ మాజీ సైనికాధికారులే అభివృద్ధి చేశారు. ప్రెడేటర్ స్పైవేర్‌ను కొనుగోలు చేసే విషయాన్ని మోడీ ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోంది. దీనిని సైట్రాక్స్ అభివృద్ధి చేయగా గ్రీస్ సంస్థ ఇంటెలెక్సా విక్రయించింది. ఈ రెండు సంస్థలకూ ఇజ్రాయిల్ దేశానికి చెందిన వేర్వేరు వ్యక్తులు యజమానులు. వీరిలో ఇజ్రాయిల్ సైనిక ఇంటెలిజెన్స్ సెలక్ట్ టెక్నాలజీ యూనిట్ కమాండర్ తాల్ దిలియన్ ఒకరు. ఎన్‌ఎస్‌ఓ, కాన్‌డిరూ సంస్థలను నిషిద్ధ జాబితాలో పెట్టడంతో సైబర్ గూఢచర్యానికి పాల్పడుతున్న పలు ఇతర సంస్థలు ఇజ్రాయిల్‌లో దుకాణాలు సర్దుకొని, వేరే ప్రాంతాలకు తరలిపోయి కార్యకలాపాలు ప్రారంభించాయి. అయితే ప్రస్తుతం నిషేధ జాబితాలో చేర్చిన రెండు కంపెనీలు మూట ముల్లె సర్దుకొని విదేశాలకు పోయినా అవి తమ గూఢచర్యాన్ని సజావుగా సాగించలేవని, అవి ఎక్కడ ఉన్నప్పటికీ అమెరికా వదిలిపెట్టదని అధికార వర్గాలు హెచ్చరించాయి.

2021లో వెలుగులోకి...

టొరంటో యూనివర్సిటీకి చెందిన సిటిజన్ ల్యాబ్ 2021 డిసెంబర్‌లో తొలిసారిగా ప్రెడేటర్ స్పైవేర్‌ను వెలుగులోకి తెచ్చింది. అప్పటి వరకూ దాని గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. ఈజిప్ట్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల పరికరాలలో ఈ స్పైవేర్ గూఢచర్య ఉపకరణాన్ని అమర్చిందని ల్యాబ్ గుర్తించింది. గ్రీకు ఇంటెలిజెన్స్ విభాగం పురమాయించినందుకే ప్రెడేటర్ స్పైవేర్ తన ఫోన్‌లోని సమాచారాన్ని తస్కరించిందని ఓ పాత్రికేయుడు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపారు. పాత్రికేయుడు చెప్పింది నిజమేనని గ్రీకు ఇంటెలిజెన్స్ విభాగం అధిపతి పార్లమెంటరీ కమిటీ ఎదుట అంగీకరించారు కూడా.

అదానీకి ఎదురు దెబ్బ


నోయిడాలో గ్యాస్ సరఫరాకు అనుమతి నిరాకరణ



న్యూఢిల్లీ : రాజధాని న్యూఢిల్లీ శివారులోని నోయిడాలో నివాస గృహాలకు పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేసేందుకు అదానీ గ్రూప్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇందుకోసం అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ పెట్టుకున్న దరఖాస్తును కేంద్ర పెట్రోలియం, సహజవాయువు రెగ్యులేటరీ బోర్డు (పీఎన్‌జీఆర్‌బీ) తోసిపుచ్చింది. ఆటోమొబైల్స్‌కు సీఎన్‌జీ లైసెన్స్ కోసం చేసిన అభ్యర్థనను కూడా తిరస్కరించింది. చట్ట నిబంధనలను అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ పాటించలేదని, అందుకే దరఖాస్తును తిరస్కరించామని ఈ నెల 14న ఇచ్చిన ఆదేశాలలో రెగ్యులేటరీ బోర్డు వివరించింది. రాజధాని పొరుగున ఉన్న నగరాలలో సిటీ గ్యాస్ పంపిణీ (సీజీడీ) లైసెన్స్ కోసం అదానీ రెండు దశాబ్దాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. రెగ్యులేటరీ బోర్డు లేదా కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతి పొందిన సంస్థ మాత్రమే ఏ నగరంలో అయినా పైప్‌లైన్ ద్వారా సహజవాయువును సరఫరా చేయగలదు. ప్రభుత్వ రంగంలోని సంస్థలు ఉమ్మడి భాగస్వామ్యంలో ఏర్పాటు చేసిన ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ (ఐజీఎల్) 1990వ దశకం నుండీ రాజధానిలో గ్యాస్ సరఫరా చేస్తోంది. సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సంస్థకు సిటీ గ్యాస్ లైసెన్స్ మంజూరు చేశారు. పరిసర నగరాలలో కూడా తానే ఈ సేవలు అందిస్తానని ఆ కంపెనీ ప్రతిపాదించగా అదానీ గ్రూపు వ్యతిరేకించింది.

సుప్రీంలో పరాభవం

నోయిడాలో గ్యాస్ సరఫరాకు కేంద్ర ప్రభుత్వం 2004 ఏప్రిల్ 8వ తేదీనే ఐజీఎల్‌కు అనుమతి ఇచ్చింది. అయితే నోయిడా భౌగోళిక ప్రాంతంలో సహజవాయువు పంపిణీ వ్యవస్థను అభివృద్ధి చేసే అధికారం తనకే ఉన్నదని 2008 జూన్ 25న అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ ప్రకటించింది. అయితే ఆ కంపెనీ దరఖాస్తును రెగ్యులేటరీ బోర్డు అనుమతించలేదు. దీంతో వ్యవహారం సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. వివాదాన్ని పరిష్కరించే అధికారం బోర్డుకే ఉన్నదని సుప్రీంకోర్టు గత సంవత్సరం సెప్టెంబర్‌లో తీర్పు ఇచ్చింది. దీంతో అదానీ కంపెనీ దరఖాస్తును మరోసారి పరిశీలించిన రెగ్యులేటరీ బోర్డు, తాజాగా దానిని తోసిపుచ్చింది. నిర్ణాయక కమిటీలోని ముగ్గురు సభ్యులలో ఇద్దరు ఆ దరఖాస్తును వ్యతిరేకించారు.



అమిత్ షాతో పవన్ కళ్యాణ్ భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బుధవారం భేటీ అయ్యారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కార్యాలయంలో అమిత్ షాతో భేటీ అయిన పవన్ కల్యాణ్ 15 నిమిషాల పాటు రాష్ట్ర రాజకీయ అంశాలతో పాటు పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. అంతకు ముందు ఆంధ్రప్రదేశ్ బిజెపి వ్యవహారాల ఇన్‌చార్జి, కేంద్ర మంత్రి మురళీధరన్‌తో పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. ఈ భేటీలో ఆయనతో పాటు నాదేండ్ల మనోహర్ కూడా ఉన్నారు. మురళీధరన్‌తో కలిసి అల్పాహార సమావేశం నిర్వహించారు. 15 నిమిషాల పాటు వీరిద్దరి మధ్య రాజకీయాలపై చర్చ జరిగింది. ఎన్‌డిఎ సమావేశంలో పాల్గొనేందుకు పవన్ కళ్యాణ్ మంగళవారం ఢిల్లీకి వచ్చారు. గురువారం కూడా పవన్ కళ్యాణ్ ఢిల్లీలోనే ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

సెన్సెక్స్ @67వేలు

- 20వేల చేరువలో నిఫ్టీ
- పిఎస్‌బి షేర్ల మద్దతు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు కొనుగోళ్ల మద్దతుతో పరుగులు పెడుతున్నాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ చరిత్రలోనే తొలిసారి 67వేల మార్క్‌ను దాటింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 20వేల చేరువలో నమోదయ్యింది. లాభాల్లో సాగుతున్న అమెరికన్ మార్కెట్ల విశ్వాసంతో బుధవారం భారత మార్కెట్లలోనూ కొనుగోళ్ల జోరు చోటు చేసుకుంది. ప్రధానంగా ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల మద్దతుతో బిఎస్‌ఇ సెన్సెక్స్ 302 పాయింట్లు లేదా 0.45 శాతం పెరిగి 67,097కి చేరింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 84 పాయింట్లు లేదా 0.42 శాతం లాభపడి 19,833 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఏకంగా ఈ సూచీలు ఏకంగా 67,171, 19,892కి చేరి మరో నూతన రికార్డ్‌ను సృష్టించాయి. నిఫ్టీలో ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల సూచీ 2 శాతం ర్యాలీ చేసింది. ఆ తర్వాత మీడియా ఒక్క శాతం పెరగ్గా, ఐటి సూచీ యథాతథంగా నమోదయ్యింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటిసి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్లకు డిమాండ్ నెలకొంది. డాలరుతో రూపాయి మారకం విలువ 82.09గా ఉంది.


నితీష్ అసంతృప్తిగా లేరు!

- స్పష్టం చేసిన జెడియు

పాట్నా : ఇటీవల బెంగళూరులో జరిగిన ప్రతిపక్షాల సమావేశం పట్ల బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అసంతృప్తిగా లేరని జనతాదళ్ (యునైటెడ్) చెప్పింది. నితీష్ అసంతృప్తిగా వున్నారని వార్తలు వస్తున్న నేపథ్యంలో పార్టీ ఈ ప్రకటన చేసింది. అనంతరం నితీష్ కుమార్ మాట్లాడుతూ, తాను సంతోషంగా లేనని వచ్చిన వార్తలను తోసిపుచ్చారు. బెంగళూరు సమావేశంలో జరిగిందంతా కరక్టగానే వుందని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల కూటమికి కన్వీనర్‌గా వుండాలనే కోరిక తనకు లేదని కుమార్ మీడియాకు చెప్పారు. బిజెపిని ఓడించేందుకు ప్రతిపక్షాలను సమైక్యంగా వుంచాలన్నదే తన ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. నలందా జిల్లాలోని రాజ్‌గృహ్ వద్ద మల్మాస్ మేళాను ఆయన ప్రారంభించిన తర్వాత మీడియాతో మాట్లాడారు. జెడియు జాతీయ అధ్యక్షుడు లలన్ సింగ్ అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ, నితీష్ అసంతృప్తిపై వస్తున్న వార్తలను తోసిపుచ్చారు. అవన్నీ బూటకమని అన్నారు. ఉద్దేశ్యపూర్వకంగానే అటువంటి పుకార్లను వ్యాప్తి చేస్తున్నారని అన్నారు. ఇవన్నీ సత్య దూరాలని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల ఐక్యత పట్ల బిజెపి అగ్ర నేతలు భయపడుతున్నారని, అందుకే ఇలాంటి వదంతులు వ్యాప్తి చేస్తున్నారని అన్నారు.

ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



విభజన హామీలు నెరవేర్చాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామని వైసిపి ఎంపి వి. విజయసాయిరెడ్డి అన్నారు. బుధవారం పార్లమెంట్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశానికి హాజరైన విజయసాయి రెడ్డి, అనంతరం విజయ్ చౌక్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక హోదా, పోలవరం నిధులు, అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. బిసి కులగణన జరిపించాలని, బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరామన్నారు. విశాఖ రైల్వే జోన్ అంశాన్ని లేవనెత్తామని, జోన్ ఏర్పాటు చేసి నాలుగేళ్లైనా అమల్లోకి రాలేదన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకించామన్నారు. నిర్ణయం వెనక్కి తీసుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశామన్నారు. విశాఖ ఉక్కు ఇప్పుడు నష్టాల్లో లేదన్నారు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని కూడా విజయసాయిరెడ్డి కోరారు. పార్టీ ఫిరాయింపుల చట్టం కట్టుదిట్టంగా అమలుకు చేయాలని కోరామన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి : టిడిపి




ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర పునర్విభజన చట్టం కాల పరిమితి మరో పది నెలల్లో ముగియనున్న నేపథ్యంలో అందులోని హామీలు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు టిడిపి రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర కుమార్ తెలిపారు. పునర్విభజన చట్టంలోని హామీల అమలు, నిధులు రాబట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నందున వాటిని అమలు చేయాల్సిన బాధ్యతను తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన తెలిపారు. విశాఖ రైల్వే జోన్‌ను పూర్తిగా నెరవేర్చాలని, అమరావతినే రాజధానిగా ప్రకటించి అభివృద్ధి చేయాలని కోరినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 లక్షల కోట్లు అప్పులు చేసి రుణభారాన్ని ప్రజల నెత్తిన పెట్టిందని, రాష్ట్రంలో ప్రత్యర్థి రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బిసి, మహిళలు, మైనారిటీ వర్గాలపై దాడులు, హింసకు పాల్పడుతున్న విషయంపైనా చర్చించామన్నారు. ఏదో ఓ కూటమిలో ఉండాలనేది శాసనం కాదని ఆయన ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. కూటమిలో లేకపోయినంత మాత్రాన తమది పార్టీ కాకుండా పోదని ఆయన తెలిపారు.

తీస్తా సెతల్వాదకు రెగ్యులర్ బెయిల్

- కస్టడీ విచారణ అవసరం లేదు
- స్పష్టం చేసిన సుప్రీం కోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



గుజరాత్ అల్లర్లు-2002కు సంబంధించి కల్పిత సాక్ష్యాలను సృష్టించారన్న ఆరోపణల కేసులో హక్కుల ఉద్యమకారిణి తీస్తా సెతల్వాదకు సుప్రీంకోర్టు బుధవారం రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది ఈ విషయంలో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కొట్టేసింది. . సెతల్వాదపై ఛార్జిషీటు దాఖలు చేసినందున కస్టడీ విచారణ అవసరం లేదని స్పష్టం చేసింది. ఆమెకు రెగ్యులర్ బెయిల్ తిరస్కరిస్తూ, తక్షణం లొంగిపోవాలంటూ గుజరాత్ హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుపై ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను బుధవారం విచారించిన జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ ఎఎస్ బోపన్న, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలిచ్చింది.

'హైకోర్టు పరిశీలన రాజ్యాంగ విరుద్ధంగా ఉంది. కస్టడీలో ఉన్నప్పుడే తీస్తా సెతల్వాద పాస్‌పోర్ట్‌ను సెషన్స్ కోర్టుకు సరెండర్ చేశారు. రెగ్యులర్ బెయిలు మంజూరు చేస్తున్నందున సాక్ష్యాలను తారుమారు చేసే ఎలాంటి ప్రయత్నాలు చేయరాదు' అని ధర్మాసనం ఆదేశించింది. సాక్ష్యాలను ప్రభావితం చేసే ఎలాంటి ప్రయత్నాలు జరిగినా గుజరాత్ పోలీసులు తమ దృష్టికి తీసుకురావచ్చని కూడా సుప్రీంకోర్టు తెలిపింది. ఆధారాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ వాదనను అంగీకరిస్తే, చట్టంలోని సాక్ష్యాల నిర్వచనాన్ని 'డస్ట్‌బిన్ (చెత్తబుట్ట)' లో పడేయాల్సి ఉంటుంది' అని వ్యాఖ్యానించింది.

ఇండియా పేరు వినియోగంపై 26 పార్టీలపై పోలీసు కేసు

న్యూఢిల్లీ: బిజెపి సారథ్యంలోని ఎన్‌డిఎపై పోటీకి 26 ప్రతిపక్ష పార్టీలు కలిసి ఐఎన్‌డిఐఎ (ఇండియా)పేరుతో కూటమి ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల బెంగళూరులో జరిగిన రెండు రోజుల సమావేశంలో జాతీయ అభివృద్ధి సమ్మిళిత కూటమి (ఐ.ఎన్.డి.ఐ.ఎ.) అనే పేరు పెట్టారు. అయితే ఇండియా పేరును ఉపయోగించుకోవడం సరికాదని, ఇది అక్రమ వినియోగం కిందకు వస్తుందని పేర్కొంటూ ఢిల్లీలోని బారాఖమ్బ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. డాక్టర్ అవినాష్ మిశ్రా అనే 26 ఏళ్ల యువకుడు ఈ ఫిర్యాదు చేశాడు.జాతీయ చిహ్నాల చట్టం కింద ఇండియా అనే పేరు వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎవరూ ఉపయోగించుకోరాదని ఫిర్యాదుదారు తన కంప్లయింట్‌లో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది ప్రజల మనోభావాలను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు.

మణిపూర్ హింసాకాండను నియంత్రించండి

- ప్రజల బాధాకరమైన పరిస్థితుల పరిష్కారానికి తక్షణ చర్యలు అవసరం
- కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కోరిన ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ

న్యూఢిల్లీ: మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండపై నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ (ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాసింది. మణిపూర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను తీర్చేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరింది. ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ జనరల్ సెక్రెటరీ అన్నీ రాజా, జాతీయ కార్యదర్శి నిషా సిద్ధూ లు అమిత్ షాకు రాసిన లేఖపై సంతకం చేశారు. మణిపూర్‌లో రెండు వర్గాల మధ్య మే 3న చెలరేగిన జాతి హింస తీవ్ర అల్లర్లకు కారణమైన విషయం విదితమే. ఈ హింసలో వేలాది మంది నిరాశ్రయులు కాగా, 140 మందికి పైగా మరణించారు.

మణిపూర్‌ను చుట్టుముట్టిన హింస ఆ రాష్ట్ర ప్రజలకు అపారమైన బాధను కలిగించిందని ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ పేర్కొన్నది. రాష్ట్రవ్యాప్తంగా మే మొదటి వారం నుంచి అనేక మార్చురీలలో క్లెయిమ్ చేయని అనేక కుళ్ళిపోతున్న మతదేహాల బాధాకరమైన పరిస్థితిని లేఖ ఎత్తిచూపింది. మణిపూర్ సంక్షోభం నుంచి ఉత్పన్నమయ్యే అత్యవసర విషయాలను పరిష్కరించడానికి అమిత్ షా తక్షణమే జోక్యం చేసుకోవాలని మహిళా సంస్థ విజ్ఞప్తి చేసింది. గుర్తుతెలియని మృతదేహాలతో సహా అన్నిటికీ పోస్ట్‌మార్టం నిర్వహించేందుకు ప్రముఖ వైద్య సంస్థకు చెందిన స్వతంత్ర ఫోరెన్సిక్ నిపుణుడి నేతృత్వంలో మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని సంస్థ నొక్కి చెప్పింది.

చనిపోయినట్టు భయపడుతున్న తప్పిపోయిన వ్యక్తుల కుటుంబాలను సంప్రదించగలిగే అధికారిని నియమించాలని లేఖలో హోం మంత్రికి విజ్ఞప్తి చేశారు. మతుల కుటుంబాలను మణిపూర్‌కు సురక్షితంగా తరలించాలని సదరు సంస్థ కోరింది. కేంద్ర హోం మంత్రి నుంచి సానుకూల స్పందన వస్తుందనే ఆశాభావాన్ని మహిళా సంస్థ వ్యక్తం చేసింది. హింస చెలరేగడం రాష్ట్ర సామూహిక స్పృహపై తీవ్ర ప్రభావాన్ని చూపిందనీ, మణిపూర్ ప్రజలు ఎదుర్కొంటున్న బాధాకరమైన పరిస్థితులను పరిష్కరించడానికి తక్షణ చర్యలు అవసరమని ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ వివరించింది.

మళ్లీ ఎగిసిన నిరసన జ్వాలలు

న్యాయ వ్యవస్థపై అధికారాల రద్దుకు వ్యతిరేకంగా

- ఇజ్రాయిల్ మిలటరీ హెడ్‌క్వార్టర్స్ ఎదుట ప్రదర్శనలు
- రోడ్ల దిగ్బంధనం



జెరూసలేం : ఇజ్రాయిల్ న్యాయ వ్యవస్థపై ప్రధాని బెంజామిన్ నెతన్యాహు ప్రభుత్వం చేస్తున్న దాడిని నిరసిస్తూ ప్రజలు నిరసలనకు దిగారు. రహదారులను దిగ్బంధించారు, రైళ్లను నిలిపివేశారు. స్టాక్ ఎక్స్ఛేంజ్, మిలటరీ హెడ్‌క్వార్టర్స్‌ల ఎదుట పెద్ద సంఖ్యలో ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించారు. మిలటరీ రిజర్విస్ట్‌లతో సహా ఆందోళనకారులు మానవ హారాలను ఏర్పాటు చేశారు. సెంట్రల్ టెల్ అవీవ్‌లోని ఇజ్రాయిల్ మిలటరీ హెచ్‌కార్వర్టర్ ప్రవేశ మార్గాన్ని దిగ్బంధించారు. స్టాక్ ఎక్స్ఛేంజ్ భవనం వెలుపల స్మోక్ బాంబులను విసిరిన ఆందోళనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నియంతృత్వంతో ఆర్థిక వ్యవస్థ హత్య చేయబడుతుంది, దేశాన్ని కాపాడాలంటూ వారు నినదించారు. దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లన్నీ ఆందోళనకారులతో పోటెత్తాయి. దాంతో టెల్ అవీవ్‌లోని సెంట్రల్ స్టేషన్‌లోకి వందలాదిగా ఆందోళనకారులు ప్రవేశించకుండా పోలీసులు స్టేషన్‌ను మూసివేశారు. కాగా, సార్వత్రిక సమ్మెకు పిలుపివ్వాలని దేశంలోనే అతిపెద్ద కార్మిక సంఘమైన హిస్టాడ్రాట్ భావిస్తోంది. మార్చిలో ఇదే అంశంపై యూనియన్ సమ్మెకు పిలుపిచ్చింది. దాంతో నెతన్యాహు న్యాయ వ్యవస్థలో తాను తీసుకురాదలచిన చర్యలను నిలుపుచేయాల్సి వచ్చింది. అయితే ప్రతిపక్షంతో జరిగిన చర్చలు విఫలమవడంతో గత నెల్లో తిరిగి ఈ సంస్కరణల ఆలోచన తలెత్తింది. వచ్చే వారంలో ఈ ప్రణాళికపై ఓటింగ్ జరగనుంది. దానికి ముందుగా ఈ బిల్లును బుధవారం పార్లమెంటరీ కమిటీకి పంపారు. న్యాయమూర్తుల నియామకంపై రాజకీయ నేతలకు మరింత నియంత్రణ ఇవ్వడానికి ప్రతిపాదిత బిల్లు తెచ్చారు. అవసరమైతే కోర్టు నిర్ణయాలను తిప్పికొట్టడానికి పార్లమెంట్‌కు అధికారం వుండాలన్నది ప్రభుత్వ ఆలోచనగా వుంది.

కేంద్రాన్ని నిలదీయండి

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధం కావాలని, ప్రజలు ఆ పార్టీలపై విశ్వాసం వుంచి గెలిపించినందుకు రుణం తీర్చుకోవాలని కోరారు. ఉమ్మడి సివిల్ కోడ్ (యుసిసి) పేరుతో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దేశం మీద మతోన్మాద అజెండాను రుద్దాలని ప్రయత్నిస్తుంటే లౌకికపార్టీలని చెప్పుకునే వైసిపి, టిడిపి దానికి తందానా అనడం సిగ్గుచేటని పేర్కొన్నారు. యుసిసిని పార్లమెంటులో వ్యతిరేకించాలని కోరారు.

ఎన్‌డిఎ సమావేశానికి జనసేన వెళ్లడం రాష్ట్రానికి చేటు

కేంద్ర ప్రభుత్వ ద్రోహానికి వ్యతిరేకంగా పోరాడతానని చెప్పిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఇప్పుడు ఏకంగా ఎన్‌డిఎ గూటిలో చేరారని, బిజెపి రోడ్‌మ్యాప్‌ను రాష్ట్రంలో అమలు చేయడానికి సిద్ధపడటం సిగ్గుచేటని అన్నారు. పవన్‌కల్యాణ్‌పై పార్టీ కార్యకర్తలు, మహిళలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయడమేనని, దేశమంతా బిజెపిని ఓడించడానికి ఏకమవుతుంటే, బిజెపి సరసన జనసేన చేరడం రాష్ట్రంతోపాటు, ఆ పార్టీకీ ఆత్మహత్యాసదృశ్యమేనని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బిజెపితో టిడిపి, జనసేన జతకడతాయని, ఎన్‌డిఎలో లేకపోయినా టిడిపితో అవగాహనకు వస్తామని బిజెపి ప్రకటించిందని, అయినా టిడిపి నోరు మెదపడం లేదని అన్నారు. ఇప్పటి వరకు వివిధ రాష్ట్రాల్లో బిజెపితో కూడిన ఏ పార్టీ బతికి బట్టకట్టలేదని, విచ్ఛిన్నం, చీలికలు, పీలికలు అయ్యాయని తెలిపారు. దానిపై పోరాడుతున్న పార్టీలే మనుగడలో ఉన్నాయని వివరించారు. బిజెపితో పొత్తుపెట్టుకునే విషయంలో వస్తున్న వార్తలపై తెలుగుదేశం వివరణ ఇవ్వాలని, లేనియెడల ఈ పార్టీలన్నీ బిజెపి గూటి పక్షులుగానే ప్రజలు భావించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్‌డిఎతో కలిసి ఉండి బిజెపిని బలపరుస్తూ తమకు తామూ లౌకికవాదులమని చెప్పుకునే అర్హత ఏ పార్టీకీ ఉండదని, అది ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. రాష్ట్రాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్న బిజెపి కుట్రలను తిప్పికొట్టాలని అన్ని పార్టీలను, ప్రజానీకాన్ని కోరారు. బిజెపి మతోన్మాదానికి వ్యతిరేకంగా గళం విప్పాలని మేధావులకు విజ్ఞప్తి చేశారు.

చైనాను కట్టడి చేయలేరు!

- అమెరికాకు స్పష్టం చేసిన దౌత్యవేత్త

బీజింగ్ : చైనాను కట్టడి చేయడం లేదా ముట్టడించడం సాధ్యం కానిదని చైనా దౌత్యవేత్త వాంగ్ యి స్పష్టం చేశారు. అమెరికా మాజీ విదేశాంగ మంత్రి హెన్రీ కిస్సింగర్‌తో సమావేశం సందర్భంగా వాంగ్ యి మాట్లాడుతూ, ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడేందుకు ఆయన చేసిన కృషిని అభినందించారు. చైనా అభివృద్ధి అనేది అంతర్‌జనితంగా సాధించబడిందని, దానికొక చరిత్రాత్మకమైన లాజిక్ వుందని, అందువల్ల చైనాను మార్చాలని ప్రయత్నించడం సాధ్యం కానిదని ఆయన స్పష్టం చేశారు. చైనాను నియంత్రించడం లేదా చుట్టుముట్టడం కూడా అస్సలు సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. బీజింగ్‌లో వాంగ్, కిస్సింగర్‌తో భేటీ అయ్యారు. పాత మిత్రులతో నెలకొన్న స్నేహ బంధంగా ఆయన ఆ సమావేశాన్ని వ్యాఖ్యానించారు. అమెరికా పట్ల చైనా విధానం ఉన్నత స్థాయి కొనసాగింపుగా వుంటుందని, అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రతిపాదించిన ప్రాథమిక మార్గదర్శకాల ప్రాతిపదికనే వుంటుందని వాంగ్ పేర్కొన్నారు. పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనం, సమాన అవకాశాలు అన్నవి ఆ ప్రాథమిక సూత్రాలని ఆయన వివరించారు. చైనా, అమెరికా మధ్య సంబంధాలు సరైన దిశలో కొనసాగడానికి, ఒకరిని ఒకరు కలుపుకుని పోవడానికి ఈ మూడు మార్గదర్శకాలు ఉపయోగపడతాయని అన్నారు.

ముస్లింలకు అండగా ఉంటాం



చంద్రబాబును శాలువతో సత్కరిస్తున్న ముస్లిం మతపెద్దలు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ అని, మత సామరస్యానికి ప్రాధాన్యత ఇచ్చిందని తెలిపారు. మనుషులంతా ఒకటేనని, మతాలను గౌరవించాలని, ద్వేషించకూడదని చెప్పిన పార్టీ టిడిపి అని చెప్పారు. టిడిపి ఆవిర్భావం తర్వాత ముస్లిం కమ్యూనిటీ అభివృద్ధికి చేసిన నిర్ణయాలు, తీసుకొచ్చిన పథకాలను ప్రస్తావించారు. మహిళలకు ఆస్తిలో 1/2 వాటా ఇవ్వాలని ఖురాన్‌లో పొందుపరచబడిందని తెలిపారు. టిడిపి ఆవిర్భావం తర్వాత మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పిస్తూ ఎన్‌టిఆర్ చట్టం చేశారని చెప్పారు. టిడిపి ఎన్‌డిఎతో పొత్తు ఉన్న సమయంలో మత సామరస్యం కోసం పనిచేసిందని వివరించారు. రాజకీయాల్లో ముస్లిములు ఎక్కువగా రాణించాల్సిన అవసరం ఉందని, పబ్లిక్ పాలసీలు తయారుచేసే రాజకీయాల్లోకి రావాలని చెప్పారు. ముస్లింలలో ఉన్న పేదరికాన్ని రూపుమాపాల్సిన అవసరం ఉందని, పేదలు లేని సమాజం కోసం పి4 అనే విధానాన్ని తాను ప్రతిపాదించానని తెలిపారు. యుసిసి కేవలం ముస్లిం వర్గానికే నష్టం అనే వాదన తప్పని నేతలు చంద్రబాబుకు వివరించారు. మత స్వేచ్ఛకు అడ్డుపడే ఈ చట్టానికి మద్దతు ఇవ్వొద్దని చంద్రబాబును కోరారు.

ఈ కార్యక్రమంలో అహ్లే సున్నత్ జమాత్, మశాఇక్ బోర్డు, జమీయత్ ఏ ఉలేమా ఏ హింద్, జమాత్ ఏ ఇస్లామి హింద్, జమియాత్ అహ్లే హదీస్ సంస్థల ప్రతినిధులు, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు షారూఖ్ షబ్లీ, శాసనమండలి మాజీ ఛైర్మన్లు ఎన్ఎమ్‌డి ఫరూక్, అహ్మద్ షరీఫ్, టిడిపి నేతలు జలీల్ ఖాన్, అక్తార్ చాంద్ బాషా, షాజహాన్ బాషా, నసీర్ అహ్మద్, మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పరవళ్లు

(మొదటి పేజీ తరువాయి)

రెండు లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. పోలవరం కాపర్ డ్యామ్ వద్ద నీటిమట్టం 29 మీటర్లకు చేరింది. దీంతో, పోలవరం స్పిల్‌వే నుంచి 1.73 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం కాఫర్ డ్యామ్ వద్ద 29.75 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. గండిపోశమ్మ ఆలయాన్ని వరద నీరు చుట్టుముట్టింది. దీంతో, ఆలయాన్ని తాత్కాలికంగా మూసేశారు. ఆలయ పరిసరాల్లో దుకాణాలు అధికారులు తొలగిస్తున్నారు. చింతూరు ఏజెన్సీ ప్రాంత చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 25 అడుగులకు చేరింది. మండలంలోని సోకులేరు, చంద్రవంక వాగుల్లో క్రమంగా నీటి ప్రవాహం పెరుగుతోంది. పేరూరు వద్ద 5.30 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోంది. సోకులేరు వాగు ఉధృతి వల్ల చింతూరు, విఆర్.పురం మండలాల్లో రహదారులు స్తంభించే అవకాశం ఉంది. నదుల్లో నీటి ప్రవాహం పెరిగి ప్రమాద స్థాయికి చేరే అవకాశం ఉన్నందున ముంపు మండలాల పర్యవేక్షణకు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్... చింతూరు డివిజన్ కేంద్రానికి చేరుకున్నారు. ముంపు మండలాల్లో నిర్వాసిత ప్రజలను సురక్షిత ప్రాంతాల్లో ఉంచేందుకు ఎగువ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలు, హాస్టళ్లను పునరావాస కేంద్రాలుగా మార్చే పనిలో అధికారులు ఉన్నారు. నిత్యావసరాల నిల్వలను బఫర్ స్టాక్ సెంటర్లకు తరలించారు. వరదలకు ఎటువంటి ప్రాణనష్టమూ జరగకుండా ఎప్పటికప్పుడు ముంపు ప్రాంత ప్రజానీకానికి సమాచారాన్ని ఇస్తూ అప్రమత్తం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు, పశ్చిమగోదావరి జిల్లా ఆచంట, యలమంచిలి, నరసాపురం మండలాల ప్రజలనూ గోదావరి వరద భయం వెంటాడుతోంది.



మీకోసం

నీటిని కొంచెం వేడి చేసి అందులో డెటాల్ వేసి ఇల్లు తుడిస్తే క్రిమికీటకాలు నశిస్తాయి.

జీవన సౌరభం

నీకు కావాల్సిన దాని గురించి శ్రమించకుండా పోగొట్టుకున్న దాని గురించి ఏడవడం మూర్ఖత్వం.

తగిన శాస్తి



సిరిపురంలో చంద్రయ్య అనే కూరగాయల వ్యాపారి ఉండేవాడు. అతనికి కొంత అత్యాశ ఉండేది. ఒకసారి నలభై కిలోల బీరకాయలు, పలు రకాల కూరగాయలు తీసుకుని సంతలో అమ్మేందుకు సిద్ధమయ్యాడు. సాయంత్ర మయ్యేసరికి కూరగాయలన్నీ అమ్ముడుపోయాయి. బీరకాయలు మాత్రం అలాగే ఉండి పోయాయి. చీకటి పడుతున్నా ఎవరూ కొనడం లేదు. ఇంతలో ఓ వ్యక్తి చంద్రయ్య దగ్గరకు వచ్చి 'కిలో బీరకాయలు ఎంత? ఈ బస్తాలో మొత్తం ఎన్ని కిలోలు ఉన్నాయి' అన్నాడు. కిలో రూ.30. ఈ బస్తాలో మొత్తం 50 కిలోల బీరకాయలు ఉన్నాయి.' అన్నాడు చంద్రయ్య. అప్పటికే పూర్తిగా చీకటి కమ్మేసింది. 'సరే బీరకాయల బస్తా నా బండిలో పెట్టు' అని మూడు రూ.500 నోట్లు చంద్రయ్యకు అందించాడు ఆ వ్యక్తి. ఆ నోట్లను అందుకుని బీరకాయల బస్తాను బండిలో వేసి పంపించాడు చంద్రయ్య. 'బీరకాయలు అమ్ముడుపోక నిరాశగా ఉన్న నాకు చివరలో భలే బేరం వచ్చింది..' అనుకుంటూ ఇల్లు చేరాడు. ఇంటికి వచ్చాక ఆ రోజు వచ్చిన డబ్బును లెక్క చూసుకుంటుంటే అందులో బీరకాయలు కొన్న వ్యక్తి ఇచ్చిన నోట్లలో ఒకటి నకిలీదీ అని అర్థమైంది. '40 కిలోల బీరకాయలను 50 కిలోలుగా అబద్ధమాడి అమ్మినందుకు తగిన శాస్తి జరిగింది, తనను మోసగించబోయి నేనే మోసపోయాను... అనుకున్నాడు. ఇంకెవరినీ ఎప్పుడూ మోసగించరాదన్ని మించాడు.


- డా.బెల్లంకొండ నాగేశ్వరరావు.

వర్నన	-
పోషన	-
విస్థీర్నం	-
నిపునుడు	-
సంగర్షన	-
వర్నాంతరం	-
సాదారనమైన	-
బ్రహ్మనుడు	-

సరిచేసి రాయండి

పిల్లలూ, ఇక్కడ ఎడమ చేతి వైపు ఇచ్చిన పదాలు తప్పగా ఉన్నాయి. 'ణ', 'ధా' అక్షరాలను ఉపయోగించి వాటిని సరిచేయండి.

నేను గీసిన బొమ్మ





పి. బద్రినాథ్,
8వ తరగతి,
జెడ్‌పి ఉన్నత పాఠశాల,
మైదుకూరు,
కడపజిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మునివేళ్ల మాయావి..



పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తుండటంతోపాటుగా ఫింగర్ పెయింటర్‌గా అద్భుత కళాఖండాలకు జీవం పోస్తున్నారు ఆత్మకూరు రామకృష్ణ. మరో వైపు కవిత్వం రాస్తూ సాహిత్య ప్రస్థానంలో తనవంతుగా కృషిచేస్తున్నారు. ఇప్పటికే పలు సంకలనాలను సైతం ప్రచురించారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఇందుకూరుపేటలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించారాయన. చిన్ననాటి నుంచే బొమ్మలు గీయటాన్ని అలవర్చుకున్నారు. ఊరి చుట్టూ ఉన్న పచ్చని ప్రకృతిని మెచ్చి తన కుంచెతో చిత్రలేఖనం ప్రారంభించారు. మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌ను పూర్తిచేశారు. చిన్ననాటి నుంచి నేటికీ ఎన్నో అద్భుత కళాఖండాలు తీర్చిదిద్దారు. ఎన్నో అవార్డులు రికార్డులు అందుకున్నారు.










విజయవాడ కేంద్రీయ విద్యాలయం-2లో ఆర్టు టీచరుగా పనిచేస్తున్న ఆత్మకూరు రామకష్ణ 11 సంవత్సరాల క్రితం బెంగళూరు కేంద్రీయ విద్యాలయలో ఫింగర్ పెయింటింగ్ మారథాన్‌ను నిర్వహించి ప్రపంచ రికార్డును నెలకొల్పారు. కుంచె వంటి ఉపకరణాలు లేకుండా కేవలం చేతివేళ్ళతో ఆయిల్ కలర్స్‌ని ఫింగర్ పెయింటింగ్స్‌గా వాడి 12 ఇంటూ16 ఇంచెస్ స్ట్రెచ్డ్ క్యాన్‌వాసుపై 13:26 గంట (806 నిమిషాలు)ల్లో 100 చిత్రాలను గీసి ప్రపంచ రికార్డును అందుకున్నారు. కరోనా కష్టకాలం నేర్పిన పాఠాలతో యూట్యూబర్‌గా మారిన రామకృష్ణ ఓ చిత్రకారునిగా గతంలో తాను చిత్రించిన వందల చిత్రాలను వీడియోలుగా మలచి యూట్యూబు వేదికపై 14 వ్యక్తిగత చిత్రకళా ప్రదర్శనలిచ్చారు. ఈ సంవత్సరం జనవరి 1వ తేదీన మొదటి ఎపిసోడ్‌తో వీడియోలు ప్రారంభించి రోజుకు ఒకటి చొప్పున విడుదల చేస్తున్నారు. 100వ ఎపిసోడ్ ఏప్రిల్ 10తో ముగిసి మరో ప్రపంచ రికార్డుగా నిలిచింది. ఫర్ ఫార్మర్, ఎడిటర్, గ్రాఫిక్ డిజైనర్, ప్రొడ్యూసర్, డైరెక్టర్‌గా కూడా రామకృష్ణే వ్యవహరించి వీడియోను రూపొందించటం మరో విశేషం. ప్రతిరోజు ఒకే టైమ్‌కి 'ఆత్మకూరు రామకృష్ణ ఆర్టిస్ట్' అన్న స్వీయ యూట్యూబ్ ఛానల్లో ధారావాహికగా ప్రసారం అయ్యేట్లు ఏర్పాటు చేశారు. విజువల్ ఆర్టు (దశ్య కళ)ల్లో ఒకటైనా చిత్ర లేఖనాన్ని నాలుగు గోడల మధ్య కాక ఫర్‌ఫామింగ్ ఆర్టు (ప్రదర్శన కళ)గా మార్చి పేక్షకుల ముందు ప్రదర్శించటమేకాక, దానికి కొన సాగింపుగా మీడియా, సోషల్ మీడియా ద్వారా ఫింగర్ పెయింటింగును మరింత ప్రాచుర్యంలోకి తీసుకొస్తున్నారు. కళకు, కళారూపానికి ఖర్చు లేని ప్రచార వేదిక యూట్యూబ్ కాగా, ఆ వేదికతో పంచుకున్న వరల్డ్ రికార్డు ఫీట్‌కు శాశ్వతత్వం లభించింది. భవిష్యత్ తరాలకు ఈ వరల్డ్ రికార్డు విశేషాలను అందుబాటులో ఉంచటం, మరికొందరికి ఆదర్శంగా ఇవ్వటమే కాకుండా యూట్యూబ్ ద్వారా ఓ గొప్ప సాంస్కృతిక సంపదను భావితరాలకు అందించే కృషిని కొనసాగిస్తున్నారు.

13 గంటలపాటు ఏకధాటిగా ...

13.26 గంటలపాటు కూర్చొన్న చోటనే కూర్చుని 'ఆత్మకూరు స్వీయ మోనోగ్రాఫ్' అనే అపురూప ప్రక్రియను చేపట్టారు. తన విజయగాథను ఫింగర్ పెయింటింగ్ మారథాన్'గా మలచారు. సాధారణంగా చిత్రకారుడు తన శైలి, మెటీరియల్‌ను గానీ పరిచయం చేసేందుకే అర్ధగంట నుంచి గంట సమయం పడుతుంది. ఆ గంట, అర్ధగంట సమయంలోనే రమారమి 5 నుండి 8 చిత్రాలను భిన్నంగా ఉండేలా చిత్రించి చూపడం రామకృష్ణ ప్రత్యేకతగా చెప్పొచ్చు. ఒక చిత్రకారుడి జీవితకాలపు కృషినీ, సాఫల్యాన్ని రికార్డు చేయగల మోనోగ్రాఫ్‌ను ఏదైనా ఒకదాన్ని తీసుకుని పరిశీలించినట్లయితే... రైటప్‌తో కలుపుకుని మహా అయితే 50, 60 పుటలు మించదు. పోనీ 100 పుటలనుకుందాం. రామకృష్ణ 2010 మే 20న ప్రదర్శించిన 13 గంటల 26 నిమిషాల అపురూప ఘట్టాన్ని సుమారు 472 పుటల మోనోగ్రాఫ్‌గా సంతరించారు. 100 చిత్రాలను రచించిన 13:26 గంటల కృషి ఒక ఎత్తయితే, ఆ కృషిని పొందుపరచిన ఈ గ్రంథం అంతకు మించిన కృషి.

"నేను నా చేతుల్ని నమ్ముకున్నాను. అవి నన్ను నిలబెట్టాయి" అని గర్వంగా చెబుతున్నారు ఆత్మకూరు రామకృష్ణ. పలువురు ఆయనను 'మునివేళ్ళ మాయావి', 'కళాకృష్ణుడు", 'చేతికి బాగా పట్టిన రంగు', అంటూ పలువురు అభినందిస్తున్నారు. ఆత్మకూరు రామకృష్ణ తన మోనోగ్రాఫ్‌కు తానే రచయితగా మారి రాయటం, ఇందులో వినియోగించబడ్డ అన్ని తైలవర్ణ చిత్రాలు ఒక్క రోజులోనే (806 ని.లలో) వేయడంతో- 'ఫాస్టెస్టు పెయింటర్'గా రికార్డు నెలకొల్పారు.

- యడవల్లి శ్రీనివాసరావు



పుస్తకాలు అడిగితే పోలీస్ జులుం

ఇంటర్‌బోర్డు వద్ద ఎస్ఎఫ్ఐ ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని ఆందోళన నిర్వహించిన ఎస్ఎఫ్ఐ నాయకులను రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో అరెస్టులు చేయించింది. ఖాళీ అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ బుధవారం ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం వద్ద ధర్నాకు పిలుపునిచ్చింది. బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని బోర్డు వద్దకు చేరుకున్నారు. అక్కడే బైఠాయించి పుస్తకాలు ఇవ్వాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమానికి అనుమతి లేదని పోలీసులు వారిని బలవంతంగా తరలించేందుకు ప్రయత్నించగా.. నాయకులు ప్రతిఘటించారు. ఈ నేపథ్యంలో అక్కడ స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు వారిని బలవంతంగా ఈడ్చుకెళ్లి వ్యాన్‌లలో పడేశారు. అక్కడ నుంచి మంగళగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీకి ప్రభుత్వం నిరాకరిస్తుందంటే వారి చదువును దూరం చేయడమే తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. అమ్మఒడి బూచి చూపించి ఎగ్గొట్టడం ప్రభుత్వానికి సిగ్గుచేటు అని ఆగ్రహించారు. జూని యర్ కళాశాలల్లో 3 వేలకు పైగా అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయకపోవడం దుర్మార్గమన్నారు. పుస్తకాలు, అధ్యాపకులు లేకపోవడంతోనే గత విద్యా సంవత్సరం జూనియర్ కళాశాలల్లో 36 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారని, ప్రభుత్వం దీనిని గుర్తుంచుకోవాలని అన్నారు. 474 కళాశాలల్లో 210 ప్రిన్సిపల్స్ లేరని, 26 జిల్లాలకు రెగ్యులర్ ఆర్ఐఒలు, 13 డిప్యూటీ ఇఒలు లేరని చెప్పారు. దీనివల్ల ఇంటర్మీడియట్ అడ్మినిస్ట్రేషన్ సిలబస్ ప్రణాళిక తూతూ మంత్రంగా నడుస్తుందని పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థులకు గత ప్రభుత్వం అమలు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం నిలిపేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'నేను విన్నాను' అన్న సిఎం జగన్‌కు విద్యార్థుల దగ్గర నుంచి కూడు లాక్కోవడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ఉపాధ్యక్షులు రమేష్, సిహెచ్ వెంకటేశ్వరరావు, నాయకులు రాజా, ఎం సోమేశ్వరరావు, కుమార స్వామి, రాజు,నవిత, జ్యోతి, రత్నకుమారి, బాలాజీ ఉన్నారు.

అరెస్టులను ఖండించిన సిపిఎం


సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థి నాయకులను అరెస్టు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండించింది. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం వర్తింపజేయాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన కోర్కెలు తీర్చాల్సిన ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయో గించి నాయకులను అరెస్టు చేయడం గర్హనీయమని పేర్కొన్నారు.

అరెస్టయిన వారిని పరామర్శించిన మధు

పోలీసులు అరెస్టు చేసిన వారిని సిపిఎం సీనియర్ నాయకులు పి మధు పరామర్శించారు. పోలీస్ స్టేషన్ నుంచి విడుదలైన వారిని మంగళగిరిలోని పరామర్శించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. విద్యారంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న విధానాల వల్ల పేదలకు విద్య దూరమయ్యే దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో ఇప్పటికే ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టడంతో అది చదవలేని పేదలు చదువుకు దూరమవుతున్నారని అన్నారు. మూడు, నాలుగు, ఐదు తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయడం వల్ల లక్షల మంది విద్యార్థులు స్కూళ్లకు వెళ్లడం లేదని తెలిపారు. టీచర్ పోస్టులను భర్తీ చేయని దృష్ట్యా ఉత్తీర్ణత శాతం తగ్గుతోందని, ఈ అంశాన్ని ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శించారు. విద్యా రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో నిధులు తగ్గిస్తున్నాయని, పేదలకు విద్యను దూరం చేసే విధానాలను అవలంభిస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యారంగంలో సమస్యలపై విద్యార్థులు సంఘటితంగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షులు పరమేష్, నాయకులు ఎం బాలాజీ సోమేశ్వరావు, వెంకటేశ్వర్లు, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న పాల్గొన్నారు.

రోడ్రిగ్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శన

- రెండో వన్డేలో 108పరుగుల తేడాతో గెలుపు
- బంగ్లాదేశ్ మహిళలతో వన్డే సిరీస్



ఢాకా: బంగ్లాదేశ్ మహిళలతో జరిగిన రెండో వన్డేలో భారత మహిళలజట్టు చెలరేగింది. తొలి వన్డేలో ఓటమికి భారత అమ్మాయిలు బదులు తీర్చుకున్నారు. జెమీమా రోడ్రిగ్స్ బ్యాటింగ్‌లో రాణించి 86పరుగులు చేయడంతో పాటు బౌలింగ్ చేసి నాలుగు వికెట్లు తీసి టీమిండియా గెలుపులో కీలకపాత్ర పోషించింది. ఢాకా వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో వన్డేలో హర్మన్‌ప్రీత్ సేన 108 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన శుభారంభం దక్కలేదు. ఓపెనర్ ప్రియా పునియా (7) త్వరగానే పెవిలియన్‌బాట పట్టింది. అయితే, యస్టికా భాటియా(15)తో కలిసి మరో ఓపెనర్ స్మృతి మంధాన(36) ఇన్నింగ్స్‌ను నిలబెట్టేందుకు ప్రయత్నించింది. కానీ, వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో పెవిలియన్‌కు చేరడంతో భారత్ కష్టాల్లో పడింది. జెమీమా రోడ్రిగ్స్(86), కెప్టెన్ హర్మన్ ప్రీత్(52) నాల్గో వికెట్‌కు 131 పరుగులు జోడించారు. హర్లీన్ డియోల్ (25)కూడా బ్యాట్‌ను ఝుళిపించడంతో భారత్ మంచి స్కోరునే బోర్డుపై ఉంచగలిగింది. ఆఖర్లో వరుసగా వికెట్లు పడకుండా ఉంటే మెరుగైన స్కోరు సాధించే అవకాశం ఉండేది. బంగ్లా బౌలర్లు సుల్తానా ఖతున్, నహిదా అక్తర్‌కు రెండేసి, మరుఫా అక్తర్, రబెయా ఖాన్ చెరో వికెట్ తీసారు. ఛేదనలో బంగ్లాదేశ్ 35.1 ఓవర్లలో 120 పరుగులకే కుప్పకూలింది. బంగ్లాదేశ్ బ్యాటర్ ఫర్గానా హక్(47), రితు మోని (27) మాత్రమే కాస్త పోరాడారు. భారత బౌలర్లలో జెమీమా రోడ్రిగ్స్‌కు నాలుగు, దేవికా వైద్యకు మూడు.. మేఘ్నా సింగ్, దీప్తి శర్మ, స్నేహ్ రాణాకు ఒక్కో వికెట్ దక్కాయి. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో ఇరుజట్లూ 1-1తో సమంగా ఉండగా.. చివరి వన్డే జులై 22న జరగనుంది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన జెమీమా రోడ్రిగ్స్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

కదం తొక్కిన కుర్రాళ్లు

- పాకిస్తాన్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపు
- ఎసిసి ఎమర్జింగ్ ఆసియాకప్

కొలంబో: ఎసిసి ఎమర్జింగ్ ఆసియాకప్‌లో భారత్-ఎ జట్టు పాకిస్తాన్-ఎపై 8వికెట్ల తేడాతో గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్-ఎ జట్టు 48ఓవర్లలో 205పరుగుల కు ఆలౌటైంది. హంగ్రేకర్ (5/42), మానవ్ (3/36) బౌలింగ్‌లో మెరిసారు. పాక్ జట్టులో ఖాసిం అక్రమ్(48), ఫర్హాన్(35) టాప్ స్కోరర్స్. ఛేదనలో భారత్-ఎ ఓపెనర్ సాయి సుదర్శన్ (104నాటౌట్; 110 బంతుల్లో 10ఫోర్లు, 3సిక్సర్లు), నికిన్ జోస్(53), బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో గ్రూప్-ఎలో భారత్ 6పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సాయి సుదర్శన్‌కు లభించింది. శుక్రవారం జరిగే సెమీస్‌లో భారత జట్టు బంగ్లాదేశ్-ఎతో, పాకిస్తాన్ జట్టు శ్రీలంక-ఎతో తలపడనున్నాయి.

పాయింట్ల పట్టిక

గ్రూప్-ఎ	మ్యా	గె	ఓ	పా	నె.ర.
శ్రీలంక-ఎ	**3**	**2**	**1**	**4**	**+1.69**
బంగ్లాదేశ్-ఎ	**3**	**2**	**1**	**4**	**+1.26**
ఆఫ్ఘనిస్తాన్-ఎ	3	2	1	3	+0.44
ఓమన్-ఎ	3	0	3	0	-3.24
గ్రూప్-బి					
ఇండియా-ఎ	**3**	**3**	**0**	**6**	**+2.92**
పాకిస్తాన్-ఎ	**3**	**2**	**1**	**4**	**+1.47**
నేపాల్-ఎ	3	1	2	2	-0.75
యుఎఇ-ఎ	3	0	3	0	-3.45

సిరీస్‌పై గురి..

- నేటినుంచి భారత్-వెస్టిండీస్ రెండోటెస్ట్
- రాత్రి 7.30గం॥ల నుంచి

ట్రినిడాడ్: తొలిటెస్ట్‌లో ఘన విజయం సాధించిన టీమిండియా.. ఇక సిరీస్‌పై కన్నేసింది. రెండు టెస్ట్‌మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా డొమెనిక వేదికగా జరిగిన తొలిటెస్ట్‌లో భారత్ ఇన్నింగ్స్ 141 పరుగుల తేడాతో ఆతిథ్య జట్టును చిత్తుచేసింది. ఈ క్రమంలో రెండోటెస్ట్‌లోనూ గెలిచి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సర్కిల్‌లో మెరుగైన రన్‌రేట్‌కోసం ప్రయత్నిస్తోంది. ఈ టెస్ట్ మ్యాచ్‌లోనూ భారత్ గెలిస్తే సిరీస్‌ను 2-0తో చేజిక్కించుకోనుంది. తొలిటెస్ట్‌లో అరంగేట్రం యువ క్రికెటర్ యశస్వీ జైస్వాల్ 171పరుగులు చేసి టీమిండియా గెలుపులో కీలకపాత్ర పోషించాడు. ఇక బౌలింగ్‌లో రవిచంద్రన్ అశ్విన్ 12 వికెట్లు తీశాడు. దీంతో రెండోటెస్ట్‌కు భారత్ పెద్దగా మార్పుల్లేకుండానే బరిలోకి దిగే అవకాశముంది. మరోవైపు వెస్టిండీస్ జట్టు అటు బ్యాటింగ్‌లో, ఇటు బౌలింగ్‌లో నిరాశపరుస్తోంది. తొలి టెస్ట్ కేవలం మూడురోజుల్లోనే ముగియడంతో కనీసం ఈ టెస్ట్‌లోనైనా భారత్‌కు గట్టి పోటీనివ్వాలని భావిస్తోంది.

ఆసియాకప్ షెడ్యూల్ వచ్చేసింది..

- భారత్ తొలి ప్రత్యర్థి పాకిస్తాన్



లాహోర్: ఆసియా కప్ షెడ్యూల్‌ను ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఎసిసి) బుధవారం విడుదల చేసింది. ఆగస్ట్ 30 నుంచి సెప్టెంబర్ 17వ ఆసియా కప్-2023 టోర్నీ జరగనుంది. ఆరు దేశాలు పాల్గొనే టోర్నమెంట్‌కు పాకిస్తాన్, శ్రీలంక ఆతిథ్యమివ్వనున్నాయి. లీగ్ దశ భాగంగా పాకిస్తాన్‌లో నాలుగు మ్యాచ్‌లు, శ్రీలంకలో మొత్తం తొమ్మిది మ్యాచ్‌లు లెక్కన హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించేందుకు ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఎసిసి) నిర్ణయం తీసుకుంది. ఆసియాకప్ క్రికెట్ టోర్నమెంట్ షెడ్యూల్ విడుదలైంది. మొత్తం 6జట్ల మధ్య ఆసియాకప్ టోర్నీ జరగనుంది. ఆరు జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. భారత్, పాకిస్తాన్ జట్లు గ్రూప్-ఎలో చోటు దక్కించుకొన్నాయి. ఈ రెండుజట్ల మధ్య సెప్టెంబర్-2న శ్రీలంకలోని కాండీ మైదానంలో లీగ్ మ్యాచ్ జరగనుంది. లీగ్ దశ ముగిసిన అనంతరం ప్రతి గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన జట్లు సూపర్-4లో ఆడనున్నాయి. సూపర్-4లో పాకిస్తాన్-భారత్ జట్లు తలపడాల్సి వస్తే ఆ మ్యాచ్‌కు కొలంబోలో జరగనుంది. ఫైనల్ మ్యాచ్ వేదికను ఇంకా ఖరారు చేయలేదు. టోర్నీకి పాకిస్తాన్ ఆతిథ్యమివ్వాల్సి ఉండగా.. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో భారతజట్టును పాకిస్తాన్‌కు పంపేందుకు బిసిసిఐ అనుమతివ్వని సంగతి తెలిసిందే.

గ్రూప్-ఏ: ఇండియా, పాకిస్తాన్, నేపాల్
గ్రూప్-బి: శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్

షెడ్యూల్..

ఆగస్టు 30 : పాకిస్తాన్×నేపాల్(ముల్తాన్,పాక్)
ఆగస్టు 31 : బంగ్లాదేశ్×శ్రీలంక(కాండీ, శ్రీలంక)
సెప్టెంబర్ 2 : ఇండియా×పాకిస్తాన్(కాండీ, శ్రీలంక)
సెప్టెంబర్ 3 : బంగ్లాదేశ్×ఆఫ్ఘనిస్తాన్(లాహోర్, పాక్)
సెప్టెంబర్ 4 : ఇండియా × నేపాల్(కాండీ, శ్రీలంక)
సెప్టెంబర్ 5 : ఆఫ్ఘనిస్తాన్ × శ్రీలంక(లాహోర్, పాక్)
సెప్టెంబర్ 6-15: సూపర్-4మ్యాచ్‌లు(కొలంబో, శ్రీలంక)
సెప్టెంబర్ 17 : ఫైనల్

ప్రముఖ కథా రచయిత శ్రీరమణ కన్నుమూత

'మిథునం' సినిమాకు కథను అందించిన వ్యాసకర్త



హైదరాబాద్ : టాలీవుడ్‌లో మరో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ సినీ రచయిత, వ్యంగ్య వ్యాసకర్త శ్రీరమణ(70) కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన బుధవారం తెల్లవారుజామున ఐదు గంటలకు తుదిశ్వాస విడిచారు. జాతీయ అవార్డు అందుకున్న 'మిథునం' సిని మాకు కథను ఆయనే అందించారు. శ్రీరమణది గుంటూరు జిల్లా వేమూరు మండలం వరహా పురం అగ్రహారం. తెలుగు సినీ పరిశ్రమ దిగ్గజాలైన బాపు, రమణలతో కలిసి ఆయన పని చేశారు. 2014లో హాస్య రచన విభాగంలో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. 'పత్రిక' అనే మాస పత్రికకు శ్రీరమణ గౌరవ సంపాదకుడిగా వ్యవహరించారు. ఇదే సమయంలో సాహిత్య, కళారంగాల్లో తనదైన సేవ చేశారు. శ్రీరమణ మృతి పట్ల సినీ ప్రముఖులు సంతాపాన్ని తెలిపారు.

21న 'అన్నపూర్ణ ఫొటో స్టూడియో' విడుదల

లావణ్య, చైతన్యరావు జంటగా నటించిన చిత్రం 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో'. ఈ చిత్రాన్ని బిగ్ బెన్ సినిమాస్ పతాకంపై యష్ రంగినేని నిర్మించారు. చెందు ముద్దు దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఈనెల 21న విడుదల కాబోతున్న నేపథ్యంలో చిత్రయూనిట్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిర్మాత యష్ రంగినేని మాట్లాడారు. తాను నిజ జీవితంలో చూసిన పాత్రలు, తమ ఊర్లోని సంఘటనల స్ఫూర్తితో రాసుకున్న కథ' అని దర్శకుడు చెందు ముద్దు చెప్పారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68